

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 9


శనివారం 1-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




గుజరాత్ ఘనంగా...

ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో చెన్నై జట్టుపై ఐదు వికెట్లతో నెగ్గిన టైటాన్స్. - 13లో



లాభాల వీడ్కోలు

సెన్సెక్స్ 1,031 పాయింట్లు, నిఫ్టీ 279 పాయింట్లు లాభం - 13లో



సిసోడియానే సూత్రధారి

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

- వివరాలు 6లో



నేడే సిద్ధూ విడుదల!

ఓ దాడి కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత నవజోత్ సింగ్ సిద్ధూ జైలు నుంచి విడుదల కానున్నట్లు సమాచారం.

- వివరాలు 6లో



ఇండోర్‌లో 36కు చేరిన మరణాలు

బేలేశ్వర్ మహాదేవ్ ఝులేలాల్ ఆలయంలో మెట్ల బావి పైకప్పు కూలిన ఘటనలో మృతుల సంఖ్య 36కి చేరుకుంది.

- వివరాలు 6లో



'మూన్ టు మార్స్' తొలి చీఫ్‌గా..

నాసా 'మూన్ టు మార్స్' హెడ్‌గా భారత సంతతికి చెందిన రోబోటిక్స్ ఇంజనీర్ అమిత్ క్షత్రియ నియమితులయ్యారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

ప్రజలు నిర్ణయిస్తేనే బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు



బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ పార్టీ పొత్తు అంశాన్ని ఎన్నికలు వచ్చినప్పుడు, తప్పదు అనుకున్నప్పుడు ప్రజలు నిర్ణయిస్తారని మాజీమంత్రి జానారెడ్డి అన్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలతో కలిసి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

- వివరాలు 2లో

'ఎంసెట్' షెడ్యూల్‌లో స్వల్పమార్పులు



తెలంగాణ ఎంసెట్–2023 పరీక్ష తేదీలు మారనున్నాయి. ఇప్పటికే ప్రకటించిన తేదీల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో యూజీ నీట్ పరీక్షలు జరగనుండగా.. మరోవైపు టీఎస్‌పీఎస్సీ పరీక్షలు సైతం ఉన్నాయి. దీంతో ఎంసెట్–2023 పరీక్ష తేదీల్లో స్వల్ప మార్పులు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

- వివరాలు 14లో

నేటి నుంచి క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్వీకరణ



జీవో 58, 59ల ద్వారా ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ప్రక్రియ నేటి నుంచి మరోమారు ప్రారంభం కానుంది. ఈనెల 1 నుంచి 30 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది.

- వివరాలు 3లో

పేపర్ల లీకేజీ వ్యవహారంలో సెక్రెటరీ, సభ్యుడికి నోటీసులు

టీఎస్‌పీఎస్సీకి సిట్ టెస్ట్!

ఒకట్రెండు రోజుల్లో చైర్మన్‌కు కూడా ఇవ్వడానికి సన్నాహాలు

- ముగ్గురి వాంగ్మూలాలు నమోదు చేయాలని అధికారుల నిర్ణయం
- ప్రశ్నపత్రాల 'మార్పిడి' మొత్తం హార్డ్‌కాపీల రూపంలోనే..
- కేవలం ఇద్దరికి మాత్రమే 'ఎనీడెస్క్' ద్వారా చేరవేత
- ఈ యాక్సెస్ కోసమే షమీమ్‌కు గ్రూప్–1 పేపర్ ఆఫర్
- సాంకేతిక ఆధారాలూ చిక్కకూడదనే రాజశేఖర్‌రెడ్డి జాగ్రత్తలు



ఫోరెన్సిక్ పరీక్షలకు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్

షమీమ్, రమేశ్, సురేశ్‌లను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న సిట్ అధికారులు.. ఈ అంశాలను నిర్ధారించుకోవడంతోపాటు న్యూజిలాండ్‌లో ఉన్న ది మినహా మిగతా కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపనున్నారు. మరోవైపు సిట్ అధికారులు గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 100 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన 121 మందినీ ప్రశ్నిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం నాటికి 103 మందిని విచారించామని, ఎలాంటి అనుమానాస్పద అంశమూ తమ దృష్టికి రాలేదని సిట్ అధికారులు చెప్తున్నారు.

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పేపర్ల లీకేజీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డి, చైర్మన్ జనార్దనరెడ్డిల వాంగ్మూలాలను నమోదు చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించింది. ఇందులో భాగంగా అధికారులు శుక్రవారం అనితా రామచంద్రన్, లింగారెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. జనార్దనరెడ్డికి నోటీసులు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ముగ్గురికీ అనువైన సమయంలో సిట్ అధికారులే టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వెళ్లి వాంగ్మూలాలు తీసుకోనున్నారు. ఇక లీకైన 'పేపర్ల 'మార్పిడి' మొత్తం హార్డ్‌కాపీల (ప్రింటెడ్ కాపీల) రూపంలోనే జరిగిందని.. కేవలం ఇద్దరికి మాత్రమే ఎనీడెస్క్ అప్లికేషన్ ద్వారా అందిందని సిట్ అధికారులు తేల్చారు. రాజశేఖర్‌రెడ్డి తనకు కంప్యూటర్ యాక్సెస్ ఇచ్చినందుకు ప్రతిఫలంగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌ఓ) షమీమ్‌కు గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం అందించాడని గుర్తించారు.

ప్రతి అంశాన్ని పరిశీలిస్తూ..

సిట్ అధికారులు ఏప్రిల్ 11న హైకోర్టుకు స్టేటస్ రిపోర్టు సమర్పించాల్సి ఉంది. దీంతో ప్రతి అంశంలోనూ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రతి అంశంలో న్యాయ నిపుణులు, న్యాయ సలహాదారుల అభిప్రాయం తీసుకుంటున్నారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి చైర్మన్ నేతృత్వంలో పనిచేయడంతో పాటు కార్యనిర్వాహక బాధ్యతలను

మిగతా 2వ పేజీలో ▶

'లీకేజీ'లో మనీ లాండరింగ్

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై ఈడీకి రేవంత్‌రెడ్డి ఫిర్యాదు
- హవాలా రూపంలో భారీగా సొమ్ము చేతులు మారింది
- రూ.100 కోట్లు ఇస్తే కేటీఆర్‌ను బూతులు తిట్టొచ్చా అని ప్రశ్న

2లో



బీఆర్‌ఎస్ ఆఫీసులో రూ. 75 కోట్లు ఇచ్చా



అరవింద్ కేజ్రీవాల్ ఆదేశాలతోనే: సుఖేశ్ చంద్రశేఖర్

- ఈ మేరకు తీహార్ జైలు నుంచి న్యాయవాది ద్వారా లేఖ విడుదల
- కేజ్రీవాల్ అవినీతి బాగోతం బహిర్గతం చేస్తా..
- 700 పేజీల వాట్సాప్, టెలిగ్రామ్ చాటింగ్ నా వద్ద ఉంది
- నేను బయటపెట్టే నిజాలతో కేజ్రీవాల్ గద్దె దిగడం ఖాయమని వ్యాఖ్య

న్యూఢిల్లీ: రూ.200 కోట్ల మనీ లాండరింగ్ కేసులో అరెస్టయ్యి, ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ మరో బాంబు పేల్చాడు. 2020లో హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సమితి (ఇప్పుడు భారత్ రాష్ట్ర సమితి) కార్యాలయంలో 'ఏపీ' అనే వ్యక్తికి రూ.75 కోట్లు అందజేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, అప్పటి ఢిల్లీ మంత్రి సత్యేంద్ర జైన్ తనను ఆదేశించారని వెల్లడించాడు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో భాగస్వామి అయిన 'ఏపీ' అనే వ్యక్తికి టీఆర్‌ఎస్ ఆఫీసులో రూ.75 కోట్లు అందజేశానని తెలియజేశాడు. ఒక్కో పెట్టెలో 15 కిలోల నెయ్యి (కోడ్ భాషలో రూ.15 కోట్లు) ఉందని, మొత్తం 5 పెట్టెలు (రూ.75 కోట్లు) హైదరాబాద్‌లో సిద్ధంగా ఉన్నట్లు కేజ్రీవాల్ తనతో చెప్పారని, ఆయన ఆదేశాల మేరకు వాటిని టీఆర్‌ఎస్ కార్యాలయంలో సంబంధిత వ్యక్తికి చేరవేశానని స్పష్టం చేశాడు. సదరు వ్యక్తి టీఆర్‌ఎస్ ఆఫీసు ప్రాంగణంలో రేంజ్ రోవర్ కారులో కూర్చొని ఉండగా డబ్బులు అందజేశానని తెలిపాడు. ఈ మేరకు సుకేశ్ శుక్రవారం తన న్యాయవాది అనంత్ మాలిక్ ద్వారా ఒక లేఖ విడుదల చేశాడు. 2020లో తనకు, కేజ్రీవాల్‌కు మధ్య నడిచిన చాటింగ్ గురించి సుఖేశ్ చంద్రశేఖర్ ఇందులో ప్రస్తావించాడు. కేజ్రీవాల్ కరడుగట్టిన అవినీతిపరుడని, ఆయన బాగోతం మొత్తం బయటపెడతానని లేఖలో పేర్కొన్నాడు. ఇది ట్రైలర్ మాత్రమేనని.. తాను, కేజ్రీవాల్ పరస్పరం పంపించుకున్న సందేశాలను బహిర్గతం చేస్తానని వెల్లడించాడు. 700 పేజీల వాట్సాప్, టెలిగ్రామ్ చాటింగ్ తన వద్ద ఉందన్నాడు. తాను బయటపెట్టే నిజాలతో కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కుర్చీ నుంచి దిగిపోవడం ఖాయమని వ్యాఖ్యానించాడు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ ఒక జోక్‌గా మారిపోతున్నాయని ఎద్దేవా చేశాడు.

తీహార్ క్లబ్‌లోకి కేజ్రీవాల్

ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీశ్ సిసోడియా తర్వాత అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కావడం తథ్యమని సుఖేశ్ చంద్రశేఖర్ ఇటీవలే

మిగతా 2వ పేజీలో ▶

బీజేపీ చేతిలో కీలుబొమ్మ సుఖేశ్!

- కేసీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేసే కుట్ర: బీఆర్‌ఎస్ నేతల ఫైర్
- బీజేపీ కొత్త డ్రామా ఇదని విమర్శ

2లో



రామయ్య పట్టాభిషేక మహోత్సవం భద్రాచలంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. సీతమ్మ జన్మించిన శోభకృత్ నామ సంవత్సరంలో పుష్కర పట్టాభిషేకం రావడంతో అమ్మవారికి తొలిసారిగా రాణీమకుటాన్ని ధరింపజేశారు. భద్రాచల ఆలయ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. 14లో

సారీ.. మమ్మీ!

హాస్టల్ గదిలో ఉరేసుకుని వైద్య విద్యార్థి బలవన్మరణం

- నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్న సనత్
- అప్పటివరకు సినిమా చూసి.. స్నేహితులతో గడిపి.. అంతలోనే విషాదం
- వాట్సాప్ గ్రూప్‌లో 'సారీ.. మమ్మీ, డాడీ, అన్నయ్యా' అంటూ మెసేజ్
- తిరుపతి వెళ్దామన్నాడు.. అంతలోనే ఇలా అంటూ తల్లిదండ్రుల రోదనలు
- అనుమానాస్పద మృతిగా కేసు
- గడిచిన 10 నెలల్లో ముగ్గురు వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు

5లో



స్నేహితులతో కలిసి గురువారం సినిమా చూసి, అర్ధరాత్రి వరకు వారితో కలిసి చదువుకున్న ఎంబీబీఎస్ సెకండియర్ విద్యార్థి సనత్.. తెల్లారేసరికి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. తిరుపతి వెళ్దామన్న కుమారుడు ఇంతలోనే ఇలా చేస్తాడనుకోలేదంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

నిద్రలోనే.. గుండెపోటుతో 13 ఏళ్ల బాలిక మృతి



స్రవంతి (ఫైల్)

రాత్రి వరకు ఇంటి వద్ద తోటిపిల్లలతో ఆడుకుంది. అనంతరం తన నానమ్మతో కలిసి నిద్రపోయింది. తెల్లవారుజామున లేచి ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పింది. ఆయాసపడుతున్నట్టు కనిపించడంతో చిన్నాన్న వచ్చి సీపీఆర్ చేసి స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యుడు చెప్పాడు. ఆరో తరగతి చదువుతున్న స్రవంతి అనే పదమూడేళ్ల బాలిక విషాదాంతమిది.

వివరాలు 5లో



మోదీ సర్టిఫికెట్లు బయటపెట్టాల్సిన

అవసరం లేదు

గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు రూ. 25,000 జరిమానా

ప్రధాని విద్యార్హతలను తెలుసుకొనే హక్కు ప్రజలకు లేదా?: కేజ్రీవాల్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్హతలకు సంబంధించిన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని గుజరాత్ హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ సర్టిఫికెట్లను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అందజేయాలంటూ కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఏడేళ్ల క్రితం జారీచేసిన ఉత్తర్వును న్యాయస్థానం కొట్టివేసింది. అంతేకాకుండా కేజ్రీవాల్‌కు రూ.25,000 జరిమానా విధించింది. జరిమానా సొమ్మును నాలుగు వారాల్లోగా గుజరాత్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ (జీఎస్‌ఎల్‌ఎస్‌ఏ)లో డిపాజిట్ చేయాలంటూ కేజ్రీవాల్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వు జారీచేసింది. ఉత్తర్వుపై స్టే ఇవ్వాలన్న కేజ్రీవాల్ తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది.

> ప్రధాని విద్యార్హతలను తెలుసుకొనే హక్కు దేశ ప్రజలకు లేదా?. సర్టిఫికెట్లను కోర్టుకు చూపించేందుకు ప్రధాని ఎందుకు తిరస్కరించారు? నిరక్షరాస్యుడు లేదా తక్కువ చదువుకున్న ప్రధానమంత్రి దేశానికి ప్రమాదకరం
>
> \- కేజ్రీవాల్



6లో

ముద్దాయి డొనాల్డ్ ట్రంప్

ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదు చేసిన న్యూయార్క్ జ్యూరీ

క్రిమినల్ కేసులో విచారణ ఎదుర్కోనున్న అమెరికా తొలి మాజీ అధ్యక్షుడు

- పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు డబ్బులిచ్చిన అనైతిక ఒప్పందం కేసులో ఎదురుదెబ్బ..
- న్యాయవ్యవస్థను ఆయుధంగా వాడుకుంటున్నారు: ట్రంప్
- అరెస్టయితే ట్రంప్ భవిష్యత్‌పై చర్చోపచర్చలు

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అరెస్టయ్యే అవకాశాలున్నాయి. పోర్న్‌స్టార్ స్టార్మీ డేనియెల్స్‌తో ఉన్న లైంగిక సంబంధాలు బయటపెట్టకుండా ఉండేందుకు ఆమెకు డబ్బులు చెల్లించి అనైతిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారన్న ఆరోపణల కేసులో ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. మన్‌హట్టన్ గ్రాండ్ జ్యూరీ నేరాభియోగాలు నమోదు చేసినట్టుగా ధ్రువీకరించింది. మరోసారి వైట్‌హౌస్‌లోకి అడుగుపెట్టాలని కలలు కంటున్న వేళ నేరాభియోగాలు నమోదు కావడం నైతికంగా ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలినట్టయింది.



> రాజకీయంగా నన్ను అణచివేయడానికి డెమొక్రాట్లు ఈ కుట్రకు పాల్పడ్డారు. అధ్యక్షుడు బైడెన్ ఏం చెబితే మన్‌హట్టన్ జ్యూరీ అదే చేస్తోంది
>
> \- డొనాల్డ్ ట్రంప్

6లో

నడుస్తున్న కారులో గ్యాంగ్‌రేప్

బెంగళూరులో దారుణం.. ఢిల్లీ నిర్భయ దురాగతాన్ని తలపిస్తూ నలుగురు కామాంధులు నడుస్తున్న కారులో యువతిపై 8 గంటల పాటు అత్యాచారానికి ఒడిగట్టారు. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువతి (19) తన స్నేహితుడితో కలసి కోరమంగళలోని నేషనల్ గేమ్స్ విలేజ్ పార్కులో కూర్చుని ఉండగా, గొడవపడిన యువకులు.. ఆమెను బలవంతంగా కారులోకి లాక్కెళ్లి వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తూ ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు.

6లో



ఇదం జగత్



..ఏ లొల్లి లేకుండా హాయిగా ఉంది సార్!

తెలంగాణ శత్రుదేశమా?

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మంత్రి కేటీఆర్ ధ్వజం

- రాజకీయంగా పడనందునే ఇబ్బందులకు గురిచేస్తోంది
- ఎంత ఇబ్బంది పెట్టినా అభివృద్ధిలో మనమే టాప్
- రాష్ట్రంలోని ప్రతీ పంచాయతీకి కొత్త కంప్యూటర్లు ఇస్తాం



ఏజీవర్సిటీ (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం తెలంగాణను శత్రుదేశంగా చూస్తోందని, రాజకీయంగా పడనందునే మనల్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రం ఎంత ఇబ్బంది పెట్టినా దేశంలో అభివృద్ధిలో మనమే టాప్‌లో నిలిచామని చెప్పారు. కరోనాతో రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల నష్టం వచ్చిందని, అయినా ఎక్కడ కూడా అభివృద్ధి ఆగలేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కేటీఆర్ శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కార్మిక మంత్రి మల్లారెడ్డిలతో కలిసి జాతీయ పంచాయతీ అవార్డులను ప్రదానం చేశారు. దేశంలో 70 శాతం ప్రజలు పల్లెల్లోనే జీవిస్తున్నారని తెలంగాణలో పల్లె ప్రగతి కోసం రూ.14,232 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. కేంద్రం నిధులు

మిగతా 2వ పేజీలో ▶

భారీ ఖర్చుకు బీఆర్‌ఎస్ సిద్ధం?

రాష్ట్ర పార్టీతో బీజేపీ జాతీయ నేతలు!

- ప్రలోభాలకు తెరదీయబోతోందని, వాటిని సమర్థంగా ఎదుర్కోవాలని పిలుపు
- ప్రతి ఒక్కరినీ ఎన్నికల యుద్ధానికి సిద్ధం చేయాలని సూచన
- రాష్ట్ర పదాధికారుల భేటీలో కీలక నిర్ణయాలు
- పాల్గొన్న సునీల్ బన్సల్, శివప్రకాష్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కార్ ఎన్నికల్లో భారీ ఎత్తున నిధులు ఖర్చు పెట్టబోతోంది. పెద్ద ఎత్తున ప్రలోభాలకు తెరదీయబోతోంది. వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. తెలంగాణలో 2 లక్షల మంది బీజేపీ కార్యకర్తలున్నారు. ప్రతి ఒక్కరినీ ఎన్నికల యుద్ధానికి సిద్ధం చేయండి..' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, పార్టీ జాతీయ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌లు రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. 'తెలంగాణలో బీజేపీ గెలవబోతోంది. మరో 6 నెలలు మాత్రమే మనకు సమయం ఉంది. ఆ తర్వాత ఎన్నికల టైం. రాష్ట్రానికి కేసీఆర్ చేసిన ద్రోహాన్ని, మోసాలను వివరించాలి. మండలాలు, నియోజకవర్గాల వారీగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలి..' అని పిలుపునిచ్చినట్టు సమాచారం. బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు సాగింది. సుమారు నాలుగు గంటల పాటు జరిగిన ఈ భేటీలో జాతీయ

మిగతా 5వ పేజీలో ▶

రాష్ట్రంపై కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

సాక్షి, హైదరాబాద్: తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ మీదుగా తెలంగాణ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. శుక్రవారం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. అదిలాబాద్‌లో 37.8 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, మెదక్‌లో 20.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	40.1	21.9
ఆదిలాబాద్	37.8	20.7
నిజామాబాద్	37.1	24.0
భద్రాచలం	37.0	25.5
మహబూబ్‌నగర్	37.0	25.0
ఏలూరు	37.0	26.0
రామగుండం	36.4	25.2
హైదరాబాద్	36.2	25.0
ఖమ్మం	36.2	24.6
దుండిగల్	36.1	21.6
హకీంపేట్	36.0	22.8
తిరుపతి	36.0	25.0
మెదక్	35.8	20.3
నల్లగొండ	35.5	20.4
హనుమకొండ	34.0	23.5
విశాఖపట్నం	33.6	24.8

క్లుప్తంగా...

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పనికిమాలిన వ్యక్తి

రాహుల్ గొంతు నొక్కేందుకే కేంద్రం కుట్రలు: రేణుకాచౌదరి



కవాడిగూడ: కేంద్రమంత్రి కిరణ్ రిజిజుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనో పనికిమాలిన వ్యక్తి అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ సికింద్రాబాద్ డీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాహుల్‌గాంధీ అడిగే ప్రశ్నలకు మోదీ ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఈ దేశ ప్రజల పక్షాన ప్రజాస్వామిక గొంతుక అని, ఆ గొంతును ఎంత నొక్కితే అంతమంది రాహుల్‌గాంధీలు బయటకు వస్తారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు.

టీఎస్‌పీఎస్సీని వెంటనే బర్తరఫ్ చేయాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



శాంతినగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలకు పాల్పడి 30 లక్షల నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని, గవర్నర్ కల్పించుకుని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి మార్చి 14న చెప్పిన కథకు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలకు పొంతనలేకుండా పోయిందన్నారు. ప్రతిపక్షాలకు తెలవని సమాచారం కేటీఆర్‌కు మాత్రమే ఎలా తెలుస్తుందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రవీణ్ పెన్ డ్రైవ్‌లో ఏముందో ప్రెస్‌మీట్ పెట్టి, గన్‌పార్కు వద్ద ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ప్రభుత్వ వైఖరిపై పోరాడటానికి ప్రొఫెసర్ కోదండరాం, ప్రతిపక్ష నాయకులతో కలిసి ప్రణాళిక చేపడుతున్నామన్నారు.

నేనేమైనా క్రిమినల్‌నా?: షర్మిల

టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడి, అరెస్ట్



సాక్షి, హైదరాబాద్/గన్‌ఫౌండ్రీ: నాకు లుక్ అవుట్ ఆర్డర్ ఇవ్వడానికి నేనేమైనా క్రిమినల్‌నా? అని సీఎం కేసీఆర్ వైఖరిపై వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల మండిపడ్డారు. శుక్రవారం పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా టీఎస్‌పీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆమె ఆటోలో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల తీవ్ర ప్రతిఘటన నేపథ్యంలో ప్రభుత్వ వైఖరిపై షర్మిల ధ్వజమెత్తారు. టీఎస్‌పీఎస్సీ ముందు ఆందోళన అంటే హౌజ్ అరెస్టులు చేస్తున్నారని, గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి ఒక హోటల్ రూంలో తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అనంతరం కార్యకర్తలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాగా, టీఎస్‌పీఎస్సీ ఎదుట 144 సెక్షన్ ఉన్నందున షర్మిలను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘లీకేజీ’లో మనీ లాండరింగ్!

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై ఈడీకి రేవంత్‌రెడ్డి ఫిర్యాదు

- ఈ వ్యవహారంలో హవాలా రూపంలో భారీగా సొమ్ము చేతులు మారింది
- సిట్ కొందరినే విచారించి చాలామందిని వదిలేస్తోంది
- దీనిపై లోతుగా దర్యాప్తు చేయాలని ఈడీని కోరాం
- లీకేజీలో ప్రభుత్వ పెద్దలకు సంబంధాలు.. కేసును తప్పుదోవ పట్టించేందుకే సిట్
- పరీక్ష, అభ్యర్థుల వివరాలు కేటీఆర్‌కు ఎలా తెలుస్తున్నాయి?



మీడియాతో మాట్లాడుతున్న రేవంత్

సాక్షి, హైదరాబాద్: ‘‘ఉద్యోగార్థులు ఎంతో పవిత్రంగా భావించే టీఎస్‌పీఎస్సీ ఇప్పుడు దొంగలకు అడ్డాగా మారిపోయింది. అనర్హులను సభ్యులుగా నియమించారు. రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తును కోట్ల రూపాయలకు అమ్ముకుని తెలంగాణ పరువును బజారుకు తెచ్చారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బులు హవాలా లావాదేవీల రూపంలో చేతులు మారినట్టు అనుమానాలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఫిర్యాదు చేశాం’’అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. పరీక్షపత్రాలను అమ్ముకుంటుంటే మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వ పెద్దలను అమరవీరుల స్తూపం వద్ద ఉరి తీసినా తప్పు లేదని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి శుక్రవారం పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలతో కలసి బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లి అధికారులకు లేఖను అందజేశారు. అనంతరం కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఆధారాలు బయటపెడితే తిరిగి తమ మీదే కేసులు పెడుతున్నారని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పెద్దలకు సంబంధాలు

టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ శంకరలక్ష్మి నుంచి నేరం మొదలైతే ఆమెను సాక్షిగా పెట్టడం ఏమిటని.. పేపర్ లీక్ కేసులో ఆమెను ఏ1గా, చైర్మన్, సెక్రటరీలను ఏ2గా చేర్చాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రభుత్వ పెద్దలకు సంబంధాలు ఉన్నాయని.. దాన్ని కప్పి పెట్టడానికి, కావాల్సిన వాళ్లను కాపాడుకోవడానికే సిట్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు. గతంలో ఇలాగే సిట్ ఏర్పాటు చేసిన కేసులన్నీ తప్పుదోవ పట్టాయని.. కిందిస్థాయి ఉద్యోగులను బలిచేసి, అసలు దోషులను వదిలే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇరుకున పడ్డప్పుడల్లా సిట్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. లీకేజీ కేసులో కోట్ల రూపాయలు చేతులు మారాయని పేర్కొన్నారు. సిట్ కొద్దిమందిని విచారించి కొందరిని వదిలేస్తోందని, అందరినీ విచారించాలని ఈడీకి ఫిర్యాదు చేశామన్నారు. కేసులో సిట్ ఇప్పటి వరకు సీజ్ చేసిన వాటిని ఈడీ తీసుకోవాలన్నారు.

కేటీఆర్‌కు ఆ సమాచారం ఎవరు ఇచ్చారు?

‘‘పేపర్ లీక్ కేసులో నిందితులకు కేటీఆర్‌కు సంబంధమేమిటి? గ్రూప్–1 పరీక్షలో ఎంత మంది అర్హత సాధించారు? ఎందరు ఏ ప్రాంతం నుంచి పరీక్షలో పాల్గొన్నారు? కటాఫ్ మార్కులు ఎన్ని? ఇలాంటి వివరాలన్నీ మంత్రి కేటీఆర్‌కు ఎలా తెలుస్తున్నాయి. కమిషన్ వెల్లడించకుండా, పబ్లిక్ డొమైన్ లేకుండా కటాఫ్ మార్కులు ఎంతో కేటీఆర్‌కు ఎలా తెలిసింది? జగిత్యాల నుంచి 415 మంది గ్రూప్–1 పరీక్ష రాశారని కేటీఆర్ ఎలా చెప్పారు? ఆ సమాచారం ఎవరు ఇస్తున్నారు? సిట్ అధికారులు తాము ఇవ్వలేదంటున్నారు. మరి పేపర్ లీకేజీ దొంగలు ఇచ్చారా? ఆ దొంగలకు కేటీఆర్‌కు సంబంధం ఏంటి?’’అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్‌కు డేటా ఎవరిచ్చారో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిట్ విచారణను మంత్రి కేటీఆర్ నియంత్రిస్తున్నారని, మంత్రి చెప్పిందే సిట్ అధికారులు చేస్తున్నారని ఆరోపించారు.

వంద కోట్లిస్తే కేటీఆర్‌ను బూతులు తిట్టొచ్చా?

ప్రజాక్షేత్రంలో ఉన్నప్పుడు విమర్శలు తప్పవని.. మాట్లాడిన ప్రతిదానికి కేసులంటే కుదరదని జయలలిత వర్సెస్ సుబ్రహ్మణ్యస్వామి కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. పరువు ఉన్నవాళ్లు వేస్తే అది పరువు నష్టం అవుతుందని ఎద్దేవా చేశారు. అసలు మంత్రి కేటీఆర్ తన పరువుకు రూ.100 కోట్లు ఎలా విలువ కట్టుకుంటున్నారని, ఇదేమైనా సినిమా కాంట్రాక్ట్ ధరనా అని విమర్శించారు. రూ.100 కోట్లు ఇస్తే కేటీఆర్‌ను బూతులు కూడా తిట్టొచ్చా? అని ప్రశ్నించారు. కేటీఆర్‌కు నిజంగా పరువుంటే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసును సీబీఐకి అప్పగించాలని.. లేకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలంటూ లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఈడీకి ఫిర్యాదు చేసినవారిలో రేవంత్‌తోపాటు మల్లు రవి, మహేశ్‌కుమార్‌గౌడ్, శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్ తదితరులు ఉన్నారు.



- కేంద్రం తెచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేసుకొనే వీలు
- తద్వారా ఫోన్‌లోని డేటా దుర్వినియోగం కాకుండా నియంత్రించే అవకాశం
- పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చు
- ఫోన్ దొరికాక అన్‌బ్లాక్ చేసుకొనే వెసులుబాటు
- తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి వచ్చిన సేవలు

ఫోన్ పోయిందా ఇలా చేయండి

సాక్షి, హైదరాబాద్: మీ ఫోన్ ఈమధ్యే చోరీకి గురైందా? లేక ఎక్కడైనా పోగొట్టుకున్నారా? అందులోని డేటా దుర్వినియోగం కావొచ్చని ఆందోళన చెందుతున్నారా? ఇకపై మీకు ఆ భయం అక్కర్లేదు. ఎందుకంటే.. ఆ ముప్పు నుంచి మనల్ని బయటపడేసేందుకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని సాయంతో పోయిన లేదా చోరీకి గురైన ఫోన్‌ను ఇతరులు వాడకుండా మీరు బ్లాక్ చేయొచ్చు.

ఎలా ఉపయోగించాలంటే..

- మనం మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సీఈఐఆర్ పోర్టల్‌లోకి వెళ్లి దాన్ని బ్లాక్ చేయవచ్చు. అంటే మన ఫోన్ ఇతరుల చేతుల్లోకి వెళ్లినా అది పనిచేయకుండా మనం నియంత్రించవచ్చన్నమాట. దీంతోపాటు పోగొట్టుకున్న ఫోన్‌కు సంబంధించి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఫోన్ దొరికాక అన్‌బ్లాక్ సైతం చేసుకోవచ్చు. అయితే ఈ సేవలు పొందాలంటే ముందుగా కొన్ని వివరాలు తెలియజేయాలి. మీ మొబైల్ నంబర్, ఐఎంఈఐ నంబర్, మొబైల్ కొనుగోలు చేసిన ఇన్‌వాయిస్‌తోపాటు మీ సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాపీని సీఈఐఆర్ పోర్టల్‌లో జత చేయాలి. వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తే సీఈఐఆర్ సెంట్రల్ డేటాబేస్‌లో అప్పటికే నమోదై ఉన్న సదరు ఫోన్ పనిచేయకుండా బ్లాక్ లిస్ట్‌లో పెడతారు. మన ఫిర్యాదు స్థితిని తెలుసుకొనే ఆప్షన్ సైతం ఈ పోర్టల్‌లో ఉంది.

మార్చి 15 నుంచి అమల్లోకి..

- వాస్తవానికి సీఈఐఆర్ సేవలను కేంద్ర ప్రభుత్వం 2019 చివర్లోనే ప్రయోగాత్మకంగా అమల్లోకి తెచ్చింది. తొలుత కొన్ని రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి అక్కడ విజయవంతం అయ్యాక దశలవారీగా అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తూ వస్తోంది. మార్చి 15 నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ సీఈఐఆర్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ వెల్లడించింది. మార్చి 15 తర్వాత పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లకు సంబంధించి ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

పోలీసు సిబ్బంది ఈ సేవలు వాడాలి: డీజీపీ

మొబైల్‌ఫోన్ చోరీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ కేసుల దర్యాప్తులో పోలీసులు చోరీ అయిన సెల్‌ఫోన్లను గుర్తించేందుకు సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలని డీజీపీ అంజనీకుమార్ తాజాగా ఆదేశించారు. ఇందుకోసం ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక పోలీసు అధికారిని నోడల్ అధికారిగా నియమిస్తామని... మరో 10 రోజుల్లో ఈ విధానాన్ని ప్రవేశపెడతామన్నారు.

ప్రజలు నిర్ణయిస్తేనే బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు

మాజీమంత్రి కుందూరు జానారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి జానారెడ్డి

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ పార్టీ పొత్తు అంశాన్ని ఎన్నికలు వచ్చినప్పుడు, తప్పదు అనుకున్నప్పుడు ప్రజలు నిర్ణయిస్తారన్నారని మాజీమంత్రి జానారెడ్డి అన్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలతో కలిసి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఇక్కడ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు రోహిణ్‌రెడ్డి, విజయారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటును బీఆర్‌ఎస్ మాత్రమే కాకుండా శివసేన లాంటి పార్టీలు కూడా వ్యతిరేకించాయని అన్నారు. వచ్చే శ్రీరామ నవమిలోపు బీజేపీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. బీజేపీ పెట్టుబడిదారుల కొమ్ముకాస్తోందన్నారు. పారిశ్రామికవేత్త అదానీ, ప్రధాని మోదీ సంబంధాలపై రాహుల్ నిలదీయడం తప్పా అని జానారెడ్డి ప్రశ్నించారు. ప్రశ్నించకుండా రాహుల్ గొంతు నొక్కుతున్నారని, అదానీ వ్యవహారం బయటపడొద్దని పార్లమెంటు నుంచి బయటికి పంపించారని ఆరోపించారు. మోదీ అధికార యంత్రాంగాన్ని వాడుకొని దర్యాప్తు సంస్థలతో రాజకీయ కక్షలకు దిగుతున్నారని అన్నారు. మోదీ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 17 పార్టీలు ఆందోళన చేస్తున్నాయని, బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కూడా ప్రజాస్వామ్య విరుద్ధంగా ప్రవర్తించి ఉంటే దేశంలో ఇన్ని పార్టీలు ఉండేవా అని అన్నారు. అధికారం కోసం బీజేపీ అరాచకాలు సృష్టిస్తోందని, కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే పార్టీల్లో చీలిక తెచ్చేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అదానీ కుంభకోణం గురించి ప్రశ్నించిన తర్వాతే సూరత్ కోర్టులో కేసు వేగంగా ముందుకు సాగిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తన కొడుకు పోటీ చేస్తాడని జానారెడ్డి స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని చెప్పలేదు

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని తాను ఎక్కడా చెప్పలేదని జానారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం తన నివాసంలో మీడియా ప్రతినిధులు పొత్తులపై ప్రస్తావించినప్పుడు క్లుప్తంగానే చెప్పానని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకుగాను బీజేపీకి వ్యతిరేకంగా 17 రాజకీయ పార్టీలు కాంగ్రెస్ పార్టీతో కలిసి పోరాటం చేయడాన్ని స్వాగతిస్తున్నానని మాత్రమే తాను చెప్పానన్నారు. ఎక్కడా బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని వ్యాఖ్యానించలేదని, పొత్తులు ఏ పార్టీతో ఉండాలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తుందని, ఆ నిర్ణయమే తమకు శిరోధార్యమని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు వీఆర్‌ఎస్ టైమొచ్చింది: నడ్డా

ఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభం

జోగిపేట(అందోల్): టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా మార్చుకున్న కేసీఆర్ పార్టీకి ఇప్పుడు వీఆర్‌ఎస్ (వాలంటరీ రిటైర్‌మెంట్ సర్కార్) తీసుకునే సమయం ఆసన్నమైందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయాన్ని ఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో ఆయన ప్రారంభించారు. నడ్డా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కూతురును ఈడీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ విచారణకు పిలవడంతో తెలంగాణ రాష్ట్రం పరువు పోయిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి చేయకున్నా ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించేందుకు తహతహలాడుతున్నారని, ‘ఉట్టికి ఎగరలేనమ్మా, నింగికి ఎగరగలదా’అంటూ కేసీఆర్‌ను ఎద్దేవా చేశారు. ‘మిస్టర్ ట్విట్టర్ టిల్లూ.. ఖబడ్దార్. ప్రధానిని బ్రోకర్ అంటావా? మొదట నీ కుటుంబం చరిత్ర తెలుసుకో, లిక్కర్, డ్రగ్స్‌సహా ఏ దందాను వదిలిపెట్టని కుటుంబం మీది. నీ అయ్య కేసీఆర్ పాస్‌పోర్ట్ బ్రోకర్’అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజమెత్తారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ‘పరువు లేనోడు నాపై పరువు నష్టం దావా వేసిండు’అని కేటీఆర్‌పై నిప్పులు చెరిగారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయకుండానే అదే బోర్డు సభ్యులతో పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆఫీసులో రూ. 75 కోట్లు ఇచ్చా

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించాడు. మనీ లాండరింగ్ కేసులో విచారణ కోసం అతడిని ఇటీవల కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. అరవింద్ కేజ్రీవాల్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని అన్నాడు. ఆయన త్వరలో ‘తీహార్ క్లబ్’లో చేరబోతున్నారని చెప్పాడు. వచ్చేవారం ముఖ్యమైన అంశాలను బయటపెట్టబోతున్నానని తెలిపాడు.

సత్యేంద్ర జైన్‌కు 10 కోట్లు, పార్టీకి 60 కోట్లు

రూ.200 కోట్లు బలవంతంగా వసూలు చేసిన కేసులో సుఖేష్ చంద్రశేఖర్ గత ఏడాది అరెస్టయ్యాడు. అప్పటినుంచి కేజ్రీవాల్‌కు, ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా వరుసగా లేఖలు విడుదల చేస్తున్నాడు. కేసుల నుంచి బయటపడడానికి కేజ్రీవాల్ సహచరుడు సత్యేంద్ర జైన్‌కు రూ.10 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.60 కోట్లు అందజేశానని లేఖల్లో వెల్లడించాడు. అయితే, సుఖేష్ చంద్రశేఖర్ ఆరోపణలను కేజ్రీవాల్ ఖండించారు. బీజేపీ ఆదేశాల ప్రకారమే సుఖేష్ పనిచేస్తున్నాడన్నారు.

ఎవరీ సుఖేష్ చంద్రశేఖర్?

సుఖేష్ చంద్రశేఖర్ అలియాస్ బాలాజీ 1989లో కర్ణాటక రాజధాని బెంగళూరులో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. కాలేజీ చదువు పూర్తయ్యాక విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డాడు. ఖరీదైన లగ్జరీ కార్లు, స్పోర్ట్స్ కార్లపై మోజు పెంచుకున్నాడు. డబ్బు కోసం అడ్డదారులు ఎంచుకున్నాడు. మోసాలే వృత్తిగా మార్చుకున్నాడు. 17 ఏళ్ల వయసులో తమ కుటుంబ మిత్రుడిని రూ.1.5 కోట్ల మేర మోసగించాడు. ఆ కేసులో అరెస్టయి, బెయిల్‌పై బయటకు వచ్చాడు. తనకు ప్రముఖ రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ చాలామందిని దగా చేశాడు. కోట్ల రూపాయలు దండుకున్నాడు. సినీ నటి లీనా మారియా పాల్‌ను పెళ్లి చేసుకున్నాడు. 2011లో వారిద్దరూ విడిపోయారు. కొన్నిరోజుల తర్వాత మళ్లీ కలిసి జీవించడం ప్రారంభించారు. ఓ కేసులో బెయిల్ ఇప్పిస్తానంటూ ఫోర్టిస్ హెల్త్‌కేర్ ప్రమోటర్ శివిందర్ మోహన్ సింగ్ భార్య అదితీ సింగ్ నుంచి రూ.200 కోట్లు వసూలు చేశాడు. ఇదే కేసులో ప్రస్తుతం తిహార్ జైలులో ఉన్నాడు. తన మోసాలకు బాలీవుడ్ నటీమణులను పావులుగా వాడుకోవడం సుఖేష్‌కు వెన్నతో పెట్టిన విద్య. ప్రముఖ హీరోయిన్లు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, నోరా ఫతేహీకి ఖరీదైన బహుమతులు, కార్లు ఇచ్చిన లోబర్చుకున్నట్లు సుఖేష్‌పై ఆరోపణలున్నాయి. కాగా, సుఖేశ్ పేర్కొన్న ఏపీ అంటే.. అరుణ్ పిళ్లై అని ఢిల్లీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

బీజేపీ చేతిలో కీలుబొమ్మ సుఖేశ్!

కేసీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేసే కుట్ర: బీఆర్‌ఎస్ నేతల ఫైర్

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ కుటుంబాన్ని అభాసుపాలు చేసే కుట్రలో భాగంగానే మనీ లాండరింగ్ కేసు నిందితుడు సుఖేశ్ చంద్రశేఖర్‌ను బీజేపీ పావుగా వాడుకుంటోందని బీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. 2020లో హైదరాబాద్‌లోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో ఓ వ్యక్తికి డబ్బులు ఇచ్చానంటూ సుఖేశ్ చంద్రశేఖర్ చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, గణేశ్ గుప్తా, నేతలు మన్నె క్రిషాంక్, దాసోజు శ్రవణ్ ఖండించారు. ఎమ్మెల్సీ కవితపై తప్పుడు కేసుపెట్టి అభాసుపాలైన బీజేపీ కొత్త డ్రామాకు తెరలేపిందన్నారు. సుఖేశ్ చంద్రశేఖర్‌తోపాటు లిక్కర్‌స్కామ్, ఇతర కేసుల నిందితులెవరితోనూ తమ పార్టీ నేతలకు సంబంధాలు లేవని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నేపథ్యాన్ని, తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. సుఖేశ్ బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారారని, తీహార్ జైలులో విచారణ ఖైదీగా ఉన్న అతడు బహిరంగ లేఖలు పంపడం వెనుక బీజేపీ హస్తం ఉన్నట్టు స్పష్టమవుతోందన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను నియంతృత్వంలోకి నెట్టే ప్రయత్నాల్లో భాగంగా.. బలమైన విపక్ష నేతలను బీజేపీ టార్గెట్ చేసిందని ఆరోపించారు.

పేపర్ల లీకేజీపై నిరంతర ఉద్యమాలు

టీపీసీసీ విద్యార్థి ఉద్యమాల కమిటీ సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ ఘటనలో బాధితులకు న్యాయం జరిగి, నిందితులందరినీ అరెస్టు చేసేంతవరకు నిరంతర ఉద్యమాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. విద్యార్థి ఉద్యమాలపై టీపీసీసీ ఏర్పాటు చేసిన ఉద్యమాల కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి అధ్యక్షతన శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన ఈ సమావేశానికి కమిటీ సభ్యులు శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్, మానవతారాయ్, బాలలక్ష్మి, పవన్ మల్లాదిలు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ ఘటన రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈనెల 3వ తేదీ నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని, అందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు, జిల్లాల్లో పర్యటించి ఉద్యోగార్థులు, విద్యార్థులను పోరాటాలకు సమాయత్తం చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది: మల్లురవి

సమావేశం అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్లురవి మాట్లాడుతూ లక్షలాది మంది నిరుద్యోగులకు సంబంధించిన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే రద్దు చేసి కొత్త సభ్యులతో పరీక్షలు నిర్వహించాలని, ఈ విషయంలో గవర్నర్, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన అనుబంధ సంఘాలు మినహా రాష్ట్రంలోని అన్ని విద్యార్థి, యువజన సంఘాలతో కలసి ఉద్యమాలు చేపడతామని వెల్లడించారు.

తెలంగాణ శత్రుదేశమా?



హైదరాబాద్‌లోని వ్యవసాయ వర్సిటీలో కళాకారులతో కలిసి డోలు వాయిస్తున్న మంత్రి కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వకున్నా గ్రామ పంచాయతీలకు రూ.1,300 కోట్లు ఈ రోజే విడుదల చేస్తున్నామన్నారు. ఇంకా రూ.250 కోట్లు ఇవ్వాల్సి ఉందని గ్రామీణాభివృద్ధి అధికారులు చెబుతున్నారని, త్వరలోనే వాటినీ విడుదల చేస్తామన్నారు. మొత్తం 12,769 పంచాయతీలకు కొత్త కంప్యూటర్లు ఇస్తామని చెప్పారు. జిల్లాస్థాయిలో అవార్డులు సాధించిన పంచాయతీలకు రూ.10 లక్షలు, రాష్ట్రస్థాయిలో 20 లక్షలు, జాతీయస్థాయిలోని వాటికి రూ.30 లక్షలు ఇవ్వాలని మంత్రి ఎర్రబెల్లికి సూచించారు.

అభివృద్ధి ఆగొద్దు...

పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు కష్టపడినందునే మనకు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా జాతీయస్థాయిలో అవార్డులు వచ్చాయని కేటీఆర్ చెప్పారు. ప్రతీ పంచాయతీ ఉత్తమ పంచాయతీగా అవార్డు సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో పల్లెలు, పట్టణాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఇది సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. ఇప్పటివరకు మనకు 79 జాతీయ అవార్డులు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్రం ఏర్పడిననాడు తలసరి ఆదాయం రూ.1,24,000 ఉండగా, 2023 మార్చి నాటికి రూ.3,17,000 గా ఉందని చెప్పారు. సీఎస్‌డీఎస్ అనే సంస్థ దేశంలోని 13 రాష్ట్రాల్లో సర్వే చేస్తే.. తలసరి ఆదాయంలో తెలంగాణ ఫస్ట్, అవినీతిలో చివరిగా ఉందని తేలిందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై రూపొందించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఉత్తమ పంచాయితీలకు అవార్డులు అందజేశారు.

టీఎస్‌పీఎస్సీకి సిట్ టెస్ట్!

▶ మొదటి పేజీ తరువాయి

పర్యవేక్షిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరి వాంగ్మూలాలు కేసులో కీలకమని సిట్‌కు న్యాయ నిపుణులు సూచించడంతో.. కార్యదర్శికి నోటీసులు జారీచేశారు, చైర్మన్‌కూ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక గ్రూప్–1 ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో అరెస్టైన డేటా ఎంట్రీ ఆపరేటర్ డామెర రమేశ్‌కుమార్ ఇంతకుముందు కమిషన్ సభ్యుడు లింగారెడ్డి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. ఈ క్రమంలో లింగారెడ్డికి నోటీసులు ఇచ్చిన సిట్ అధికారులు.. మిగతా సభ్యుల విషయమై న్యాయ సలహా తీసుకుంటున్నారు.

కేవలం ప్రింటెడ్ పత్రాలే ఇస్తూ..

లీకైన పేపర్లలో గ్రూప్–1 ప్రిలిమ్స్, ఏఈ ప్రశ్నపత్రాలు మాత్రమే అభ్యర్థులకు చేరాయని సిట్ అధికారులు చెప్తున్నారు. ఇవి మొత్తం తొమ్మిది మందికి చేరాయని ఇప్పటివరకు తేల్చినట్టు సమాచారం. కస్టోడియన్ కంప్యూటర్ నుంచి ప్రవీణ్, రాజశేఖర్ చేజిక్కించుకున్నవి సాఫ్ట్‌కాపీలే. అయినా ఈ ‘వాట్సాప్ జమానా’లో కూడా వారు ప్రశ్నపత్రాల ఆన్‌లైన్ షేరింగ్ జోలికి పోలేదు. న్యూజిలాండ్‌లో ఉన్న రాజశేఖర్ సమీప బంధువు ప్రశాంత్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ సభ్యుడి వద్ద పీఏగా పనిచేసిన రమేశ్‌కు మాత్రమే ఎనీడెస్క్ అప్లికేషన్ ద్వారా సాఫ్ట్‌కాపీలు ఇచ్చారు. మిగతా వారికి ప్రింట్‌ఔట్స్ రూపంలో ఉన్న మాస్టర్ క్వశ్చన్ పేపర్ల పత్రాలే అందించారు. ఎక్కడా సాంకేతిక ఆధారాలు చిక్కకూడదనే ఇలా చేసినట్టు సిట్ అధికారులు భావిస్తున్నారు.

కంప్యూటర్ యాక్సెస్ కోసం పేపర్ ఇచ్చి..

రాజశేఖర్ తన పెన్‌డ్రైవ్‌లో ఉన్న గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాన్ని ప్రశాంత్‌రెడ్డికి ఎనీడెస్క్ అప్లికేషన్ ద్వారా పంపినా.. ఇందుకోసం తన కంప్యూటర్‌ను నేరుగా వినియోగించలేదు. ఎవరైనా సహోద్యోగులు చూసే ప్రమాదం ఉందని, సాంకేతిక ఆధారాలు చిక్కకూడదని భావించాడు. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించిన అతడికి తన స్నేహితురాలైన ఏఎస్‌ఓ షమీమ్ కూడా గ్రూప్–1 రాస్తున్నట్టు తెలిసింది. ఆమెను సంప్రదించిన రాజశేఖర్.. తాను ఇచ్చే పెన్‌డ్రైవ్‌ను ఇంటికి తీసుకువెళ్లి ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేయాలని, ఎనీడెస్క్ ద్వారా న్యూజిల్యాండ్‌లో ఉన్న ప్రశాంత్‌కు యాక్సెస్ ఇవ్వాలని కోరాడు. ఇలా చేసినందుకు అందులో ఉన్న ప్రశ్నపత్రాన్ని పేపర్ తీసుకోవచ్చని.. ఈ విషయం ఎవరికీ తెలియదని భరోసా ఇచ్చాడు. రాజశేఖర్ ఇచ్చిన పెన్‌డ్రైవ్‌ను తీసుకువెళ్లిన షమీమ్ తన ఇంటివద్ద ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేసింది. తర్వాత రాజశేఖర్ సూచనల ప్రకారం నిర్ణీత సమయంలో ఎనీడెస్క్ ద్వారా ఈ ల్యాప్‌టాప్‌ను యాక్సెస్ చేసిన ప్రశాంత్‌రెడ్డి.. ఆ పెన్‌డ్రైవ్‌లో ఉన్న గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రాన్ని తన కంప్యూటర్‌లోకి కాపీ చేసుకున్నాడు. తర్వాత రమేశ్‌కు ప్రవీణ్ ఇదే పంథాలో తన కంప్యూటర్ నుంచి ఎనీడెస్క్ ద్వారా ప్రశ్నపత్రం అందించాడు. గ్రూప్–1 మెయిన్స్ పేపర్లు సైతం ఇలానే చేజిక్కించుకోవాలని పథకం వేసిన ప్రవీణ్.. ఎక్కడా లీకేజ్ వ్యవహారం బయటపడకూడదని, సాంకేతిక ఆధారాలు ఉండకూడదనే ఇలాంటి జాగ్రత్తలు తీసుకున్నాడని సిట్ అధికారులు చెప్తున్నారు.

క్లుప్తంగా...

నేటినుంచి క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్వీకరణ

- జీవో 58, 59 దరఖాస్తులకు మరో నెల రోజుల గడువు
- 2020 జూన్ 2 వరకు కటాఫ్ తేదీ... ఆ తేదీలోపు ఆధారాలతో దరఖాస్తుకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: జీవో 58, 59ల ద్వారా ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుల ప్రక్రియ శనివారం నుంచి మరోమారు ప్రారంభం కానుంది. ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు క్రమబద్ధీకరణ దరఖాస్తులకు అవకాశం కల్పిస్తూ గతనెల 17న ప్రభుత్వం జీవో 29ని జారీ చేసింది. ఈ జీవో మేరకు మీసేవా కేంద్రాల ద్వారా క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసుకునే అవకాశం కలగనుంది. గతంలో జీవో 58, 59ల ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గాను 2014, జూన్2 వరకు కటాఫ్ తేదీ ఉండగా, తాజా జీవో ప్రకారం 2020, జూన్ 2 వరకు కటాఫ్ తేదీగా నిర్ణయించారు. ఈ తేదీ వరకు ఉన్న ఆధారాలతో భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చని జీవోనెం. 29లో పేర్కొన్నారు.

'దిశ' నివేదికలో నాపై ఆరోపణలను కొట్టివేయాలి

హైకోర్టులో ఫరూక్‌నగర్ ఎమ్మార్వో పాండు పిటిషన్

సాక్షి, హైదరాబాద్: 'దిశ'కేసులో సుప్రీంకోర్టు నియమించిన సిర్పూర్కర్ కమిషన్ నివేదికలో తనపై చేసిన ఆరోపణలను కొట్టివేయాలని ఫరూక్‌నగర్ ఇన్‌చార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దిశ అత్యాచారం, హత్య ఘటనల తర్వాత జనం బాగా గుమికూడిన నేపథ్యంలో లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బంది రాకూడదనే నిందితులు మహమ్మద్ ఆరిఫ్, శివ, నవీన్‌కుమార్, చెన్నకేశవులను రిమాండ్‌కు ఉత్తర్వులివ్వాల్సి వచ్చిందని తెలిపారు. అందుకే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, పోలీసులను పిలిచి రిమాండ్ ఉత్తర్వులిచ్చానని చెప్పారు. వీటిని కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని, తాను స్వతంత్రంగా నిర్ణయం తీసుకోలేదని నివేదికలో పేర్కొనడం అన్యాయమని వెల్లడించారు. కమిషన్ తనపై చేసిన వ్యాఖ్యల వల్ల తన హక్కులకు భంగం కలగడంతోపాటు సర్వీసుపై తీవ్రమైన ప్రభావం పడినట్లు పాండు వాపోయారు. తన పనితీరును తప్పుబట్టేలా ఉన్న రిపోర్టులోని అంశాలను రద్దు చేయాలని విన్నవించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. అయితే సీనియర్ న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో తదుపరి విచారణ ఏప్రిల్ 11కి వాయిదా వేసింది.

విద్యుత్ శాఖలో ఈనెల 17 నుంచి సమ్మె

నోటీసులిచ్చిన జేఏసీ

సాక్షి, హైదరాబాద్: వేతన సవరణ అంశంతోపాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది, కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో యాజమాన్యాల వైఖరికి నిరసనగా సమ్మెకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) నిర్ణయించింది. ఈ నెల 17వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సమ్మె చేయనున్నట్లు జేఏసీ తెలిపింది. ఈమేరకు జేఏసీలో భాగస్వాములైన యూనియన్లన్నీ కలిపి జేఏసీ పక్షాన టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో యాజమాన్యాలకు శుక్రవారం సమ్మె నోటీసులు అందజేశాయి. తమ వేతనాల సవరణ అంశం ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉందని, ఎన్నిసార్లు యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని నోటీసుల్లో జేఏసీ నేతలు పేర్కొన్నారు. మార్చి 29న జేఏసీ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సమ్మె నోటీసులిస్తున్నట్లు వెల్లడించారు.






ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన దేశపతి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ కవిత, మంత్రులు ప్రశాంత్‌రెడ్డి. శ్రీనివాస్‌గౌడ్ ● ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్, ఏవీఎన్ రెడ్డి

మండలిలో కొత్తసభ్యుల ప్రమాణం

- ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్ తరఫున ప్రమాణం చేసిన నవీన్, దేశపతి, చల్లా
- ఉపాధ్యాయ కోటాలో బీజేపీ నుంచి ఏవీఎన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసన మండలికి కొత్తగా ఎన్నికైన నలుగురు ఎమ్మెల్సీలు శుక్రవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యేల కోటాలో బీఆర్ఎస్ తరఫున కుర్మయ్యగారి నవీన్‌కుమార్, దేశపతి శ్రీనివాస్, చల్లా వెంకట్రామిరెడ్డి, 'మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్' ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఎ.వెంకట్‌నారాయణరెడ్డి ఎమ్మెల్సీలుగా గెలుపొందిన విషయం తెలిసిందే. ఉదయం 9.30కు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో ముందుగా ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, తర్వాత బీజేపీ ఎమ్మెల్సీతో వేర్వేరుగా ప్రమాణస్వీకారం చేయించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మండలి చీఫ్ విప్ భానుప్రసాదరావు, విప్‌లు ఎంఎస్ ప్రభాకర్, శంభీపూర్ రాజు, పాడి కౌశిక్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఏవీఎన్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌తోపాటు బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీలు రాంచందర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు ఏవీఎన్ రెడ్డి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పించారు.

టీ వర్క్స్‌లో మల్టీ లేబర్ పీసీబీ ఫ్యాబ్రికేషన్

క్వాల్‌కామ్ ఇండియాతో టీ వర్క్స్ కీలక ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చొరవతో ఏర్పాటైన దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్ 'టీ వర్క్స్', క్వాల్‌కామ్ ఇండియా మధ్య శుక్రవారం కీలక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా టీ వర్క్స్ ఆవరణలో విభిన్నమైన 'మల్టీ లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు (పీసీబీ) ఫ్యాబ్రికేషన్ సదుపాయం అందుబాటులోకి వస్తుంది. దీంతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రోటోటైపింగ్, అభివృద్ధిని వేగవంతం చేసేందుకు వీలుగా 12 పొరలతో కూడిన పీసీబీలను వేగంగా తయారు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ రంగంలో ఆవిష్కరణలు వేగవంతం చేసేందుకు వీలుగా క్వాల్‌కామ్ ఇండియా ఈ ఒప్పందాన్ని టీ వర్క్స్‌తో కుదుర్చుకుంది. భారతదేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి తెలంగాణను గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు టీ వర్క్స్ సీఈఓ సుజయ్ కారంపూరి వెల్లడించారు. టీ వర్క్స్‌తో కుదిరిన ఒప్పందం ఆవిష్కరణలకు ఊతమిస్తుందని క్వాల్‌కామ్ ఇండియా ఇంజనీరింగ్ విభాగం ఉపాధ్యక్షుడు శశిరెడ్డి అన్నారు. కాగా, ప్రస్తుతం మల్టీ లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు తయారు చేసేందుకు తయారీదారులు 10 నుంచి 15 రోజులు సమయం తీసుకుంటున్నారు. టీ వర్క్స్‌లో మల్టీ లేయర్ పీసీబీ ఫ్యాబ్రికేషన్ సదుపాయం అందుబాటులోకి రావడంతో కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే నాణ్యమైన పీసీబీలను పొందేందుకు వీలుంటుంది. క్వాల్‌కామ్ ఇండియాతో కుదిరిన ఒప్పందంలో భాగంగా విద్యార్థులు, వృత్తి నిపుణులకు టీ వర్క్స్‌లో శిక్షణ కూడా ఇస్తారు.

టోల్, ఔషధాలపై పన్ను ప్రజలపై భారమే

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



హుస్నాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలు వాడే ఔషధాలపై 12% పన్ను, టోల్ ట్యాక్స్ 5% పెంచడం వల్ల ప్రజలపై పెనుభారం వేయడమేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో దేశాన్ని తాకట్టు పెట్టే విధంగా రూ.106 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. బీజేపీ అప్పులు చేస్తే పుణ్యకార్యంగా, రాష్ట్రాలు అప్పులు చేస్తే పాపకార్యమన్నట్టుగా వ్యవహరిస్తోందన్నారు. 'బీజేపీ హఠావో–దేశ్ బచావో' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు 'పల్లె పల్లెకు సీపీఐ' అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలో సీపీఐ జాతా నిర్వహిస్తామన్నారు. ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపిస్తే ప్రజల గొంతుకగా ఉంటూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తామన్నారు.

ఐఏఎస్ నరసింహకు మూడేళ్ల జైలు

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఐఏఎస్ అధికారి కావడి నరసింహకు సీబీఐ కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. రూ.లక్ష జరిమానా కూడా విధించింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి నరసింహపై 2006, డిసెంబర్ 21న సీబీఐ ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసింది. మిజోరాం కేడర్‌లో పనిచేస్తున్న సమయంలో కేసు నమోదు కావడంతో ఆయనను సస్పెన్షన్‌లో ఉంచారు. 1991 నుంచి 2006 వరకు ఆదాయానికి సంబంధం లేకుండా ఆయన రూ.32,31,000 ఆస్తులను కూడబెట్టారని సీబీఐ పేర్కొంది.

వేగ శ్రీలో ప్రగ్యా జైస్వాల్ సందడి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన వేగశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంను శుక్రవారం ప్రముఖ సినీ నటి ప్రగ్యా జైస్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేగశ్రీ చైర్మన్ పనమా నవీన్, ఎండీ మణిదీప్ ఏచూరి, కళ్యాణ్ కుమార్ గోళ్ల, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేగశ్రీ జ్యువెలరీస్‌లో మహిళల మనసుదోచే బంగారు, వజ్రాలు, పోల్కి, కుందన్, విక్టోరియన్ ఆభరణాలు అబ్బురపరిచే రీతిలో ఆకర్షణీయమైన శ్రేణుల్లో కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొచ్చామని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మెఘా సుధారెడ్డి చేతుల మీదుగా ఆకట్టుకునే ఆభరణాల శ్రేణిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలను విశేషంగా ఆకట్టుకునే రీతిలో అత్యుత్తమ జ్యువెలరీలో వేగశ్రీ ఇప్పటికే ఎంతో మంది ఆదరణ చూరగొంటున్నదన్నారు. తెలుగువారి అభిరుచుల మేరకు..ప్రత్యేక డిజైనరీ ఆభరణాలను దృష్టిలో పెట్టుకొని కళాకారులతో వీటిని రూపుదిద్దేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి రూ.2,235 కోట్లు

కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రహదారుల నిర్మాణానికి రూ.2,235 కోట్ల నిధులు కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వరంగల్–ఖమ్మం జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల రహదారుల నిర్మాణానికి ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు కేంద్ర రహదారుల శాఖమంత్రి నితిన్‌గడ్కరీ శుక్రవారం వెల్లడించారు. వరంగల్–ఖమ్మం (ఎన్‌హెచ్–163జీ) రహదారిపై వరంగల్ జిల్లాలోని వెంకటాపూర్ గ్రామం నుంచి మహబూబాబాద్ జిల్లాలోని తాళ్లసేనకేశ గ్రామం వరకు 39.410 కిలోమీటర్ల మేరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి రూ.1,111.76 కోట్లు, ఈ దారికి కొనసాగింపుగా తాళ్లసేనకేశ గ్రామం నుంచి ఖమ్మం జిల్లాలోని వెంకటాయపాలెం గ్రామం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి మరో రూ.1,123.32 కోట్లు మంజూరు చేసినట్లు గడ్కరీ తెలిపారు. ఈ రెండు రహదారులను కలిపి మొత్తం 70 కిలోమీటర్ల రహదారిని 'హైబ్రిడ్ అన్యుటీ మోడ్'లో నిర్మాణం చేయనున్నట్లు వివరించారు. మొత్తం రహదారి నిర్మాణానికి అయ్యే ఖర్చులో భారత జాతీయ రహదారుల సంస్థ 40 శాతం, రాష్ట్ర రహదారుల విభాగం 60 శాతం భరించాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.



మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రశ్నిస్తున్న మహిళలు

ఆ ఫ్యాక్టరీని మా సమాధులపై నిర్మించండి

- ధర్నాకు దిగిన పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులు
- ఫ్యాక్టరీ ఏర్పాటుపై తీవ్ర నిరసన
- ఐదుగంటలపాటు స్తంభించిన ట్రాఫిక్
- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అరెస్టు
- తోపులాటలో మహిళలకు గాయాలు

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులు స్థానిక ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై సుమారు ఐదు గంటలపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పరిశ్రమ ఏర్పాటుతో కాలుష్యం వెదజల్లుతోందని, పరిసర గ్రామాలు ఎడారిగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే ఆపేయాలని మంత్రిని కోరారు. అయితే..పరిశ్రమ నిర్మాణంతో కాలుష్యం సమస్య తలెత్తదని మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోగా..ఆగ్రహించిన గ్రామస్తులు మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'మా సమాధులపై ఆ ఫ్యాక్టరీని నిర్మించుకోండి' అంటూ పురుగుమందు డబ్బాలతో రోడ్డుపై బైఠాయించారు. కమీషన్ల కోసం కొందరు గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలంలో ప్రాణాలను హరించే ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రాణాలు పోయినా పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గ్రామస్తులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. గ్రామస్తుల ధర్నాతో రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ధర్నాను విరమింపజేసేందుకు తొలుత అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా..గ్రామస్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, మహిళల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. తోపులాటలో పలువురు మహిళలకు గాయాలయ్యాయి. ధర్మపురి సీఐ ఆధ్వర్యంలో భారీగా పోలీసులను మోహరించి లక్ష్మణ్ కుమార్‌ను అరెస్టు చేసి సారంగాపూర్ స్టేషన్‌కు, వెల్గటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డిని, సర్పంచ్ మేరుగు మురళిని గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించగవలో ఆందోళనకారులు ధర్నా విరమించారు.

ధ్వజస్తంభం దుంగ నరికారని..

ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని ముట్టడించిన గ్రామస్తులు

- కుర్చీలు, ఫర్నిచర్ ధ్వంసం
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన

అశ్వారావుపేట రూరల్: ఆలయం వద్ద ప్రతిష్టించాల్సిన ధ్వజస్తంభంకోసం తెచ్చిన దుంగను అటవీ శాఖ సిబ్బంది గుడి వద్దే ముక్కలు చేశారంటూ గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. అటవీరేంజ్ కార్యాలయాన్ని ముట్టడించి.. ఆఫీసులో కుర్చీలు, అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామస్తులు శ్రీగంగానమ్మ తల్లి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించేందుకు సమీప అటవీ ప్రాంతం నుంచి నారవేప చెట్టును నరికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక అటవీ శాఖ సిబ్బంది.. అనుమతి లేకుండా తీసుకొచ్చారంటూ 35 అడుగులున్న చెట్టు దుంగను రంపంతో ముక్కలు చేయించి ట్రాక్టర్‌పై స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసుకు తరలించారు. దీంతో గ్రామస్తుల్లో ఆగ్రహం పెల్లుబికింది. సిబ్బంది తీరుపై నిరసన వ్యక్తం చేసేందుకు గ్రామస్తులు భారీ సంఖ్యలో అశ్వారావుపేటకు వచ్చారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన అటవీ శాఖ అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి అన్ని పార్టీల నాయకులు మద్దతు తెలపడంతో ప్రదర్శనగా అటవీరేంజ్ కార్యాలయానికి చేరుకున్నారు. కాగా అటవీ శాఖ అధికారులు మాత్రం తాము గుడి వద్ద నుంచి కలప ముక్కలను తీసుకురాలేదని, మరో ప్రాంతంలో సైజులుగా చేసి ఉన్న వాటిని తెచ్చామని చెబుతున్నారు.



ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని ముట్టడించిన ఆందోళనకారులు

కార్యాలయం ముట్టడి, ఫర్నిచర్ ధ్వంసం..

ఆందోళనకారులు అటవీ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి కుర్చీలు, కిటికీల అద్దాలు, తలుపులు ధ్వంసం చేశారు. రేంజర్ గదిలోకి వెళ్లి ఫైళ్లు పడేసి, రేంజర్, సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. వీరిని అటవీ, పోలీస్ సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగాయి. దీంతో ఆ ప్రాంతం మూడు గంటల పాటు ఉద్రిక్తంగా మారింది. అనంతరం గ్రామస్తులు అటవీ అధికారులపై చర్య తీసుకోవాలంటూ రేంజ్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. దీంతో వివిధ పార్టీల నాయకులు ఇరువర్గాలతో చర్చించారు. ధ్వజస్తంభానికి సరిపడా మరో కలప దుంగను వారంరోజుల్లో అందిస్తామని రేంజర్ చెప్పారు. అయితే అటవీ అధికారుల మాటపై తమకు నమ్మకం లేదంటూ గ్రామస్తులు ఆందోళన కొనసాగిస్తుండగా.. చివరకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు జూపల్లి రమేశ్ జోక్యం చేసుకుని ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఎవరివల్ల లోకం వ్యథ చెందదో, లోకం వలన ఎవడు వ్యథ చెందడో, సంతోషం, కోపం, భయం, ఉద్వేగాల నుండి ఎవడు ముక్తుడో అతడు నాకు ప్రియుడు.

– భగవద్గీత

సాక్షి

శనివారం, ఏప్రిల్, 1

ట్రంప్‌కు పరీక్షా సమయం

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్‌ ట్రంప్‌కు ఇది కష్టకాలం. అధ్యక్ష ఎన్నికలో తన గెలుపును తన్నుకుపోయారంటూ వాషింగ్టన్‌లోని కాపిటల్‌ హిల్‌ భవనంపైకి మద్దతుదార్లను ఉసిగొల్పి విధ్వంసానికి కారకుడయ్యారన్న ఆరోపణలపై అభియోగాలు నమోదు కావొచ్చని అందరూ అనుకుంటున్న సమయంలో వేరే కేసు తలకు చుట్టుకుని ఆయన ఊపిరాడని స్థితిలో పడ్డారు. తనతో ఉన్న లైంగిక సంబంధాన్ని బయటపెట్టకుండా ఉండేందుకు శృంగార తార స్టార్మీ డేనియల్స్‌కు ట్రంప్‌ భారీ యెత్తున సొమ్ము ముట్టజెప్పారన్న ఆరోపణకు ఆధారాలున్నాయని మన్‌హటన్‌ గ్రాండ్‌ జ్యూరీ భావించటం అసాధారణ నిర్ణయం. దీని పర్యవసానంగా ట్రంప్‌ను సంకెళ్లు వేసి సాధారణ నేరస్థుడి మాదిరిగా తీసుకెళ్లి ఫొటోలు, వేలిముద్రలు తీసుకుంటారు. అయితే ఆ తర్వాత వెంటనే బెయిల్‌ రావటం పెద్ద కష్టం కాదు. ఈ కేసులో వాస్తవంగా విచారణ యోగ్యమైన నేరారోపణలేమిటన్నది ఇంకా వెల్లడి కావలసివుంది. అర్ధ శతాబ్దంపాటు ట్రంప్‌ ఓ వెలుగు వెలిగారు. గుట్టు చప్పుడు కాకుండా తప్పుడు ఒప్పందాలు కుదుర్చుకోవటంలో, చట్టానికి దొరక్కుండా తప్పించుకోవటంలో, సమ ర్థుడైన వ్యాపారవేత్తగా వెలిగిపోవటంలో, రాజకీయాల్లో అడ్డగోలుగా మాట్లాడుతూ జనాన్ని ఆకట్టు కుని అధ్యక్ష పదవికి ఎగబాకటంలో ట్రంప్‌కెవరూ సాటిరారు. అధ్యక్ష పదవిలో ఉంటూ కూడా తన బాణీ ఆవగింజంతైనా మార్చుకుండా అందర్నీ హడలెత్తించిన మొనగాడు ట్రంప్‌.

అన్ని దేశాల ప్రజానీకంలో ఉన్నట్టే అమెరికాలో కూడా నైతికవర్తన విషయంలో చాలా పట్టింపులుంటాయి. ముఖ్యంగా తమ పాలకుల నుంచి దాన్ని చాలా ఆశిస్తారు. కానీ ట్రంప్‌ చరిత్ర ఆద్యంతం అందుకు విరుద్ధం. నిజానికి ఒక నటీమణిని లోబర్చుకోవటానికి తాను చేసిన ప్రయత్నాలను ఆయన ఒక టీవీ షోలో గొప్పగా చెప్పుకున్నారు కూడా. 2006లో ఒక గోల్ఫ్‌ టోర్నమెంట్‌ కోసం వచ్చి ట్రంప్‌ తనతో గడిపారని స్టార్మీ డేనియల్స్‌ 2016లో అమెరికన్‌ మీడియా ఇంక్లైన్స్‌ (ఏఎంఐ) అనే సంస్థకు చెప్పారు. అధ్యక్ష పదవికి ట్రంప్‌ పోటీపడటం ఖాయమని తేలాక అనేక మంది మహిళలు బయటికొచ్చి ఆయన గతంలో తమను లైంగికంగా ఎలా వేధించిందీ వెల్లడించటం మొదలెట్టారు. అలాంటి మహిళలు ఆ కథనాలు కేవలం తమకు మాత్రమే ఇచ్చేలా అప్పట్లో ఏఎంఐ ఒప్పందాలు కుదుర్చుకుని వారికి డబ్బు ముట్టజెప్పింది. ఆ తర్వాత వాటిని బుట్టదాఖలా చేసింది. ఈ సంస్థ ట్రంప్‌ మాజీ అటార్నీ మైఖేల్‌ డి. కోహెన్‌ చెప్పుచేతల్లో ఉండేది. స్టార్మీ డేనియల్స్‌ వేరే మీడియా సంస్థకు అంతక్రితమే ఇంటర్వ్యూ ఇచ్చినా అది ప్రచురించకుండా కోహెన్‌ బెదిరించగలిగారు. ఆ విషయంలో మరింత ముందుకు పోకుండా అప్పట్లో రహస్య ఒప్పందం కుదుర్చుకుని డేనియల్స్‌కు 1,30,000 డాలర్లు కోహెన్‌ అందించారు. అది అనైతిక సంబంధాన్ని కప్పెట్టడానికి కాదనీ, తప్పుడు ఆరోపణలు చేసి తన పరువు తీయకుండా ఉండటం కోసమేననీ ట్రంప్‌ 2018లో ఒకసారి చెప్పారు. ఇక్కడ ట్రంప్‌కు ఆమెతో అనైతిక సంబంధం ఉందా లేదా అన్నది కుటుంబపరంగా ఏమైనా కావొచ్చుగానీ... చట్టపరంగా పెద్ద సమస్య కాకపోవచ్చు. ఆ డబ్బును ఏ ఖాతాలో చూపారో, దానికి అనుసరించిన విధానాలేమిటో విచారణ సందర్భంగా బయటికొస్తాయి. తనకు అటార్నీగా వ్యవహరిస్తున్నందుకు కోహెన్‌కు చెల్లించిన ఫీజుగా, అధ్యక్ష ఎన్నికల ప్రచారం కోసం చేసిన ఖర్చుగా ట్రంప్‌ చూపారు. ఈ డబ్బు స్టార్మీకి చెల్లించటం కోసం కోహెన్‌ ఎసెన్షియల్‌ కన్సల్టెంట్స్‌ పేరిట ఒక దొంగ కంపెనీ సృష్టించారు. ఆ తర్వాత ఫీజు రూపంలో ట్రంప్‌ నుంచి స్వీకరించారు. స్వయానా కోహెనే దీన్ని ఒప్పుకున్నారు. ఇది అమలులో ఉన్న ఆర్థిక చట్టాలను ఉల్లంఘించటం. ఆ విధంగా ఆర్థిక నేరం. అయితే కోహెన్‌ ఆ మొత్తాన్ని ఏం చేశారో తనకు తెలియదనీ, తన న్యాయవాదిగా ఆయన చెప్పిందల్లా చేశాను తప్ప అందులోని తప్పొప్పులతో సంబంధం లేదనీ ట్రంప్‌ అనొచ్చు. అసలు ఇదంత పెద్ద నేరమేమీ కాదని వాదిస్తున్నవారు లేకపోలేదు. అది నిజం కావొచ్చు కూడా. ఆర్థిక నేరాన్నీ, అనైతికతనూ కలగాపులగం చేసి నిర్మించే కేసు ధర్మాసనం ముందు వీగిపోయినా పోవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇంతవరకూ అమెరికా చరిత్రలో ఎప్పుడూ న్యాయస్థానాల ముందుకురాని ఈ మాదిరి కేసు అంతిమంగా ట్రంప్‌పై సానుభూతిని పెంచినా పెంచొచ్చనీ, పర్యవసానంగా కాపిటల్‌ హిల్‌ భవనంపై దాడి, విధ్వంసం, కుట్ర, రహస్యపత్రాలు దగ్గరుంచుకోవటం వంటి బలమైన కేసుల విషయంలో జనంలో నిర్లిప్తత ఏర్పడే ప్రమాదం ఉన్నదనీ వారంటున్నారు.

తాజా కేసు ట్రంప్‌కు రాజకీయంగా నష్టమో లాభమో వెంటనే చెప్పటం అంత సులభం కాదు. అభియోగాల నిర్ధారణ తర్వాత రిపబ్లికన్‌ పార్టీలో అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీపడే నేతలతో సహా అందరూ ఏకమయ్యారు. అలా చూస్తే ట్రంప్‌కు ఈ పరిణామం మేలు చేసేదే. నైతికతను దిగజార్చుకుని, దాన్ని కప్పిపుచ్చడానికి ఆర్థిక నేరాలకు పాల్పడి దేశాధ్యక్షుడైన వ్యక్తివల్ల అమెరికన్‌ సమాజానికీ, పాలనా వ్యవస్థకూ నష్టం కలుగుతుందని ప్రాసిక్యూటర్లు వాదిస్తారు. దాన్ని ఏ మేరకు ధర్మాసనం అంగీకరిస్తుందో చూడాలి. ఒకవేళ శిక్షించినా 1974లో వాటర్‌గేట్‌ కుంభకోణం దోషి నిక్సన్‌కు ఆయన వారసుడిగా వచ్చిన గెరాల్డ్‌ ఫోర్డ్‌ క్షమాభిక్ష పెట్టారు. రిపబ్లికన్ల ఏలుబడి వస్తే ట్రంప్‌ విషయంలో కూడా అదే జరగొచ్చు. ఏదేమైనా నాలుగేళ్లు దేశాధ్యక్షుడిగా ఉండి, మరోసారి అందుకోసం పోటీపడుతున్న నాయకుడిని శిక్షించడానికి అమెరికన్‌ న్యాయవ్యవస్థ ఏ మేరకు సిద్ధపడుతుందన్నది ఈ కేసుతో తేలిపోతుంది.

శాస్త్రీయమైతే సంప్రదాయానికి విలువ

విశ్లేషణ



అనురాగ్‌ అగర్వాల్‌

సంప్రదాయ విజ్ఞానం ముఖ్యమైనది. కానీ దానిలోని దురవగాహనలకు తప్పక అడ్డుకట్ట వేయాలి. విమర్శ స్ఫూర్తిని అభివృద్ధి చేయడాన్ని రాజ్యాంగం ఒక విధిగా నిర్దేశించిన భారత్‌ వంటి దేశంలో నిపుణులు తప్పుడు సమాచారంపై కూడా యుద్ధం చేయాలి. ప్రసవ సమయంలో ప్రాచీన గ్రంథాలను అధ్యయనం చేయడానికి ఉన్న ప్రాధాన్యతపై, ఆధునిక తల్లితండ్రులకు అపసవ్యతలు, మానసిక వ్యాధులతో పిల్లలు ఎందుకు పుడుతున్నారు అనే అంశంపై చర్చ నడుస్తోంది. దీనికి సంస్కార లేమిని కారణంగా చూపుతున్నారు. శాస్త్రీయ, సామాజిక, నైతిక స్థాయిల్లో ఇలాంటి ఆలోచన తప్పు. పిల్లల జెండర్‌ కారణంగా మహిళలను సాంప్రదాయికంగా నిందిస్తున్న వాతావరణం గురించి ప్రతి డాక్టర్‌ కూడా జాగరూకతతో ఉండాలి.

భారత్‌ అభివృద్ధి చెందుతున్న దేశం కాదు. అది అభివృద్ధికి పరాకాష్ఠగా ఉండి పతనమైంది, మళ్లీ వృద్ధి చెందుతోంది. ఒకప్పుడు మనకు విలువైన సంప్రదాయ విజ్ఞానం ఉండేది. అయితే ఇప్పుడది ఆధునిక శాస్త్రీయ మదింపునకు గురికావలసి ఉంది. పైగా సంప్రదాయ విజ్ఞానానికి తగిన సాక్ష్యాధారం లేదని భావిస్తున్నారు. కానీ ఆరోగ్య రంగంలో, స్వావలంబనతో కూడిన జీవన ఆచరణలు ఆయుర్వేదంలో సమృద్ధిగా ఉన్నాయి. ఆధునిక వైద్యం ఇప్పుడు వాటినే ప్రతిధ్వనిస్తోంది. ఉదాహరణకు, ప్రేవుల ఆరోగ్యం(గట్‌ హెల్త్‌), పలురకాల ఆరోగ్యకరమైన ఆహార రకాల లక్షణాలను, వంటల పద్ధతులను ఆయుర్వేదం చాలా కాలంగా నొక్కి చెబుతోంది. ఆహారం, ప్రేవుల్లోని సూక్ష్మజీవులు ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాన్ని ఆధునిక సైన్స్‌ ఇటీవల మాత్రమే పరిగణనలోకి తీసుకుంది.

అయితే సంప్రదాయ విజ్ఞానం మూఢనమ్మకాలతో, దురభిప్రాయాలతో కూడి ఉంటోంది. వ్యక్తికీ, సమాజానికీ హాని కలిగించకుండా వీటిని తప్పక వడపోత పోయాలి. వైద్యంలో నిరూపించాల్సిన బాధ్యత చాలా ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే తప్పు సూచన ఇస్తే అది మానవ ప్రాణాలకే ప్రమాదకరం. సందేహాస్పదమైన మూలికా సప్లిమెంట్ల కారణంగా ఆరోగ్యవంతమైన ప్రజల్లో కూడా కాలేయం దెబ్బతింటున్న కేసులు పెరుగుతున్నాయి. వీటన్నింటికీ ఉత్తమమైన వైఖరి ఆరోగ్యపరమైన సంశయవాదమే. అప్పుడు మాత్రమే మూలంతో పనిలేకుండా కొత్త ఆలోచనలు మనలో తెరుచుకుంటాయి.

ఏదైనా నిరూపితం కాని కొత్త ఆలోచన కనిపించినప్పుడు, మూడు కోణాల్లోని కచ్చితమైన ప్రమాణాలతో దాని లబ్ధిని పరీక్షించాల్సి ఉంటుంది. మొదటిది, శాస్త్రీయ ఆమోదయోగ్యత. రెండు, జరిగే హానిని పరిశీలించడం. మూడు, నిర్దిష్ట శాస్త్రీయ సంభావ్యత. శాస్త్రీయ వైద్య ఆచరణలో మేళనం వైపుగా సాక్ష్యాన్ని తీసుకురాదగిన సంభావ్యత ఇది. సైన్స్‌, సైంటిఫిక్‌ మెథడ్‌ ద్వారా సత్యాన్ని వెంటాడటం భవిష్యత్‌ సమగ్ర వైద్యశాస్త్రపు సారాంశం. అలాంటి మార్గాన్ని చాలా సంస్థలు సిఫార్సు చేశాయి. వీటిలో మూఢ నమ్మకాలను పాతిపెట్టిన వారి నుంచి, నీతి ఆయోగ్‌ వంటి భారతదేశ పరివర్తనకు మార్గదర్శకత్వం వహిస్తున్న సంస్థల వరకు ఉన్నాయి. ఏమైనప్పటికీ ఇది సవాలుతో కూడుకున్నది.

ఇటీవలే, ఏకీకరణ వైద్యానికి సంబంధించి మాతృ, శిశు వైద్యుల సమావేశం ఒకటి జరిగిందని మీడియా కథనాలు వెలువరించాయి. ఇందులో నా పూర్వసంస్థ అయిన ఢిల్లీలోని ఆల్‌ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌(ఎయిమ్స్‌) సీనియర్‌ ఫ్యాకల్టీ కూడా పాల్గొ న్నారు. అయితే ఆ కథనంలో కొన్ని భాగాలు అశాస్త్రీయంగా ఉండటం ఇబ్బంది కలిగించింది. పుట్టబోయేవారికి సంబంధించిన తల్లుల లింగపరమైన అంచనాలు పిల్లల్లో స్వలింగ సంపర్కానికి దారితీయవచ్చునేది అందులో ఒకటి. ఉదాహరణకు ఆడ పిల్లను కోరుకుంటున్న గర్భిణి మగపిల్లాడిని హోమోసెక్సువల్‌ (స్వలింగ సంపర్కి)గా పెరిగేట్టు చేస్తుందనే ఆలోచన హాస్యాస్పదం. జీజాబాయి(శివాజీ తల్లి) ప్రార్థనలను గర్భవతిగా ఉన్నప్పుడు అనుసరిస్తే 'హిందూ నాయకుల' లక్షణాలతో పిల్లలు పుడతారన్న సూచనలు ఆందోళనకరం.



ప్రసవ సమయంలో ప్రాచీన గ్రంథాలను అధ్యయనం చేయడానికి ఉన్న ప్రాధాన్యతపై, ఆధునిక తల్లితండ్రులకు అపసవ్యతలు, మానసిక వ్యాధులతో పిల్లలు ఎందుకు పుడుతున్నారు అనే అంశంపై చర్చ నడుస్తోంది. దీనికి సంస్కార లేమిని కారణంగా చూపుతున్నారు. శాస్త్రీయ, సామాజిక, నైతిక స్థాయిల్లో ఇలాంటి ఆలోచన చాలా తప్పు. అంతిమ సమగ్ర మొత్తం దాని విడిభాగాల మొత్తం కంటే తక్కువగా ఉండదని మనం ఎలా నిర్ధారించాలి?

పలువురు ఆయుర్వేద సహచరులు ఈ చర్చను 'గర్భసంస్కార్‌'పై వక్రీకరించిన వైఖరి అని తోసిపుచ్చారు. ప్రసవ సమయంలో ఆరోగ్యకరమైన ఆచరణల ప్రాధాన్యత గురించే గర్భసంస్కార్‌ మాట్లాడుతుంది. భవిష్యత్తు పిల్లల ఆరోగ్యాన్ని బాహ్య జన్యు ప్రభావాల ద్వారా ఇది ప్రభావితం చేస్తుంది. ఈ మీడియా నివేదికల గురించి ఎయిమ్స్‌లో శిక్షణ పొందిన డాక్టర్ల బృందంలో చాలామంది జాగ్రత్తగా ఉండాలన్నారు. అయితే ఇలాంటి ఆలోచనలు, ఆచరణలు అంత హానికరం కాదని మరి కొంతమంది భావించారు. అలాంటి నివేదికల్లో మంచి భాగాన్ని ప్రజలు తీసుకోవచ్చనీ, మిగతా వాటిని వదిలేయాలనీ వీరు సూచించారు. వీరి దృష్టిలో, సాక్ష్యాధారం లేకపోవడం అంటే సాక్ష్యం లేదని అర్థం కాదు. పైగా మనం సంప్రదాయాల గురించి మరీ విమర్శనాత్మకంగా ఉండకూడదన్నది వీరి ఆలోచన. భారత్‌లో సమగ్ర పరిశోధనల నిర్వహణకు ఈ రెండో వైఖరి ఎంతమాత్రమూ ఉపకరించదు.

ఆయుర్‌జీనోమిక్స్‌ అనేది ఆయుర్వేద భావనలు, జీనోమిక్‌ పరిశోధనల సంగమం. దీనికి నా పూర్వ సంస్థ సీఎస్‌ఐఆర్‌–ఐజీఐబీ విజయవంతంగా నేతృత్వం వహించింది. ఎందుకంటే మేము నిజాయితీతో కూడిన శాస్త్రీయ చర్చలు జరిపేవాళ్లం. ఆ చర్చల్లో మేము ఆయుర్వేద టీమ్‌కు సాక్ష్యాధారాల గురించి సవాల్‌ విసిరేవాళ్లం. ఒక పక్షం నిపుణులు మరొక పక్షంలోని వాళ్లను ప్రశ్నించకూడదని భావిస్తుంటారు. ఇలాంటి వైఖరి తెలివితక్కువతనంతో కూడింది. ఇది దీర్ఘకాలంలో ప్రమాదకరంగా మారుతుంది. సహకారం అందించుకునే సమయాల్లో శాస్త్రీయ సంభావ్యతల సరిహద్దులను మేం పాటించేవాళ్లం. వాటిని తరచుగా తిరిగి సందర్శించేవాళ్లం. నూతన జ్ఞానాన్ని గుర్తించేవాళ్లం. ఇది అర్థవంతమైన సహకారాన్ని వేగవంతం చేసేది. మరోవైపున అర్థరహితమైన వాటిని తొలగించేవాళ్లం. పైగా, మహిళలు తప్పుడు సమాచారపు పర్యవసానాలను ఎదుర్కొంటున్న భారత్‌ వంటి భిన్నమైన సమాజంలో వాస్తవికతల నేపథ్యంలో మాత్రమే మనం ఫలితాన్ని వీక్షించవలసిన అవసరం ఉంది.

సీనియర్‌ నిపుణుల ద్వారా ప్రచారమయ్యే తప్పుడు విశ్వాసాలకు పర్యవసానాలు ఉంటాయి. పైన పేర్కొన్న ఉదాహరణలో, ఇలాంటి చర్చలు పిల్లల్లోని వివిధ సామర్థ్యాలు లేక లైంగిక ధోరణుల కారణంగా తల్లిని నిందించడానికి దారితీస్తాయి. లేదా గర్భిణిపై సామాజిక ఒత్తిడిని కలిగిస్తాయి. పిల్లల జెండర్‌ కారణంగా మహిళలను సాంప్రదాయికంగా నిందిస్తున్న వాతావరణం గురించి ప్రతి డాక్టర్‌ కూడా జాగరూకతతో ఉండాలి. అలాంటి సామాజిక అవలక్షణాలకు తప్పుడు సమాచార ప్రచారాన్ని వైద్యులు అనుసంధానించుకోగలగాలి. శాస్త్రీయ ఉధృతిని, మానవవాదాన్ని, విమర్శ స్ఫూర్తిని, సంస్కరణను అభివృద్ధి చేయడం ప్రాథమిక విధిగా రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 51ఎ (హెచ్‌)ని కలిగి ఉన్న దేశంలో వైద్య వృత్తిలో ఉన్నవాళ్లు చేయవలసింది చాలానే ఉంది.

ఒక ఆచరణను ప్రశ్నించే లేదా సవాలు చేసే విషయంలో సీనియర్లను లేదా బోధకులను ఆధునిక వైద్య సంస్థలతో సహా భారత్‌లో తగిన విధంగా గౌరవించడం లేదు. పర్యవసానంగా, మనకు మితిమీరిన విశ్వాసం ఉంటోంది తప్పితే సైంటిఫిక్‌ టెంపర్‌ ఉండటం లేదు. ఇది తప్పక మారాలి. మన ఇంటిని చక్కదిద్దుకున్న తర్వాతే ఇతరులతో వ్యవహరించే నమ్మకం మనకు వస్తుంది. మనల్ని మనం ప్రశ్నించుకుంటున్నట్లే ఇతరుల ఆచరణలను కూడా మనం శాస్త్రీయంగా ప్రశ్నించగలం. చిట్టచివరగా, ఈ ప్రపంచంలో మ్యాజిక్‌ లేదు, సర్వత్రా సైన్స్‌ మాత్రమే ఉంది.

వ్యాసకర్త డీన్‌, బయోసైన్సెస్‌ అండ్‌ హెల్త్‌ రీసెర్చ్‌, అశోకా యూనివర్సిటీ

('ది హిందుస్థాన్‌ టైమ్స్‌' సౌజన్యంతో)

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్వయంకృతాపరాధం



రిపబ్లికన్‌ పార్టీ సభ్యులారా, వివేకం తెచ్చుకోండి. అబద్ధాలను నమ్మవద్దు. ఇది రాజకీయం కాదు. డోనాల్డ్‌ ట్రంప్‌ తనకు తాను చేసుకున్నారు. ఆయన మీ విశ్వాసాన్ని వమ్ము చేశారు. (అమెరికా మాజీ అధ్యక్షుల్లో నేరాభియోగాన్ని ఎదుర్కోనున్న మొదటివాడు డోనాల్డ్‌ ట్రంప్‌.)

– స్టీఫెన్‌ కింగ్‌, రచయిత

లోపలి వార్త



ఫ్రాన్స్‌ అధ్యక్షుడు మెక్రాన్‌ ప్రజాస్వామ్యాన్ని మోసపుచ్చాడని డెబ్బై శాతానికిపైగా జనం భావిస్తున్నారు. కానీ దానికి ఆ నియంత ఎలా స్పందిస్తున్నారు? వృద్ధులని కూడా చూడకుండా పోలీసులు కొడుతున్నారు. దీన్ని టీవీల్లో చూపించరు. ఇలాంటి వార్తలు తెలియకుండా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటోంది. కానీ తెలుసుకోవాలి.

– బెర్నీ స్పాఫోర్త్‌, కామెంటేటర్‌

డబ్బే అక్కర్లేదు



డబ్బు అనేది ఎంతో ప్రాధాన్యత కలిగినదే. కానీ మనం సంతోషంగా ఉండటానికి అదొక్కటే తగిన కారణం అని చెప్పలేము.

– ఫిరోజ్‌ అజీజ్‌, ఆర్థికాంశాల నిపుణుడు

అసలు లక్ష్యం



నూతన పార్లమెంట్‌ భవనం ఫొటోలు చూస్తుంటే – చక్కగా, సొగసుగా ఉన్నాయి. కానీ మన కాలపు పెద్ద సమస్యలను వాస్తవికంగా చర్చిస్తే ఇంతకంటే చక్కగా ఉంటుంది.

– రాజ్‌దీప్‌ సర్దేశాయి, జర్నలిస్ట్‌

పట్టించుకోరా?



తేనెటీగల విషం క్యాన్సర్‌ కణాలను చంపుతుంది. అలాంటప్పుడు ప్రతి హాస్పిటల్‌లోనూ దాన్ని ఎందుకు వాడటం లేదు. జవాబు ఎప్పుడూ అదే. డబ్బులు ముఖ్యం.

– డేన్‌, సోషల్‌ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌

సాక్షి ఎడిటోరియల్‌ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్‌: editpage@sakshi.com

ఇన్‌బాక్స్‌

దోషులను రక్షించే ప్రయత్నాలు?

పోరు చేసి సాధించుకున్న తెలంగాణలో బతుకులు తాకట్టు పెట్టి పిల్లలను చదివిస్తే... ఇన్నేళ్లుగా ఉద్యోగ ప్రకటనలే లేవు. తీరా ఒకటీ అరా నోటిఫికేషన్‌లు ఇచ్చినా... పరీక్షల నిర్వహణ ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికీ, కొందరి స్వలాభాపేక్షకూ పరాకాష్ఠగా నిలిచింది. ఇటీవల టీఎస్‌పీఎస్సీ పరిధిలో టీపీబీఓ, ఏఈ, సింగరేణి, గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ వంటి పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు పరీక్షల తేదీల కంటే ముందే బయటికి రావడాన్ని ఇంతకన్నా మరో విధంగా అర్థం చేసుకోలేం.


రాష్ట్రంలో వివిధ శాఖల్లో అక్షరాలా లక్షా తొంభై ఒక్కవేల ఆరువందల నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వానికి 'బిస్వాల్‌ కమిటీ' నివేదిక అందించింది. కానీ ప్రభుత్వం మాత్రం అతి కొద్ది ఖాళీల భర్తీకే నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పరీక్షలకు హాజరైన నిరుద్యోగులకు ప్రశ్న పత్రాల లీకేజీ వార్త పిడుగుపాటయ్యింది.

ఇంత జరిగినా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కనీసం ఈ విషయంపై నోరెత్తకపోవడం బాధ్యతా రాహిత్యమే. ఐటీ మినిస్టర్‌ కేటీఆర్‌ స్పందించారు కానీ ఆయన ప్రకటన చూస్తే ఇదేదో ఒకరిద్దరు పాల్గొన్న చిన్న వ్యవహారం అన్న ధోరణిలో ఆయన ఉన్నట్లు అర్థమవుతోంది. టీఎస్‌పీఎస్సీలో పని చేసే ప్రవీణ్‌, రాజశేఖర్‌ రెడ్డిలు తప్ప వేరే ఎవరూ దోషులు లేరు అన్నారాయన. కానీ సిట్‌ విచా రణలో చాలా మంది పేర్లు బయటకు వస్తున్నాయి. అనేక పేపర్లు లీక్‌ కావడం, లక్షల రూపాయలకు అమ్ముకోవడం వంటి సంగతులు వెలుగు చూస్తున్నాయి. ముప్పై లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలను ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారం అతలాకుతలం చేసింది. వాటిని భద్రపరిచే విధిలో విఫలం చెందిన చైర్మన్‌ను బాధ్యుడిని చేసి అదుపులోకి తీసుకొని విచారించ లేదు. అసలు దోషులను వదిలిపెట్టే ప్రయత్నం ముమ్మరంగా కొనసాగుతున్నది. అందులో భాగంగానే చిన్నా చితక వాళ్లను అరెస్టు చేసి కేసును పక్కతోవ పట్టించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

– పెద్దింటి రామకృష్ణ, పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు । 97055 18978

ఇయ్యాల్రేపు పోరగాల్లు...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే ఆనంద్‌ బాగ్‌ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్‌ డబ్బ ఉన్నది. గది మా అడ్డ. గాడ సిగిలేట్లు దాగెటోల్లు సిగిలేట్లు దాగుతుంటరు. పాన్లు దినెటోల్లు పాన్లు దింటుంటరు. పాన్‌ డబ్బ దగ్గర్లనే ఛాయ్‌ బండి ఉన్నది. గాడ ఛాయ్‌ దాగినోల్లు గీడ్కి వస్తుంటరు. పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్‌ డబ్బ కాడ జమైతరు. సిగిలేట్లు దాక్కుంట పాన్లు దినుకుంట మా దోస్తులు ముచ్చట బెడుతుంటరు. గీ దాని మీద గా దాని మీద అనకుంట అన్నిటి మీద గాల్లు మాట్లాడుతుంటరు. రాజకీయాల మీద మాట్లాడుకుంట మాటలతోనే కొట్లాడుతుంటరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం మాట్లాడుకుండ్రో నాకెర్క లేదు. గని నేను బోయినంక గాల్లు గీ తీర్గ మాట్లాడుకున్నరు.

''చిన్న పోరగాల్లకు ఏమెర్క లేదనుకుంటం. గాల్లు మన కన్న చాలు గాల్లు'' అని సత్నారి అన్నాడు.

''ఎట్ల చాలు గాల్లో జెరజెప్పు'' అని ఇస్తారి అన్నాడు.

''మొన్న లచ్చినారి తాన్కి బోయిన.''

''పోతె ఏమైంది?''

''చెప్తున్న గదర గంత ఆత్రమైతె ఎట్ల?''

''ఆత్రం లేదు గీత్రం లేదు. ఎప్పుడడిగిన తీర్గనే అడ్గిన.''

''లచ్చినారి ఇంట్ల లేడు. గని గాని చిన్న పోరడు గండ్ల బడ్డడు.''

''గాని తోని నీకేం పని?''

''నాకేం పని లేదు. గని గాడు బోర్నవిట డబ్బతోని ఆడుకుంటున్నడు.''

''గాడు ఆడుకుంటె నీకేంది?''

''నాకేం లేదు, గని వారీ! బోర్నవిట తాగుతవా? లేకుంటె తింటవా అని గాన్ని అడిగిన.''

''అడిగితె గాడేమన్నడు?''

''బోర్నవిట తాగ. తిన. పార బోస్త. నీకేమన్న బాదనా'' అని అన్నడు.

''నువ్వేమన్నవు?''

''నేనేమంట. నోర్మూస్కోని ఇంటికి బోయిన.''

''మా పోరడు పదో తరగతిల ఉన్నడు.''

''మీవోడు బాగ సదువుతున్నడా?''


''సదువా పాడా?''

''ఏంది గట్లంటున్నవు?''

''మా వోడు ఎప్పుడు దోస్తులతోని తిరుగుతుంటడు. సిన్మాలు జూస్తుంటడు.''

''నువ్వు కోప్పడలేదా?''

''కోప్పడుడు గాడు రెండేకిన.''



''మీ వోడు నీ మాట ఎందుకింట లేడు?''

''గాడేమన్నడో ఎర్కెనా?''

''ఏమన్నడు?''

''టీపీఎస్సీ పరీచ్చ పేపర్లు లీకైన తీర్గ పదో తరగతి పరీచ్చ పేపర్లు గుడ్క లీకైనా అయితయి. గసుంటప్పుడు పుజూల్ల సదువ్వెందుకు నాయినా?'' అని గాడు అన్నడు.

''గాడన్న దాంట్ల గుడ్క నిజెమున్నది గదా.''

''ఉన్నదనుకో. సదువుకు దగ్గరి తొవ్వ ఉండదు గదా!''

''ఉండదు. గని మీ వోడు మంచిగ సద్వుకున్నా సర్కారి కొల్వు దొరుకదా?''

''దొర్కకుంటె దొర్కకపాయె. సర్కారి కొల్వు దొర్కకుంటె ఛాయ్‌ బండి బెట్టిపిస్త.''

''మీవోడు ఛాయ్‌ గిన అమ్మితె రేపొద్దుగాల్ల ప్రతాని అయితడనుకుంటున్నవా?''

''ఎందుకనుకోవద్దు. అయినా అయితడేమో.''

''నాల్గో తర్గతి, ఐదో తర్గతి పోరగాల్లకు బస్త వయ్యిలు ఎందుకున్న యనుకుంటున్నవు?''

''ఎందుకున్నయి?''

''కొల్వులు దొర్కకుంటె బస్తలు మోస్కోని బత్కుతరని.''

''మొన్న బజార్ల యాద్గిరి గల్సిండు.''

''గల్సి ఏమన్నడు?''

''గాడు మోంబత్తిల కార్కాన బెడుతుండట.''

''గది బెట్టుడెందుకు?''

''కరెంటు ఛార్జిలు పెర్గుతున్నయట.''

''పెర్గితె ఏమాయె?''

''కరెంటు ఛార్జిలు పెర్గితె అందరు లైటు బుగ్గలను ఇడ్సిపెట్టి మోంబత్తిలు ముట్టిస్తరట.''

''యాద్గిరి పోరడు మంచిగ సదువుతున్నడా?''

''సదువుడేమొగని గాడు అన్ని అబద్ధాలు జెప్తున్నడట.''

''ఎందుకు జెప్తున్నడట?''

''ఇంటికొక కొల్వు ఇస్త; దలితున్ని ముఖ్యమంత్రిని జేస్త; దలితులకు తలా మూడెక్రాలు ఇస్త అనుకుంట కేసీఆర్‌ అబద్ధాలు జెప్పంగ; మీ బేంకు కాతాలల్ల పది లచ్చల రూపాయలేస్త అని మోదీ అబద్ధాలు జెప్పంగ తప్పు లేదు గని నేను జెప్తె తప్పా అని గాడు అన్నడట.''

''యథా లీడర్‌ తథా పోరడు.''

''యాద్గిరి కీసలకెల్లి గాని పోరడు నూర్రూపాయలు దొంగతనం జేసిండట. గాన్ని దొంగ అంటె నన్ను గిన దొంగ అంటివా అంటె రౌండు యాడాదులు నిన్ను జేల్ల బెడ్తరని అన్నడట.''


గీ తీర్గ మా దోస్తులు నాత్రి తొమ్మిది గొట్టెదాంక ముచ్చటబెట్టిండ్రు.

రచయిత సీనియర్‌ జర్నలిస్ట్‌ । 99591 50491

జ్ఞాన సాధనే ముఖ్యం

తిన్నందువల్ల కలిగే పుష్టి పశువులకు, తెలుసుకున్నందు వల్ల కలిగే పుష్టి మానవులకు అంటారు. అవును, మనిషి ఎంత జ్ఞానం తెలుసుకుంటే అంత జ్ఞాని అవుతాడు. మనిషిని నడిపించేదీ, మనిషిగా బతికించేదీ జ్ఞానమే! జ్ఞాన సంపాదనలో మనిషి సిగ్గుపడకూడదు. వెనకడుగు వేయకూడదు. ఉపవాస వ్రతం పాటించకూడదు. 'ఇంతవరకే తెలుసుకోవాలి' అనే హద్దులూ నిర్ణయించుకోకూడదు. ఎందుకంటే మనుషులకు పరిపూర్ణపు బ్రతుకునిచ్చేది ప్రజ్ఞ మాత్రమే! పరిపూర్ణమైన జ్ఞానమే ప్రజ్ఞ!

దైనందిన కార్యక్రమాల్లో భిక్షువులకు జ్ఞానాన్ని పొందే కాలం, జ్ఞానాన్ని పంచే కాలమే ఎక్కువ. తిండి కోసం తిప్పలు పడే కాలం చాలా తక్కువ. ఒంటి పూట మాత్రమే వారు ఆహారం తీసుకోవాలి. భిక్షువులు సంచరిస్తూ ధర్మ ప్రబోధాలు చేస్తూ ఉంటారు. కొంత కాలం ఏకాంతంగా ఆరామాల్లోనో, అడవుల్లోనో ఉంటారు.



జ్యోతిర్మయం

వారు ఎలాంటి చోట ఉండాలో, ఎలాంటి చోట ఉండకూడదో బుద్ధుడు చెప్పాడు. ఇవి జ్ఞాన సాధనకు కృషి చేసే అందరికీ వర్తిస్తాయి. వ్యక్తి వికాసానికి దోహదం చేస్తాయి.

మనం ఎక్కడ ఉంటే ఏకాగ్రత కుదురుతుందో, మనస్సు నిర్మలం అవుతుందో, ఎరుక కలుగుతుందో, ధ్యాన సాధన సాగుతుందో అలాంటి చోట్ల ఉండాలి. ఇవన్నీ జ్ఞానాన్ని సాధించే ప్రక్రియలే. ఇలాంటి స్థితి ఎక్కడ ఉంటే అక్కడ ఉండాలి.

ఒక నివాసంలో అయినా, ఊరిలో అయినా, చివరికి అడవిలో అయినా సరే... జ్ఞాన సాధనకు ఇబ్బందులు లేకపోతే, అక్కడ ఉండాలి. ఒక అడవిలో జీవించడానికి కావలసిన ఆహారం సమృద్ధిగా దొరుకుతుంది. నివాసానికి ఇబ్బంది ఉండదు. అయినా జ్ఞానాన్ని సాధించే అవకాశం లేకపోతే ఆ అడవిని వదిలిపెట్టాలి. ఇదే స్థితి ఒక గృహంలో ఉన్నా, ఊరిలో ఉన్నా వాటినీ విడచిపెట్టాలి.

మరి మరో అడవి ప్రాంతంలో ఆహారం సరిగా దొరకదు. నివాసానికి అంత అనుకూలంగా ఉండదు. కానీ... అక్కడ చక్కని ఏకాగ్రత కుదురుతుంది. ధ్యానం సాగుతుంది. ప్రజ్ఞ వికసిస్తుంది. కాబట్టి అలాంటి అడవిని వదిలి పెట్టకూడదు. అడవే కాదు... గృహమైనా, గ్రామమైనా, నగరమైనా అంతే!

అరకొర సౌకర్యాలు ఉన్నా, అజ్ఞానాన్ని తొలగించుకుని, విజ్ఞానాన్ని పెంపొందించుకునే ప్రదేశాలను వదిలిపెట్టకూడదు. అంటే... ప్రజ్ఞే ముఖ్యం, పొట్ట నింపుకోవడం కాదు అనేదే ఈ బుద్ధ సందేశం!

– బొర్రా గోవర్ధన్‌

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ఏకాదశి తె.4.02 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఆశ్లేష తె.4.42 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి మఖ, **వర్జ్యం:** సా.4.15 నుండి 6.02 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.58 నుండి 7.34 వరకు, **అమృతఘడియలు:** రా.2.54 నుండి 4.41 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.59, **సూర్యాస్తమయం:** 6.08.

క్లుప్తంగా...

గుండెపోటుతో 13 ఏళ్ల బాలిక మృతి

నిద్రలోనే తిరిగిరాని లోకాలకు... మహబూబాబాద్ జిల్లాలో ఘటన

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని బోడతండాలో శుక్రవారం తెల్లవారుజామున ఓ 13 ఏళ్ల బాలిక గుండెపోటుతో మృతి చెందింది. బోడతండాకు చెందిన బోడ లక్పతి–వసంత దంపతుల రెండోకూతురు స్రవంతి(13) మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. శ్రీ రామనవమి సెలవు ఉండటంతో గురువారం సాయంత్రం వరకు ఇంటివద్ద తోటిపిల్లలతో కలిసి ఆటలాడుకుంది. తండాకు కొంతదూరంలో నిర్మిస్తున్న కొత్త ఇంటి వద్ద రాత్రి నిద్రించేందుకు తల్లిదండ్రులు వెళ్లగా బాలిక తన నానమ్మతో కలిసి పాత ఇంటి వద్ద నిద్రకు ఉపక్రమించింది. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో నిద్రలేచి ఛాతీలో నొప్పి గా ఉందని నానమ్మకు చెప్పింది. తర్వాత మూత్రవిసర్జనకు బయటికి వెళ్లి వచ్చి పడుకుంది. కొంతసేపటికి బాలిక బాగా ఆయాస పడుతున్నట్లుగా నానమ్మ గుర్తించింది. బాలిక బాబాయి వచ్చి సీపీఆర్ చేసి వెంటనే మరిపెడ మండల కేంద్రంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే బాలిక మృతిచెందినట్లు చెప్పారు. కూతురు బతుకుతుందన్న ఆశతో తల్లిదండ్రులు ఖమ్మంలోని మరో ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి చనిపోయిందని నిర్ధారించారు. స్రవంతి అకాలమృతితో బోడతండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యే చిన్నయ్యతో ముప్పు

కేటీఆర్‌కు షేజల్ వీడియో సందేశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నుంచి తనకు ముప్పు ఉందని.. మంత్రి కేటీఆర్ తమకు కలిసే అవకాశం ఇవ్వాలని ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బి.షేజల్ అలియాస్ నందిని కోరారు. ఈ మేరకు ఆమె శుక్రవారం మంత్రి కేటీఆర్‌కు విన్నవిస్తూ 48 సెకన్ల వీడియో విడుదల చేశారు. తమపై తప్పుడు కేసులు పెట్టారని, పీడీయాక్టు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎలాగైనా తమకు కలిసే అవకాశం కేటీఆర్ ఇవ్వాలని, ఆయన న్యాయం చేస్తారని నమ్ముతున్నామని ఆమె పేర్కొన్నారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి


సంజీవ

కొత్తగూడ: తేనెటీగల దాడినుంచి తప్పించుకుంటూ వెళ్లి బావిలో దూకిన ఓ రైతు అందులో మునిగి చనిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎదుళ్లపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. కొన్‌రెడ్డి సంజీవ (55), అతని సోదరుడు జనార్దన్ నీలంపల్లి శివారులో పొలం పనులు చేస్తున్నారు. ఒక్కసారిగా లేచిన తేనెటీగలు ఇద్దరిపై దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకుంటూ జనార్దన్ సమీప బావిలో దూకాడు. తమ్ముడు దూకడం గమనించిన అన్న సంజీవ కూడా అదే బావిలో దూకాడు. కానీ సంజీవకు ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. ఈత వచ్చిన జనార్దన్ కొద్దిసేపటి తర్వాత నీటిపైకి తేలి చూడగా సంజీవ జాడ తెలియలేదు. విషయం గ్రామస్తులకు తెలియజేయడంతో గాలించి సంజీవను బయటకు తీశారు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. కొత్తగూడ ఎస్సై నగేశ్ పంచనామా నిర్వహించారు.

లంచం కేసులో ఎస్సైకి రెండేళ్ల జైలు

సాక్షి, హైదరాబాద్: లంచం తీసుకున్నట్టు నిరూపితం కావడంతో ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఎస్సై ఆవుల ప్రసాద్‌కు రెండేళ్ల కఠిన జైలు శిక్ష విధించింది. అబిడ్స్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సమయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్సై ఆవుల ప్రసాద్‌కు ప్రత్యేక న్యాయస్థానం ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి జి.రాజగోపాల్ ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు ఏసీబీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రెండేళ్ల జైలుతోపాటు రూ.5వేల జరిమానాను చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. 2013 ఏప్రిల్ 21న అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా ఆవుల ప్రసాద్ విధులు నిర్వర్తిస్తున్న సమయంలో.. ఓ కేసు విషయంలో కె.మాధవరెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. సాక్ష్యాధారాలతో కేసు నిరూపితం కావడంతో శుక్రవారం న్యాయస్థానం శిక్ష విధించదినట్టు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

సారీ.. మమ్మీ!

వైద్య విద్యార్థి బలవన్మరణం

- హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య
- నిజామాబాద్ ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్న సనత్
- వాట్సాప్ గ్రూప్‌లో 'సారీ.. మమ్మీ, డాడీ, అన్నయ్యా'అంటూ మెసేజ్
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మెడికో విద్యార్థి సనత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి సుజాత, తండ్రి రమేశ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మోసం సనత్ (22) గురువారం రాత్రి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం స్నేహితులతో కలిసి సినిమా చూసి, అర్ధరాత్రి వరకు వారితో కలిసి చదువుకున్న సనత్.. ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడనేది తెలియరాలేదు. అతనికి ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలూ లేవని తల్లిదండ్రులు చెప్పగా, ఒత్తిడి కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. తనొక్కడి నంబర్ మాత్రమే ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో తల్లిదండ్రులకు, అన్నయ్యకు సారీ చెబుతూ మెసేజ్ పెట్టాడు తప్ప, ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నదీ వెల్లడించ లేదు. అయితే కొద్దిరోజుల ముందు కూడా అతను ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు మెసేజ్‌ను బట్టి తెలుస్తోంది. కాగా పది నెలల్లో ఈ కళాశాలకు చెందిన ముగ్గురు వైద్య విద్యార్థులు మరణించడం కలకలం రేపుతోంది. సనత్ మృతిపై కళాశాల వర్గాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

సినిమా చూసి..కలిసి చదువుకుని..: పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలో నివసించే మోసం రమేశ్, సుజాత దంపతులకు సనత్ రెండో కుమారుడు. రమేశ్ సింగరేణి ఆర్‌జీ–3 ఏరియాలోని ఓసీపీ–2లో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. కాగా సనత్‌కు పది రోజుల క్రితమే థియరీ పరీక్షలు పూర్తి అయ్యాయి. శనివారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన ఇద్దరు రూంమేట్స్‌తో కలిసి కూలర్ ఉన్న మరో గదిలోకి వెళ్లి అర్ధరాత్రి 2 గంటల వరకు చదువుకున్నాడు. తర్వాత ఒక్కడే గదికి తిరిగి వచ్చాడు. ఉదయం 5 గంటలకు గదికి వచ్చిన స్నేహితులు, డోర్ కొట్టినా స్పందన లేకపోవడంతో బలవంతంగా తెరిచారు. బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న సనత్ చనిపోయి కన్పించాడు. గురువారం అర్ధరాత్రి వరకు తమతో కలిసి గడిపిన సనత్ తెల్లవారేసరికి విగతజీవిగా మారడంతో సహచర విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. వెంటనే అక్కడికి చేరుకున్న కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది.. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

ఒత్తిడితోనే ఆత్మహత్య: ప్రిన్సిపాల్

ఒత్తిడి కారణంగానే సనత్ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు. తెల్లవారుజామున 5 గంటల లోపు ఉరి వేసుకుని ఉండవచ్చని అనుమానిస్తున్నామన్నారు. అతనికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవన్నారు. ఫింగర్ ప్రింట్స్‌తో ఫోన్ లాక్ ఓపెన్ చేశామని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తే అనుమానాలు నివృత్తి అవుతాయన్నారు.

10 నెలల్లో ముగ్గురి మృతి

ఇదే కళాశాలకు చెందిన శ్వేత అనే పీజీ ఫైనలియర్ విద్యార్థిని 2022 మే 13న అనుమానాస్పద స్థితిలో శవమై కన్పించింది. చదువులో చురుగ్గా ఉండే కరీంనగర్ జిల్లాకు చెందిన పేద విద్యార్థిని మరణం అప్పట్లో సంచలనం సృష్టించింది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 25న ఇదే హాస్టల్‌లో మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడకు చెందిన దాసరి హర్ష అనే మెడిసిన్ ఫైనలియర్ విద్యార్థి కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల దాటిందో లేదో సనత్ ఆత్మహత్యకు పాల్పడటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తల్లిదండ్రుల అనుమానాల నేపథ్యంలో సనత్ ఆత్మహత్యను అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

నువ్వే డాక్టర్ అనుకుంటిమి

'మన కుటుంబం మొత్తంలో ఇప్పటివరకు డాక్టర్ లేడు.. నువ్వే డాక్టర్ అనుకుంటిమి కదా సన్నీ (సనత్ ముద్దు పేరు).. డాక్టర్ అయి వస్తావనుకుంటే ఇలా నిన్ను తీసుకుపోతామని అనుకోలేదు కొడుకా.. నా సన్నీను ఇలా చూడలేను.. అన్నను అమెరికా వెళ్లనీ అన్నావు.. నువ్వెటు పోతివిరా సన్నీ..' అంటూ సనత్ తల్లి సుజాత విలపించిన తీరు కంట తడి పెట్టించింది.

అప్పుడే అనుకున్నా కానీ..

సనత్ సెల్‌ఫోన్‌లో ఉన్న ఓ వాట్సాప్ గ్రూప్‌లో అతని ఒక్కడి నంబర్ మాత్రమే ఉంది. ఆ గ్రూప్‌లో 'సారీ.. మమ్మీ, డాడీ, అన్నయ్యా.. ఇలా చేద్దామని ఫార్మా పేపర్–1 పరీక్ష అయ్యాకే అనుకున్నా.. కానీ మేడం, ఫ్రెండ్స్ డిస్టర్బ్ అవుతారని చేసుకోలేదు.. అన్నయ్యా నువ్వు యూఎస్ నుంచి వచ్చి ఇక్కడ ఉండు..'అంటూ రాత్రి 3:11 గంటలకు పోస్ట్ చేసిన ఓ మెసేజ్ ఉంది. సనత్ అన్నయ్య సాయితేజ నెల క్రితమే ఎమ్మెస్ చదువు నిమిత్తం యూఎస్ వెళ్లాడు.

తిరుపతి వెళ్దామని చెప్పి ఇలా చేశాడు..

ఏప్రిల్ 4 తరువాత తిరుపతి వెళదామని చెప్పిన తమ కుమారుడు ఇంతలోనే ఇలా అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ సనత్ తండ్రి రమేశ్ విలపించాడు. మూడురోజుల క్రితం ఫోన్ చేసినప్పుడు కూడా ఏదైనా సమస్య ఉన్నట్టుగా చెప్పలేదన్నాడు. సనత్‌కు ఏడాది క్రితం గాల్ బ్లాడర్ సర్జరీ అయిందని, ఇప్పుడు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యా లేదని చెప్పాడు. సనత్ మరణించినట్టుగా ప్రిన్సిపాల్ తమకు సమాచారం ఇచ్చారని, తాము వచ్చేవరకు మృతదేహాన్ని తీయవద్దని ప్రిన్సిపాల్‌కు చెప్పినా తీశారని తెలిపాడు. తమ కుమారుడి ఫోన్ లాక్ ఎవరు ఓపెన్ చేశారో తెలియదని చెప్పాడు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రం

- దేశ సంపదను కొల్లగొడుతున్న బీజేపీ
- బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దెదించాలి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

బెల్లంపల్లిరూరల్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతపాలన సాగిస్తోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్ యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. దేశ సంపదను అదానీ, లలిత్ మోదీ, నీరవ్ మోదీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి మోదీ ప్రభుత్వం ప్రజల నడ్డివిరుస్తోందని ఆరోపించారు. దోపిడీదారులకు కొమ్ముకాస్తూ నిరంకుశ పాలనతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ అక్రమాలను ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తూ ప్రజలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. సింగరేణి ఆస్పత్రుల్లో వసతులు, ప్రత్యేక వైద్యులు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సమస్యలు పరిష్కారమై మెరుగైన పాలన అందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, నాయకులు మల్లేశ్ పాల్గొన్నారు.

పాదయాత్రలో కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్

భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లి మండలం పెర్కపల్లి నుంచి ప్రారంభమై నెన్నెల మండలం గుండ్ల సోమారం, నార్వాయిపేట్ వరకు సాగింది. ఈ పాదయాత్రలో కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పాల్గొని సంఘీభావం తెలిపారు. భట్టి శుక్రవారం బెల్లంపల్లి ఏఎంసీ మైదానం నుంచి నెన్నెల మండలం గుండ్లసోమారం–నార్వాయిపేట్ వరకు దాదాపు 18 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేశారు.

రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ పాలన ఆటంకం

- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మండిపాటు



హుజూర్‌నగర్: తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ పాలన పెద్ద ఆటంకమని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడానికి ప్రశ్నపత్రం లీకేజీ ఒక ఉదాహరణ అయితే.. లిక్కర్ స్కాం మరో ఉదాహరణ అని విమర్శించారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని నాయకులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటామని కానీ, గెలిచిన వాళ్లు తమ ఆస్తులు, వ్యాపారాల కోసం అధికార దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల కోసం ముంచారన్నారు. ఉద్యోగ నియామకాలు జరుగుతాయని అనుకుంటే ప్రశ్నపత్రాల వ్యాపారం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణ కోసం ఒక్కరే కొట్లాడలేదని, అందరం కలిసి కొట్లాడామని చెప్పారు. సంక్షేమం పక్కకు పోయింది.. డబుల్ బెడ్రూం ఇళ్లు, జాగాలు, మూడెకరాల భూమి, జర్నలిస్టులకు మెడికల్ కార్డు అటకెక్కిచ్చారని కోదండరాం విమర్శించారు. తప్పు చేసి కేసులో ఇరికిన వారి వెంట ప్రత్యేక విమానంలో కేబినెట్ మొత్తం ఢిల్లీకి పోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ప్రశ్నపత్రం లీకేజీ వల్ల నష్టపోయిన వారికి సహాయమందించాలని డిమాండ్ చేశారు. నిరంకుశ పాలనకు, ఆర్థిక దోపిడీ పాలనను అంతమొందించేందుకు అందరూ ఒక్కటై పోరాడాలని పిలుపునిచ్చారు.

ఖమ్మం జిల్లాలో గాలివాన బీభత్సం

- పలు చోట్ల పిడుగులు
- నేలవాలిన పంటలు


బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజరలో నేలరాలిన మామిడి కాయలు

సాక్షి నెట్‌వర్క్, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలుచోట్ల శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల వర్షం కురవడంతో పిడుగులు పడ్డాయి. గాలివానకు మొక్కజొన్న, వరి పంటలు నేలవాలాయి. అలాగే, కోతకు వచ్చిన మామిడి కాయలు రాలిపోయాయి. పలుప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలి సరఫరా నిలిచిపోయింది. మధిర మండలం నాగవరప్పాడులో పిడుగు పడి వరిగడ్డి దగ్ధం కాగా..ఎర్రుపాలెం మండలం అయ్యవారిగూడెంలోని ఓ ఇంట్లో పిడుగు పడి విద్యుత్ ఉపకరణాలన్నీ కాలిపోయాయి. భద్రాచలంలోని రామాలయానికి అనుబంధమైన నరసింహస్వామి ఆలయ ధ్వజస్తంభంపై పిడుగు పడింది. మధిర, ఎర్రుపాలెం, తల్లాడ, ఏన్కూరు, బోనకల్, పెనుబల్లి, పాల్వంచ, కరకగూడెం, చర్ల, జూలూరుపాడు, బూర్గంపాడు, చుంచుపల్లి, పినపాక మండలాల్లోనూ వర్షం కారణంగా పంటలు నేలవాలగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అలాగే, పలు చోట్ల రహదారులపై చెట్లు విరిగిపడటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రభుత్వానికే డీఈఈల నియామక అధికారం

- ఇరిగేషన్ 'సర్వీస్' నిబంధనలకు సవరణ

సాక్షి, హైదరాబాద్: సాగునీటి శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల (డీఈఈ) నియామక అధికారాన్ని ప్రభుత్వమే దఖలు పరచుకుంది. ఈ మేరకు తెలంగాణ ఇంజనీరింగ్ సర్వీస్ రూల్స్–2018ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డీఈఈ తత్సమాన అధికారుల సీనియార్టీని ఖరారు చేయడంతో పాటు పదోన్నతులు కల్పించడం, పోస్టింగులు ఇచ్చే అధికారాన్ని ప్రభుత్వానికి దఖలుపరుస్తూ సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం ఏఈఈ తత్సమాన ఉద్యోగుల సీనియార్టీ, పదోన్నతులు, పోస్టింగుల అధికారం అడ్మిన్ ఈఎన్‌సీకి దఖలు పడనుంది.

భారీ ఖర్చుకు బీఆర్ఎస్ సిద్ధం?

▶ మొదటి పేజీ తరువాయి

నేతలు పలు అంశాలపై రాష్ట్ర నాయకులకు దిశానిర్దేశం చేశారు.

చేరికలపై దృష్టి పెట్టాలి: 'అధికారంలోకి రావడానికి, ప్రజలకు మేలు చేయడానికి ప్రభుత్వంతో కొట్లాడుతున్నాం. జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు ఇచ్చే ఏ కార్యక్రమాన్ని వదిలిపెట్టకూడదు. కచ్చితంగా విజయవంతం చేయాలి. ఎన్నికల్లో గెలిచి తీరాలి. పంచాయతీ మొదలు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు చేరికలపై సీరియస్‌గా దృష్టి పెట్టాలి. చేరిన వారికి తగిన బాధ్యతలు కూడా అప్పగించాలి..' అని పేర్కొనట్టు తెలిసింది. ఇతర ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. • ఏప్రిల్ 5 నాటికి రాష్ట్రంలో పోలింగ్ బూత్ కమిటీల నియామకం 100 శాతం పూర్తి కావాలి. ప్రతి బూత్‌లో 31 మంది తప్పనిసరిగా ఉండాలి. 34,902 బూత్ కమిటీలతో ఏప్రిల్ 6న ఉదయం 9 గంటలకు ప్రధాని మాట్లాడతారు. • దేశవ్యాప్తంగా న్యాయవాది వారోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6 నుండి 14 వరకు రోజుకో కార్యక్రమం ఉంటుంది. • మే 15 నుండి జూన్ 15 వరకు నియోజకవర్గ కేంద్రాల వారీగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై 'సాలుదొర–సెలవు దొర' పేరిట సమావేశాలు నిర్వహించాలి.

నెలకోసారి ప్రధాని పర్యటన: కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని మోదీ తెలంగాణలో నెలకు ఒకసారైనా అధికారికంగా పర్యటించాలని భావిస్తున్నారని తెలిపారు. 8వ తేదీన రాష్ట్రంలో మొత్తం రూ.13,500 కోట్లతో చేపట్టిన వివిధ పనులను ప్రధాని ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. ప్రధాని మేలో వరంగల్‌లో పర్యటించే అవకాశముందని తెలిపారు.

లీకేజీపై పోరు ఉధృతం: బండి

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. పేపర్ల లీకేజీతో 30 లక్షల నిరుద్యోగులు, వారి కుటుంబసభ్యుల పక్షాన నిలబడి పోరాడుతున్నది బీజేపీ ఒక్కటేనని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారన్నారు. ఏప్రిల్ 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ పతాకావిష్కరణ, ఇతర కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. 8న జరిగే ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 30న ప్రధాని మోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ రాబోతోందని, ఈ సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని 100 సెంటర్లలో మన్ కీ బాత్ నిర్వహించాలని చెప్పారు.

త్వరలో మిలియన్ మార్చ్ : మే రెండో వారంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 500 మంది కష్టపడే కార్యకర్తలతో సమ్మేళనాలు ఉంటాయని, జూన్ 1 నుంచి ఇంటింటికీ బీజేపీ పేరిట ప్రచారం చేయడంతో పాటు, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలు ఎండగట్టనున్నట్లు సంజయ్ తెలిపారు. 'మిలియన్ మార్చ్' తరహాలో త్వరలోనే పది ఉమ్మడి జిల్లాల్లో నిరుద్యోగ మిలియన్ మార్చ్ చేపట్టేందుకు సిద్ధమౌతున్నట్టు చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో లక్ష్మణ్, తరుణ్‌ఛుగ్, కిషన్‌రెడ్డి తదితరులు

'మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ఆక్వా హబ్'

సాక్షి, హైదరాబాద్: మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ఆక్వా హబ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పెట్టుబడిదారుల నుంచి డిమాండ్ ఉన్న ఏడు ప్రదేశాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ప్రోత్సహించడానికి వ్యూహాన్ని రూపొందించాలని అధికారులను సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల ఏర్పాటుపై సాధించిన పురోగతిపై శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో పరిశ్రమల శాఖ అధికారులతో సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, శాఖ అధికారులు హాజరయ్యారు. ఆహార, వ్యవసాయ రంగంలో ప్రతీ జిల్లాలో డిమాండ్, సాధ్యాసాధ్యాల ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేయాలన్నది సీఎం కేసీఆర్ దార్శనికతకు నిదర్శనమన్నారు.

క్లుప్తంగా

చిన్నారి సహా ఆరుగురిని బలిగొన్న మస్కిటో కాయిల్


న్యూఢిల్లీ: దోమల కోసం పెట్టిన మస్కిటో కాయిల్ దిండుపై పడి నిప్పంటుకుని నిద్రిస్తున్న మూడేళ్ల చిన్నారి సహా ఆరుగురిని బలి తీసుకుంది. ఢిల్లీలోని శాస్త్రిపార్క్ ఏరియాలోని మచ్చి మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అక్బర్ అలీ కుటుంబీకులు శుక్రవారం ఉదయం రంజాన్ 'సెహ్రీ'అనంతరం 5 గంటల సమయంలో నిద్రకు ఉపక్రమించారు. గాఢనిద్రలో ఉండగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోని గదిలో పెట్టిన మస్కిటోకాయిల్ పక్కనే ఉన్న దిండుపై పడి నిప్పు అంటుకుంది. దట్టమైన పొగలు మొదటి అంతస్తు వరకు వ్యాపించాయి. విషపూరిత పొగతో ఊపిరాడక మూడేళ్ల హమ్జాతో పాటు మొత్తం ఆరుగురు చనిపోయారు. వీరిలో నలుగురు ఇటీవలే బిహార్ నుంచి వచ్చిన రిక్షా కార్మికులు. కాలిన గాయాలైన 9 మందిని ఆస్పత్రులకు తరలించారు. మిగతా వారు సురక్షితంగా బయటపడ్డారు. ఆ ఇంట్లో సుమారు 25 మంది ఉంటున్నట్లు యజమాని అలీ చెప్పారు.

సిసోడియానే సూత్రధారి.. బెయిలివ్వలేం: కోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ప్రాథమిక సాక్ష్యాలను బట్టి చూస్తే ఈ నేరపూరిత కుట్రకు ఆయనే సూత్రధారి అని ప్రత్యేక న్యాయమూర్తి ఎం.కె.నాగ్‌పాల్ అభిప్రాయపడ్డారు. ''ఈ మొత్తం ఉదంతంలో సిసోడియా పూర్తిస్థాయి భాగస్వామి. మద్యం విధానం రూపకల్పన మొదలుకుని ఉద్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తీసుకున్న చర్యల దాకా అన్ని విషయాల్లోనూ ఆయనది కీలకపాత్ర. ఈ దశలో జైలు నుంచి విడుదల చేస్తే దర్యాప్తుకు తీవ్ర విఘాతం కలుగుతుంది. అందుకే బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నా'' అని పేర్కొన్నారు. ఈ కేసులో సిసోడియాను ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్టు చేయడం తెలిసిందే. అనంతరం మార్చి 9న ఈడీ కూడా ఆయన్ను అరెస్టు చూపింది.

నేడే సిద్ధూ విడుదల!

పాటియాలా: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ (59) శనివారం జైలు నుంచి విడుదల కానున్నట్లు సమాచారం. 1988లో రోడ్డుపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో ఆయన ప్రస్తుతం పంజాబ్‌లోని పాటియాలా కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. ఆ కేసులో ఆయనకు న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. 2022 మే 20వ తేదీ నుంచి ఆయన జైలులో ఉంటున్నారు. ఈ ఏడాది మే 16న జైలు నుంచి విడుదల కావాల్సి ఉంది. సత్ప్రవర్తన కింద 45 రోజులపాటు శిక్షను తగ్గించినట్లు తెలుస్తోంది. దీన్ని జైలు అధికారులు ధ్రువీకరించలేదు.



ముద్దాయి ట్రంప్!

న్యూయార్క్: అమెరికా చరిత్రలో రాజకీయంగా మరో పెను సంచలనానికి తెరలేచింది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందే చెప్పినట్టుగా ఆయన అరెస్టయ్యే అవకాశాలున్నాయి. పోర్న్‌స్టార్ స్టార్మీ డేనియల్స్ (స్టెఫానీ గ్రెగరీ క్లిఫర్డ్)తో లైంగిక సంబంధాలు బయటపెట్టకుండా ఉండేందుకు ఆమెకు డబ్బులు చెల్లించి అనైతిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారన్న ఆరోపణల కేసులో డొనాల్డ్ ట్రంప్‌పై అభియోగాలు నమోదయ్యాయి. న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ గ్రాండ్ జ్యూరీ నేరాభియోగాలు నమోదు చేసినట్టుగా ధ్రువీకరించింది. ట్రంప్ లాయర్లతో కేసు విచారణను పర్యవేక్షిస్తున్న మన్‌హట్టన్ అటార్నీ జనరల్ అల్విన్ బ్రాగ్ మాట్లాడారు. ట్రంప్ లొంగిపోవడానికి సహకరించాలని కూడా బ్రాగ్ సూచించారు. దీంతో ట్రంప్ క్రిమినల్ కేసు విచారణను ఎదుర్కోవడంతో పాటు ఇలాంటి నేరాభియోగాలు ఎదుర్కొన్న మొట్ట మొదటి మాజీ అధ్యక్షుడిగా అపఖ్యాతిని మూటకట్టుకున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి మరోసారి వైట్‌హౌస్‌లోకి అడుగు పెట్టాలని కలలు కంటున్న వేళ నేరాభియోగాలు నమోదు కావడం నైతికంగా ట్రంప్‌కు ఎదురు దెబ్బ తగిలినట్టయింది. తనను అరెస్ట్ చేస్తారని, అదే జరిగితే రిపబ్లికన్ శ్రేణు లు, తన అభిమానులు దేశవ్యాప్తంగా ఘర్షణలకు దిగాలని కూడా గత వారం ఆయన పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

కేసు నేపథ్యం ఇదీ..



2016 అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ తనతో ఉన్న లైంగిక సంబంధాలను బయటపెట్టకుండా ఉండేందుకు పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌ను డబ్బులిచ్చి ప్రలోభ పెట్టారన్న ఆరోపణలున్నాయి. అధ్యక్షుడిగా తన పరువు తీయకుండా ఉండడానికి ట్రంప్ లక్షా 30 వేల డాలర్లను అప్పట్లో తన లాయర్ మైఖేల్ కొహెన్ ద్వారా ముట్టజెప్పినట్టు డేనియల్స్ ఆరోపించారు. ఆ ఒప్పందం చెల్లదంటూ 2018లో ఆమె కోర్టుకెక్కారు. 2006 సంవత్సరంలో తనకు 27 ఏళ్ల వయసున్నప్పుడు ఒక గోల్ఫ్‌కోర్టులో ట్రంప్ పరిచయమయ్యారని, తనతో గడిపితే ఆయన నిర్వహించే రియాల్టీ షో 'ది అప్రెంటీస్'లో అవకాశం ఇస్తానని ఆశ కల్పించారని కొన్ని ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పారు. ఆ తర్వాత తరచూ ఫోన్‌లో మాట్లాడేవారని 2007లో కలిసినప్పుడు ట్రంప్‌తో సన్నిహితంగా గడపడానికి నిరాకరించానని, అందుకే తనకు ఆ షో లో అవకాశం ఇవ్వకుండా ముఖం చాటేశారని తెలిపారు. ఈ విషయాన్ని బయట ఎక్కడా వెల్లడించవద్దని బెదిరించేవారని డేనియెల్స్ ఆరోపించారు. అయితే ట్రంప్ ఆమె ఆరోపణల్ని కొట్టిపారేశారు. ఇప్పుడు జ్యూరీ అభియోగాలు నమోదు చేయడంతో డేనియెల్స్ తన మద్దతుదారులందరికీ ధన్యవాదాలు చెప్పారు. తనకు ఎన్నో సందేశాలు వస్తున్నా స్పందించలేకపోతున్నానని, సంబరాలు కూడా చేసుకోలేకపోతున్నానని ట్వీట్ చేశారు.

ట్రంప్ కోర్టులో లొంగిపోతే ఆయన అరెస్ట్ ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ న్యూయార్క్ అధికారులకి సహకరిస్తారని ఆయన తరపు లాయర్ స్పష్టం చేయడంతో ఆయనపై ఎలాంటి అరెస్ట్ వారెంట్లు జారీ చేయలేదు. ప్రస్తుతం ఫ్లోరిడాలో ఉన్న ట్రంప్‌కి సొంతంగా విమానం ఉంది. న్యూయార్క్‌లో ఏదైనా విమానాశ్రయానికి తన విమానంలో వెళ్లి అక్కడ్నుంచి మన్‌హట్టన్ కోర్టు హాలుకి కారులో వెళతారు. మంగళవారం నాడు ట్రంప్ కోర్టు ఎదుట లొంగిపోయే అవకాశాలున్నాయి.

వేలి ముద్రలు, ఫొటో తీసుకొని...

సర్వసాధారణంగా సామాన్య నిందితుల్ని కోర్టులో హాజరు పరచాలంటే వారికి సంకెళ్లు వేసి నడిపించుకుంటూ తీసుకువెళతారు. కానీ ట్రంప్ దేశానికి మాజీ అధ్యక్షుడు కావడంతో అలా జరిగే అవకాశాల్లేవు. మీడి యా కవరేజీకి అవకాశం లేకుండా ట్రంప్‌ని ప్రత్యేక ద్వారం నుంచి లోపలికి అనుమతించే అవకాశాలున్నాయి. క్రిమినల్ కేసులో అభియోగాలు నమోదు కావడంతో ట్రంప్ వేలిముద్రలు, పోలీసు రికార్డుల కోసం ఆయన ఫొటో తీసుకుంటారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరచడానికి ముందు ట్రంప్‌ని ప్రత్యేక సెల్‌లో ఉంచే బదులుగా వేరే ఒక గదిలో ఉంచుతారు. ఒక్కసారి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచిన తర్వాత ఈ కేసు పురోగతి ఎలా ఉండబోతుందన్నది తెలుస్తుంది.

ట్రంప్‌పై నేరాభియోగాలు..

- నమోదు చేసిన న్యూయార్క్ గ్రాండ్ జ్యూరీ
- క్రిమినల్ కేసులో విచారణ ఎదుర్కోనున్న తొలి అమెరికా మాజీ అధ్యక్షుడు
- పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు డబ్బులిచ్చిన అనైతిక ఒప్పందం కేసులో ఎదురుదెబ్బ..
- న్యాయవ్యవస్థను ఆయుధంగా వాడుకుంటున్నారు: ట్రంప్
- అరెస్టయితే ట్రంప్ భవిష్యత్‌పై చర్చోపచర్చలు

రాజకీయ అణచివేత: ట్రంప్

రాజకీయంగా తనను అణచివేయడానికి డెమొక్రాట్లు ఈ కుట్రకు పాల్పడ్డారని ట్రంప్ ఆరోపించారు. తనపై అభియోగాలు నమోదైన విషయం తెలిసిన వెంటనే ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''ఇదంతా రాజకీయ అణచివేత. దేశ చరిత్రలో ఎన్నికల పరంగా ఉన్నత స్థాయిలో జరుగుతున్న జోక్యం ఇది. రాజకీయ ప్రత్యర్థుల్ని శిక్షించడానికి న్యాయవ్యవస్థని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. నన్ను లొంగదీసుకోవడానికి డెమొక్రాట్లు అబద్ధాలు చెప్పారు. మోసాలు చేశారు. దొంగతనాలకు పాల్పడ్డారు. చివరికి ఇలాంటి అనూహ్యమైన చర్యకి దిగారు. ఒక అమాయకుడిపై అభియోగాలు నమోదు చేశారు. అధ్యక్షుడు జో బైడెన్ ఏం చెబితే మన్‌హట్టన్ జ్యూరీ అదే చేస్తోంది''అని ట్రంప్ ఆ ప్రకటనలో విరుచుకుపడ్డారు. మరోవైపు ట్రంప్ తరపు లాయర్లు ఆయన ఏ తప్పు చేయలేదని దీనిని న్యాయపరంగానే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

ట్రంప్‌పై నేరాభియోగాలు మోపిన న్యూయార్క్ జ్యూరీ ఆ అభియోగాల పత్రాన్ని సీల్ వేసి ఉంచింది. ట్రంప్‌ను అరెస్ట్ చేసిన తర్వాతే సీల్ విప్పుతారు. ఈ కేసుని విచారించే న్యాయమూర్తి స్వయంగా కోర్టు హాలులో నేరాభియోగాలను చదివి వినిపిస్తారు. ఆయనపై ఏయే సెక్షన్ల కింద ఎలాంటి అభియోగాలు నమోదయ్యాయో అప్పుడే అందరికీ తెలుస్తుంది.

బెయిల్ లభిస్తుందా?

ఆ అభియోగాలను బట్టి ఆయనకు బెయిల్ లభిస్తుందా, లేదా అన్నది స్పష్టమవుతుంది. ట్రంప్‌పై ప్రయాణపరమైన ఆంక్షలుంటాయా, లేదా వంటివన్నీ కూడా ఆయన న్యాయమూర్తి ఎదుట హాజరైన తర్వాతే తేలుతాయి. ఈ కేసులో దోషిగా తేలితే ట్రంప్‌కు నాలుగేళ్ల కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. భారీగా జరిమానా కూడా విధిస్తారని కొందరు న్యాయనిపుణులు చెబుతున్నారు.

రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి ఎన్నికల్లో పోటీ పడుతున్న డొనాల్డ్ ట్రంప్ తనపై మోపిన అభియోగాలను రాజకీయంగా అనుకూలంగా మార్చుకునే వ్యూహాల్లో ఉన్నారు. అమెరికా చరిత్రలో అనూహ్యమైన ఈ పరిణామాన్ని రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ప్రచారం చేయడానికి ట్రంప్ మద్దతుదారులు సిద్ధమవుతున్నారు.

రిపబ్లికన్ల నుంచి మద్దతు ఎంత?

ఈ కేసులో ట్రంప్‌పై అభియోగాలను ప్రాసిక్యూషన్ రుజువు చెయ్యలేకపోతే ట్రంప్ తన ఇమేజ్ మరింత పెరుగుతుందన్న భావనలో ఉన్నారు. అయితే రిపబ్లికన్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ మద్దతుదారులు ఈ కేసు వల్ల అధ్యక్ష ఎన్నికల్లో తమ పార్టీకి జరిగే లాభంపై ఇప్పట్నుంచే లెక్కలు వేస్తున్నారు. ''ఇది చాలా చిన్న కేసు. ట్రంప్‌ను వేధించడానికే ఈ కేసుని బయటకు తెచ్చారు''అని న్యూహ్యాంప్‌షైర్‌లో రిపబ్లికన్ పార్టీ చీఫ్ గ్రెగ్ హగ్ వ్యాఖ్యానించారు. ట్రంప్ రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి కావాలంటే పార్టీలో 25 నుంచి 30 శాతం కంటే ఎక్కువ మంది ఆయనకు మద్దతు పలకాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అది కష్టమని ప్రత్యర్థి శిబిరం భావిస్తోంది. నేరాభియోగాలు ఎదుర్కొన్నా, శిక్షపడి జైలుకి వెళ్లినా ఎన్నికల్లో పోటీ చేయకూడదని అమెరికన్ రాజ్యాంగంలో నిబంధనలు లేవు. కానీ అలాంటి వ్యక్తిని అధ్యక్ష అభ్యర్థిని చేస్తే అనవసరంగా పార్టీ పరువు పోతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేరాభియోగాలతో ట్రంప్ ఇమేజ్ మరింత డ్యామేజ్ అయి మరో అభ్యర్థి, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డెసాంటిస్‌కు అనుకూలంగా మారే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయమైతే వినిపిస్తోంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

రిచర్డ్ వర్మకు కీలక పదవి

అమెరికా విదేశాంగ శాఖ డిప్యూటీ సెక్రెటరీగా నియామకం



వాషింగ్టన్: అమెరికా విదేశాంగ శాఖ డిప్యూటీ సెక్రెటరీగా భారతీయ అమెరికన్ రిచర్డ్ వర్మకు కీలక పదవి దక్కింది. శాఖకు సంబంధించిన నిర్వహణ, వనరుల వ్యవహారాలను ఆయన చూసుకుంటారు. దీన్ని అత్యంత శక్తిమంతమైన విదేశాంగ శాఖలో కీలకమైన సీఈఓ స్థాయి పోస్టుగా పరిగణిస్తుంటారు. 54 ఏళ్ల వర్మ నియామకాన్ని సెనేట్ 67–26 ఓట్లతో ఆమోదించింది. మాజీ దౌత్యవేత్త అయిన వర్మ ఒబామా హయాంలో విదేశాంగ శాఖ అసిస్టెంట్ సెక్రెటరీ (న్యాయ వ్యవహారాలు)గా కూడా పని చేశారు. 2015 నుంచి రెండేళ్లపాటు భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్నారు. వర్మ 1968లో అమెరికాలోని భారతీయ కుటుంబంలో జన్మించారు. అమెరికా వైమానిక దళ స్కాలర్‌షిప్‌తో కాలేజీ చదువు పూర్తి చేశారు. లాహిగ్ వర్సిటీ నుంచి బీఎస్, జార్జ్‌టౌన్ వర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం, పీహెచ్‌డీ చేశారు. అనంతరం యూఎస్ ఎయిర్ ఫోర్స్‌లో జడ్జ్ అడ్వొకేట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. దేశాధ్యక్షుని నిఘా సలహా బోర్డులో, సామూహిక జనహనన ఆయుధాలు, ఉగ్రవాద కమిషన్ సభ్యునిగా చేశారు. ప్రస్తుతం మాస్టర్‌కార్డ్ చీఫ్ లీగల్ ఆఫీసర్, గ్లోబల్ పబ్లిక్ పాలసీ హెడ్‌గా ఉన్నారు. ఫోర్డ్ ఫౌండేషన్‌తో పాటు మరెన్నో ప్రతిష్టాత్మక బోర్డుల్లో సభ్యునిగా, ట్రస్టీగా కొనసాగుతున్నారు. విదేశాంగ శాఖ నుంచి అత్యుత్తమ సేవా మెడల్, వైమానిక దళం నుంచి మెరిటోరియస్ సర్వీస్ మెడల్, కౌన్సిల్ ఆఫ్ ఫారిన్ రిలేషన్స్‌నుంచి ఇంటర్నేషనల్ అఫైర్స్ ఫెలోషిప్ తదితరాలు దక్కించుకున్నారు.

షికారిపుర నుంచి విజయేంద్ర పోటీ

వరుణ నుంచి చేసే ప్రసక్తే లేదని తేల్చేసిన యడియూరప్ప

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుడు సిద్దరామయ్యపై పోటీ పడడానికి బీజేపీ నేత బి.ఎస్. యడియూరప్ప కుమారుడు వెనకడుగు వేశారు. వరుణ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న సిద్దరామయ్యపై తన కుమారుడు విజయేంద్ర పోటీపడే అవకాశాలున్నాయని నిన్నటికి నిన్న చెప్పిన యడియూరప్ప ఒక రోజు గడిచిందో లేదో మాట మార్చారు. తన కుమారుడు వరుణ నుంచి పోటీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పేశారు. శివమొగ్గ జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన షికారిపుర నుంచి విజయేంద్ర పోటీ చేస్తారని శుక్రవారం విలేకరులకు చెప్పారు. ఈ విషయాన్ని హైకమాండ్‌కు కూడా చెప్పానని వెల్లడించారు. అయితే వరుణ నుంచి విజయేంద్ర పోటీ చేయాలన్న ఒత్తిడి ఉందని అంగీకరించారు.

నడుస్తున్న కార్లో గ్యాంగ్‌రేప్

సాక్షి, బెంగళూరు: ఉద్యాననగరి బెంగళూరులో దారుణం జరిగింది. నడుస్తున్న కారులో దాదాపు 4 గంటలపాటు యువతిపై నలుగురు కామాంధులు అత్యాచారానికి ఒడిగట్టారు. నగరంలోని ఈజీపురకు చెందిన ఓ యువతి, తన స్నేహితుడితో కలిసి మార్చి 25న రాత్రి 9.30 గంటల సమయంలో కోరమంగళలోని పార్కులో కూర్చుంది. ఇద్దరూ సిగరెట్ తాగుతుండగా దగ్గర్లోనే కూర్చున్న ఓ యువకుడు పొగతో ఇబ్బందిగా ఉందంటూ వాదనకు దిగాడు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిన అతడు, మరో ఇద్దరు స్నేహితులతో తిరిగి వచ్చాడు. బెదిరించి యువతి స్నేహితుడి అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో మరో స్నేహితుడు కారులో రాగా అందరూ కలిసి యువతిని బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. తెల్లవారు జామున 3.30 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కారు నడుస్తుండగానే నలుగురూ ఒకరితర్వాత ఒకరు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. ఈజీపురలోనే రోడ్డు పక్క ఆమెను వదిలేసి వెళ్లిపోయారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితురాలు రెండు రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సతీశ్, విజయ్, శ్రీధర్, కిరణ్ అనే 22–26 ఏళ్ల నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు కూడా ఈజీపురకు చెందిన వారేనని పోలీసులు తెలిపారు.

అమృత్‌పాల్ కోసం డేరాల్లో గాలింపు

హోషియార్‌పూర్: వివాదాస్పద సిక్కు మత బోధకుడు, 'వారిస్ దే పంజాబ్' చీఫ్ అమృత్‌పాల్ సింగ్ ఆచూకీ ఇంకా లభించలేదు. అతడి కోసం పంజాబ్ పోలీసులు వేట మరింత ముమ్మరం చేశారు. హోషియార్‌పూర్ జిల్లాలో ప్రస్తుతం గాలింపు ఉధృతంగా కొనసాగుతోంది. సిక్కు మత సంస్థలైన 'డేరా'ల్లోనూ పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. హోషియార్‌పూర్ జిల్లాలోని మర్నియాన్‌తో పాటు సమీప గ్రామాల్లో వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నారు. నివాసిత ప్రాంతాలే కాకుండా పశువుల పాకలు, పొలాల్లో బోరుబావుల వద్ద ఉండే గదులను సైతం వదిలిపెట్టడం లేదు. డేరాల్లో అమృత్‌పాల్ తలదాచుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆ దిశగా గాలింపు కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. పోలీసులు ఇంటింటికీ తిరిగి అనుమానితులను ప్రశ్నిస్తున్నారు.

ఆస్పత్రి నుంచి నేడు పోప్ ఫ్రాన్సిస్ డిశ్చార్జి

రోమ్: కేథలిక్కుల మత గురువు పోప్ ఫ్రాన్సిస్(86) శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతారని వాటికన్ వర్గాలు తెలిపాయి. సెంట్ పీటర్స్ స్క్వేర్‌లో బుధవారం సంప్రదాయ వారాంతపు ప్రసంగం అనంతరం అస్వస్థతకు గురైన పోప్‌ను రోమ్‌లోని గెమెల్లి పాలీక్లినిక్‌లో చేర్పించారు. బ్రాంకైటిస్‌తో బాధపడుతున్నట్లు పరీక్షల్లో తేలింది. యాంటీబయాటిక్ చికిత్సకు స్పందిస్తున్నారని వాటికన్ ప్రతినిధి చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడుతోందన్నారు. అయితే, ఆదివారం నుంచి ఈస్టర్ వీక్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారా లేదా అనేది సందిగ్ధంలో పడింది. ఇప్పటికే మోకాలి నొప్పితో బాధపడుతున్న పోప్ కొన్ని కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొంటున్నారు. కాగా, పోప్ ఫ్రాన్సిస్ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోదీ శుక్రవారం ట్వీట్ చేశారు.

మోదీ సర్టిఫికెట్లు చూపించాల్సిన అవసరం లేదు

గుజరాత్ హైకోర్టు తీర్పు ● కేజ్రీవాల్‌కు రూ.25,000 జరిమానా



అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్హత సర్టిఫికెట్ల వ్యవహారంలో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మోదీకి చెందిన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఈ సర్టిఫికెట్లను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అందజేయాలంటూ కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ఏడేళ్ల క్రితం జారీ చేసిన ఉత్తర్వును న్యాయస్థానం కొట్టివేసింది. అంతేకాకుండా కేజ్రీవాల్‌కు రూ.25,000 జరిమానా విధించింది. ఈ జరిమానా సొమ్మును నాలుగు వారాల్లోగా గుజరాత్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ(జీఎస్ఎల్ఎస్ఏ)లో డిపాజిట్ చేయాలని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వుపై స్టే ఇవ్వాలంటూ కేజ్రీవాల్ తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది.

అసలేం జరిగింది?

తన విద్యార్హతల విషయంలో ప్రభుత్వ రికార్డులను బయటపెట్టడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, నరేంద్ర మోదీ విద్యార్హతల సర్టిఫికెట్లను బహిర్గతం చేయాలని కోరుతూ కేజ్రీవాల్ 2016 ఏప్రిల్‌లో సమాచార హక్కు చట్టం కింద సీఐసీకి దరఖాస్తు చేశారు. దీంతో మోదీకి చెందిన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లను కేజ్రీవాల్‌కు ఇవ్వాలంటూ గుజరాత్ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీని సీఐసీ ఆదేశించింది. సీఐసీ ఆదేశాలను సవాలు చేస్తూ గుజరాత్ యూనివర్సిటీ గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీఐసీ ఆదేశాలపై మూడు నెలల తర్వాత హైకోర్టు స్టే విధించింది. ఈ కేసులో న్యాయస్థానం ఫిబ్రవరిలో మళ్లీ విచారణ ప్రారంభించింది. గుజరాత్ యూనివర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. మోదీ విద్యార్హతల విషయంలో దాచిపెట్టడానికి ఏమీ లేదని, సమాచారమంతా ప్రజాబాహుళ్యంలో ఇప్పటికే అందుబాటులో ఉందని వెల్లడించారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోనూ వివరాలు ఉన్నాయని తెలిపారు. ఒక వ్యక్తి బాధ్యతారాహిత్యమైన అత్యుత్సాహానికి సమాధానం చెప్పాల్సిన పనిలేదన్నారు. మోదీ సర్టిఫికెట్లను ప్రత్యేకంగా బయటపెట్టడంలో ప్రజాప్రయోజనం ఏమీ లేదని పేర్కొన్నారు. అలాగే ఇది ప్రధానమంత్రి గోప్యతకు భంగం కలిగిస్తుందని తుషార్ మెహతా వివరించారు. అయితే, మోదీ సర్టిఫికెట్లు ఇంటర్నెట్‌లో లేవని, అందుకే ఆధారాలు కోరుతున్నామని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది చెప్పారు. జస్టిస్ బీరెన్ వైష్ణవ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. మోదీ సర్టిఫికెట్లను పీఎంఓ గానీ, గుజరాత్ వర్సిటీ గానీ చూపించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కేజ్రీవాల్‌కు జరిమానా విధించింది. కేంద్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం.. ప్రధాని మోదీ 1978లో గుజరాత్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్(డిగ్రీ), 1983లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పోస్టు–గ్రాడ్యుయేషన్(పీజీ) పూర్తి చేశారు.

అప్పీల్ చేస్తాం: ఆప్

గుజరాత్ హైకోర్టు తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గుజరాత్ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రణవ్ ఠక్కర్ చెప్పారు. ప్రధానమంత్రి విద్యార్హతల సమాచారాన్ని తెలుసుకొనే హక్కును ఈ తీర్పుతో ప్రజలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు జరిమానా విధించడం తమకు ఆశ్చర్యం కలిగించిందన్నారు.

ఆ హక్కు ప్రజలకు లేదా?: కేజ్రీవాల్

ప్రధానమంత్రి విద్యార్హతలను తెలుసుకొనే హక్కు దేశ ప్రజలకు లేదా? అని కేజ్రీవాల్ నిలదీశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ''ప్రధానమంత్రి ఎంతవరకూ చదువుకున్నారో తెలుసుకొనే హక్కు ప్రజలకు లేదా? సర్టిఫికెట్లను కోర్టుకు చూపించేందుకు ప్రధాని ఎందుకు తిరస్కరించారు? ప్రధాని చదివిన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు చూపించాలని కోరితే జరిమానా విధించారు. అసలేం జరుగుతోంది? నిరక్షరాస్యుడు, లేదా తక్కువ చదువుకున్న ప్రధానమంత్రి దేశానికి ప్రమాదకరం'' అని పునరుద్ఘాటించారు.

నాసా 'మూన్ టు మార్స్' చీఫ్‌గా మనోడు!



వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష సంస్థ నాసా 'మూన్ టు మార్స్' కార్యక్రమం హెడ్‌గా భారత సంతతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రోబోటిక్స్ ఇంజనీర్ అయిన అమిత్ క్షత్రియ నియమితులయ్యారు. చంద్రుడిపై సుదీర్ఘ కాలం మకాం వేయడానికి, అక్కడి నుంచి అంగారక గ్రహంపైకి మనుషులను పంపే బృహత్తర లక్ష్యంతో నాసా ఈ మిషన్‌కు రూపకల్పన చేసింది. 'మూన్ టు మార్స్' కార్యక్రమానికి సారథ్యం వహించనున్న అమిత్‌క్షత్రియ నాసా ఎక్స్‌ప్లోరేషన్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్ మిషన్ డైరెక్టరేట్‌లో కొత్తగా ఏర్పాటయ్యే కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తారు. ఇప్పటి వరకు ఆయన కామన్ ఎక్స్‌ప్లోరేషన్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్ డివిజన్ తాత్కాలిక డిప్యూటీ అసోసియేట్ అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నారు. 2003 నుంచి అంతరిక్ష కార్యక్రమాల్లో పనిచేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి అమెరికా వలస వచ్చారు. క్షత్రియ విస్కాన్సిన్‌లోని బ్రూక్‌ఫీల్డ్‌లో పుట్టారు.

దేశ విభజనను పాక్ ప్రజలూ తప్పబడుతున్నారు

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

భోపాల్: పాకిస్తాన్ ప్రజలు సంతోషంగా లేరని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. దేశ విభజన తప్పని పాకిస్తాన్ ప్రజలంతా అంటున్నారన్నారు. అఖండ భారత్ వాస్తవం కాగా విభజిత భారత్ ఒక పీడకల అని అభివర్ణించారు. భారతదేశ విభజన తప్పనే విషయాన్ని, స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల అనంతరం ఇప్పుడు వారు నమ్ముతున్నారని భగవత్ వ్యాఖ్యానించారు. 'స్వాతంత్ర్యానికి ముందు భారత్ నుంచి తెగదెంపులు చేసుకుని అహంకారపూరితంగా వెళ్లిన వారింకా సంతోషంగా ఉన్నారా? లేదు, బాధలు పడుతున్నారు' అంటూ పాకిస్తానీయులనుద్దేశించి ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలపై ఆయన.. 'పాకిస్తాన్‌పై భారత్ దాడి చేయాలన్నది నా ఉద్దేశం ఎంతమాత్రం కాదు. ఇతరులపై దాడులు చేయాలంటూ పిలుపునిచ్చే సంస్కృతి భారత్‌లో లేదు. ఆత్మరక్షణ కోసం దాడులకు తగిన బుద్ధి చెప్పాలనేదే భారత్ సంస్కృతి. దీనినే ఆచరిస్తాం. ఇదే కొనసాగుతుంది'అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య యోధుడు హేము కలానీ జయంతిని పురస్కరించుకుని సింధీలు భోపాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవత్ మాట్లాడారు.

పాక్‌లో ఆహార పంపిణీలో మళ్లీ తొక్కిసలాట

కరాచీ: పాకిస్తాన్‌లోని రేవు నగరం కరాచీలో మరో విషాదం చోటుచేసుకుంది. రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం ప్రజలకు ఆహార పదార్థాలు పంపిణీ చేస్తుండగా, తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. బాధితుల్లో మహిళలు, చిన్నారులు సైతం ఉన్నారు. ఆహార పదార్థాల పంపిణీ జరుగతుండగా, కొందరు అక్కడే ఉన్న కరెంటు తీగపై కాలు వేశారని, దాంతో భయందోళనకు గురై ఒకరినొకరు తోసుకున్నారని, ఫలితంగా పక్కనే ఉన్న కాలువలో పలువురు పడిపోవడం, 11 మంది మరణించడం క్షణాల్లో జరిగిందని అధికారులు వెల్లడించారు. ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమాన్ని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ గతవారం ప్రారంభించారు. పంజాబ్ ప్రావిన్స్‌లో ఇటీవలే గోధుమ పిండి పంపిణీలో తొక్కిసలాట జరిగి 11 మంది దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు..ఏడుగురు మృతి

సంబల్‌పూర్(ఒడిశా): ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఝర్సుగూడ జిల్లా బడధారకు చెందిన కొందరు బొలెరో వాహనంలో పరమన్‌పూర్‌లో గురువారం జరిగిన వివాహవేడుకకు వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా వారి వాహనం అదుపుతప్పి, బోల్తాపడి రోడ్డు పక్కనే ఉన్న ఘామ్ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. ఘటనలో ఏడుగురు చనిపోగా, మరో నలుగురు గాయపడినట్లు సంబల్పూర్ కలెక్టర్ అనన్య దాస్ చెప్పారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.




శుక్రవారం కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లాలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కారును తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న విషయం తెలిసిందే. గంటి సుబ్రమణ్య ఆలయానికి వెళ్తుండగా జరిపిన ఈ తనిఖీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇండోర్ ఆలయంలో విషాదం.. 36కు చేరిన మరణాలు

గల్లంతైన వారినందరినీ వెలికితీశామన్న అధికారులు ● సీఎం చౌహాన్‌కు నిరసనల సెగ

ఇండోర్: ఇండోర్‌లోని బేలేశ్వర్ మహాదేవ్ ఝులేలాల్ ఆలయంలో గురువారం మెట్ల బావి పైకప్పు కూలిన ఘటనలో మృతుల సంఖ్య 36కు పెరిగింది. గల్లంతైన వారందరినీ వెలికితీశారు. ''కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనలో గల్లంతైనట్లు భావిస్తున్న మొత్తం 36 మృతదేహాలను వెలికితీశాం. గాయపడిన మరో 17 మందిని ఆస్పత్రులకు తరలించాం. ఇద్దరిని ప్రథమ చికిత్స అనంతరం ఇళ్లకు పంపించి వేశాం'' అని అధికారులు తెలిపారు. ''అన్వేషణ కార్యక్రమాన్ని ఆపలేదు. బావిలో పడిన స్లాబ్ శిథిలాలను, పూడిక మొత్తం తొలగించే పని ఇంకా కొనసాగుతోంది'' సహాయ, రక్షణ కార్యక్రమాల్లో ఆర్మీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. ఆర్మీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ సంయుక్త బృందం బావిలోకి క్రేన్‌ను, ట్రాలీని దించి, మృతదేహాలను బయటకు తీసుకువచ్చింది. ఆలయ ప్రాంతం ఇరుగ్గా ఉండటంతో సహాయ కార్యక్రమాలు మొదట సజావుగా సాగలేదు. గోడను పగులగొట్టి పైపును దించి బావిలో నీటినంతటినీ బయటకు పంప్ చేశారు'' అని వివరించారు. స్థానిక పటేల్‌నగర్ ఏరియాలోని ఆలయంలో గురువారం నవమి పూజల్లో పెద్ద సంఖ్యలో జనం పాల్గొన్నారు. కొందరు భక్తులు ఆలయంలోని పురాతన మెట్లబావిపై ఏర్పాటు చేసిన స్లాబ్‌పైకి చేరారు. స్లాబ్ కూలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే.



ఘటనాస్థలిని పరిశీలించిన సీఎం

ఉదయం సంఘటనా స్థలిని సందర్శించిన మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు నిరసనల సెగ తగిలింది. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతుండగా సీఎం ముర్దాబాద్, సిగ్గు సిగ్గు అంటూ ప్రజలు నినాదాలు చేశారు. అంతకుముందు ఆయన ఆస్పత్రుల్లో క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. దర్యాప్తు అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి
కరీంనగర్
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



బార్ అసోసియేషన్ కార్యవర్గం

కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జి.రఘునందన్‌రావు, ఉపాధ్యక్షుడిగా వాల మహేందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి నాగరాజు ఎన్నికయ్యారు. - 8లో▸



''పాపపు దేవుడు పగ పట్టిండు బిడ్డా.. అప్పుడు నాన్నను తీసుకుపోయిండు.. ఇప్పుడు అమ్మను కూడా తీసుకుపోయిండు.. ఏం పాపం చేస్తిరిబిడ్డ మీరు.. ఎక్కడ కాకుండా అయిర్రు.. నాన్న పోయినంక అమ్మ కళ్లల్ల పెట్టి సాదుకుంది బిడ్డలారా.. అమ్మ కూడా పోయింది.. ఇప్పుడు ఎట్లా బిడ్డలారా.. అంటూ మృతి చెందిన టీచర్ రజిత కొడుకులను పట్టుకొని బంధువులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.''

ఎక్కువగా నమ్మటం, ఎక్కువగా ప్రేమించటం, ఎక్కువగా ఆశించటం ద్వారా వచ్చే బాధ కూడా ఎక్కువగానే ఉంటుంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6:33	ఆది 4:45

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ప్రైవేటు అధ్యాపకులకు ప్రాధాన్యమివ్వండి



వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలో సుమారు 15 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న అధ్యాపకులను పేపర్ మూల్యాంకణంకు సంబంధించిన ఆర్డర్ కాపీలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కరీంనగర్ లోని డీఐఈవో కార్యాలయంలోని అధికారికి టీఎల్ఎఫ్ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అధ్యాపకులందరిని సమాన దృష్టితో చూడాలని ఆర్డర్ కాపీ రానివారికి తిరిగి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ నాయకులు పోకల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి ధర రూ.7,550



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: వ్యవసాయ పత్తిమార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.7,550 పలికింది. మార్కెట్‌కు 54 వాహనాల్లో 970 క్వింటాళ్ల పత్తి రైతులు అమ్మకానికి తెచ్చారు. క్వింటాల్ పత్తి మోడల్ ధర రూ.7,400, కనిష్ట ధర రూ.7వేలు కాగా గన్నీ సంచుల్లో 15మంది రైతులు 27 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకరాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,200, మోడల్ ధర రూ.7వేలు కనిష్ట ధర రూ.6వేలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా శని, ఆదివారాలు మార్కెట్‌కు సాధారణ సెలువు ఉంటాయని, సోమవారం మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు యాథావిధిగా కొనసాగుతాయని కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ తెలిపారు.

వ్యాన్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్

కరీంనగర్: పట్టణంలోని శివానగర్ ప్రాంతంలో డీసీఎం వ్యాన్‌ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లాస్థాయి సమావేశం శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ హాజరై మాట్లాడారు. రోడ్‌టాక్స్ కట్టే వాహనాలకు టోల్‌టాక్స్ తీసుకోవద్దన్నారు. రవాణా వాహనాలకు 50 శాతం ఇన్సూరెన్స్ తగ్గించాలన్నారు. 15 ఏళ్ల వాహనాలను స్క్రాప్‌కు పంపే వెసులుబాటు 20 ఏళ్లకు పెంచాలని కోరారు. డ్రైవర్‌కు హైవేలపై వెళ్లే సమయంలో అనుకూల వాతావరణంలో రెస్ట్ తీసుకోవడానికి వసతులు కల్పించాలన్నారు. డ్రైవర్ కుటుంబాలను ఆదుకునేందుకు ట్రాన్స్ పోర్టు డ్రైవర్స్ వెల్ఫేర్ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు సమ్మయ్య, యాదయ్య, బండి మల్లన్న, సంపత్, శ్రీశైలం, షమీదర్, మోహన్‌రెడ్డి, సంపత్, కుమార్, కరుణాకర్, రమేశ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి వారాల ఆనంద్‌కు సన్మానం

కరీంనగర్‌కల్చరల్: ప్రముఖ కవి, సాహిత్య అకాడమీ అనువాద అవార్డు గ్రహీత వారాల ఆనంద్‌ను జిల్లా యంత్రాంగం తరపున సన్మానిస్తున్నట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ఉదయం 11 గంటలకు సన్మానం ఉంటుందని, సాహితీవేత్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

'చావు'రస్తాలు

- అత్యంత ప్రమాదకరంగా నగర శివారు కూడళ్లు
- అలుగునూరు, పద్మనగర్, ఎన్టీఆర్ జంక్షన్లలో లోపాలు
- ఫలితంగా బైపాస్, కమాన్‌రోడ్డులో ట్రాఫిక్ జాములు
- లోపాలపై అధ్యయనం ప్రారంభించిన నగరపోలీసులు
- మున్సిపల్, ఆర్అండ్‌బీ సమన్వయంతో పరిష్కారం

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని రోడ్డు ప్రమాదాలు, మృతులు, క్షతగాత్రుల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	481	183	482
2021	538	196	579
2022	533	183	619
2023	158	51	137

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ క్రైం: స్మార్ట్‌సిటీ కూడళ్లు వేగంగా కొత్తరూపు సంతరించుకుంటుంటే.. కొన్ని జంక్షన్లు మాత్రం ప్రమాదకరంగా మారుతున్నాయి. నగరంలో వాహనాల సంఖ్య, నగర పరిసరాల్లో ఉన్న పారిశ్రామిక అవసరాల కోసం తిరిగే గూడ్స్ వెహికిల్స్ సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో పద్మనగర్, ఎన్టీఆర్, అలుగునూరు కూడళ్లు ప్రమాదకరంగా మారాయి. వాస్తవానికి ఈ కూడళ్ల ఏర్పాటులోనే స్వల్ప లోపాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఆయా కూడళ్లలో నిత్యం ప్రమాదాలు, ట్రాఫిక్ జాములు జరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు. తాజాగా పద్మనగర్ కూడలిలో ఓ భారీ వాహనం కింద మహిళ నలిగిపోవడంతో ఇద్దరు పిల్లలు అనాథలైన వైనం పలువురిని కంటతడి పెట్టించింది.

ఎన్టీఆర్ చౌరస్తా..



ప్రమాదకరంగా ఎన్టీఆర్ చౌరస్తా

మానేరు నదీ వంతెన పూర్తిగా దిగకుండానే ఏర్పాటు చేసిన చౌరస్తా ఇది. ఇక్కడ ఎడమవైపు సిరిసిల్ల, కామారెడ్డి, నిజామాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర వైపుగా, కుడివైపు ఆదిలాబాద్, రామగుండం, మహారాష్ట్రను కలిపే రెండు బైపాస్‌లకు ఇది కూడలిగా ఉంది. ఈ కూడలి నిర్మాణంలో లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. సిరిసిల్ల బైపాస్ వెళ్లేవారు, వచ్చేవారికి ఉజ్వల పార్కు దిశగా ఒకే దారిలో రావాల్సి ఉంటుంది. ఫలితంగా నిత్యం వాహనాలు ఒకదానికి మరొకటి ఎదురుపడి ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. ఈ ప్రభావం రామగుండం బైపాస్ మీద పడుతోంది. ఫలితంగా మానేరు వంతెన మొదలుకుని, కమాన్‌రోడ్డు, బైపాస్‌రోడ్డు ఏకకాలంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఫలితంగా హైదరాబాద్ వెళ్లే వాహనాలు, ముఖ్యంగా అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి.

ప్రధాన కారణాలివే..

- కూడలి పరిమాణంలో చిన్నదిగా ఉంది. విస్తరించాలి.
- భారీ వాహనాలు తిరిగేందుకు అనుకూలంగా లేదు.
- నిత్యం ఇక్కడ ఉన్న ఫంక్షన్ హాళ్లకు కార్లు, పెళ్లి వాహనాలు రాంగ్‌రూటులో తిరుగుతుంటాయి.
- ఇక్కడ ఉన్న కొన్ని హోటళ్లకు వచ్చే కస్టమర్లు రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేస్తున్నారు.
- మానేరు వంతెన మీదుగా నిత్యం నడిచే ఇసుక ట్రాక్టర్లు, భారీ వాహనాల వల్ల కూడలిపై భారం పెరిగింది.



నిత్యం ప్రమాదాలు జరుగుతున్న పద్మనగర్ చౌరస్తా

పద్మనగర్ జంక్షన్..

ఇక్కడ రోడ్డు నిర్మాణంలోనే లోపాలు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. రోడ్డుపై వానాకాలం భారీగా నీరు నిలవడమే అందుకు నిదర్శనం. అక్కడే జంక్షన్ కూడా నిర్మించారు. దీనికితోడు నిత్యం ఎఫ్‌సీఐ, గ్రానైట్, భవన నిర్మాణ రంగ, ఇసుక లారీలు ఇదే మార్గంలో సంచరిస్తుంటాయి. పైగా ఇది బైపాస్ రోడ్డు కూడా కావడంతో సహజంగానే రద్దీ ఎక్కువ. ఇక్కడ జంక్షన్ ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఉన్న స్కూళ్లకు ఇతర వ్యాపార సముదాయాలకు వెళ్లాలంటే ఎడమవైపు తిరిగి యూటర్న్ తీసుకుని రావాలి. కానీ.. చాలామంది ఇక్కడ జంక్షన్ నుంచి రాంగ్‌రూట్‌లో వస్తుంటారు. దీనికితోడు భారీ వాహనాలు నడిపే డ్రైవర్లలో కొందరు తాగి ఉండటం, మితిమీరిన వేగంతో నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

అలుగునూరు జంక్షన్..!

నగరాన్ని హైదరాబాద్, వరంగల్ మీదుగా వచ్చే వాహనాలను ఉత్తర తెలంగాణతో అనుసంధానం చేసే అత్యంత కీలకమైన కూడలి ఇది. గతంలో ఈ చౌరస్తా బ్లాక్‌స్పాట్‌గా ఉండేది. రోడ్డు విస్తరణ తరువాత ఇక్కడ ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. అయినప్పటికీ.. ఇక్కడ నిత్యం అప్రమత్తంగానే ఉండాలి. ఈ కూడలిలో ట్రాఫిక్ జామ్ అయితే ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం ఈ జంక్షన్ ప్రధాన లోపం

భవిష్యత్తులో తీగల వంతెనకూ...

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన తీగల వంతెన జంక్షన్‌కు కూడా ట్రాఫిక్ చిక్కులు ఎదురవనున్నాయి. ఇక్కడ కూడా మానేరు వంతెన దిగీదిగగానే.. రామగుండం బైపాస్ రోడ్డు ఎదురవుతుంది. ఫలితంగా ఇక్కడ ట్రాఫిక్ జాములు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ రామగుండం రోడ్డు మీదుగా ఫ్లైఓవర్ నిర్మిస్తేనే ఇక్కడ ట్రాఫిక్ చిక్కులు తప్పుతాయని రిటైర్డ్ ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలేవి?

ఎన్టీఆర్ చౌరస్తా, పద్మనగర్, అలుగునూరు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ జామ్, వాహనాలు బోల్తాపడటం లేదా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతున్నాయి. ఇది పెద్ద ఎత్తున జరిగినప్పుడు వాహనాలు మళ్లించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. మరీ ముఖ్యంగా అలుగునూరు–ఎన్టీఆర్ జంక్షన్లకు ఒక పక్క మానేరు నది ఉండటంతో వాహనాలు మరో దిశలో కదిలేందుకు మార్గమే లేదు. తీగల వంతెన ప్రారంభమైతే.. సదాశివపల్లి మీదుగా వరంగల్ నుంచి వచ్చే వాహనాల భారం అలుగునూరు, ఎన్టీఆర్ జంక్షన్ల మీద తగ్గే అవకాశాలు ఉన్నాయి.

అధ్యయనం మొదలైంది

నగరంలో ఎన్టీఆర్, పద్మనగర్, అలుగునూరు కూడళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వాస్తవానికి ఈ కూడళ్ల నిర్మాణంలో స్వల్పలోపాలు ఉన్నాయి. వీటిని సవరించాలంటే కేవలం ఒక్క పోలీసు వల్ల కాదు. ఇందుకు ఆర్అండ్‌బీ, మున్సిపల్ సహకారం సైతం కావాలి. ఈ చౌరస్తాలలో లోపాలపై ఇప్పటికే అధ్యయనం చేశాం. నగరంలో ట్రాఫిక్‌జాములు లేకుండా వాహనాలు సాఫీగా సాగేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నాం. – విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ



బైపాస్ వరకు వచ్చిన తీగల వంతెన రోడ్డు

పాపపు దేవుడు పగబట్టిండు బిడ్డా

అప్పుడు నాన్నను తీసుకుపోయిండు.. ఇప్పుడు అమ్మను తీసుకుపోయిండు

ఆగమైపోతిరి కదా బిడ్డా

- రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు దుర్మరణం
- స్కూటీపై వెళ్తుండగా ఢీకొట్టిన రెడీమిక్స్ వెహికల్
- పైనుంచి లారీ వెళ్లడంతో నుజ్జునుజ్జయిన శరీరం
- ఏడేళ్లక్రితం గుండెపోటుతో భర్త మృతి
- తల్లి మృతితో అనాథలైన ఇద్దరు పిల్లలు



ప్రమాదానికి గురైన స్కూటీ

పిల్లలకు ఊహ తెలియని వయసులో తండ్రి గుండెపోటుతో దూరమయ్యాడు. అప్పటి నుంచి ఆ తల్లే అన్నీ తానై చూసుకుంటోంది. ఇద్దరు పిల్లలకు కన్నప్రేమ పంచుతూనే కుటుంబ బాధ్యతను మోస్తోంది. పిల్లలే ప్రాణంగా బతుకుతూ.. టీచింగ్ చేస్తోంది. రోజు మాదిరిగానే పిల్లలను పాఠశాలకు సిద్ధం చేసి విధులకు బయల్దేరిన ఆమెను మృత్యువు కబళించింది. రెడీమిక్స్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించింది. తలకు హెల్మెట్ పెట్టుకున్నా.. శరీరం పైనుంచి వాహనం వెళ్లడంతో బాడీ ముక్కలుముక్కలైంది. చెల్లా చెదురుగా పడిఉన్న శరీరభాగాలను ఒక్కచోటుకి చేర్చి ఆస్పత్రికి తరలించిన దృశ్యం ఘటనాస్థలంలో పలువురిని కంటతడి పెట్టించింది. ఈ ప్రమాదం శుక్రవారం ఉదయం ఏడుగంటల ప్రాంతంలో కరీంనగర్‌లోని పద్మనగర్ బైపాస్ రోడ్డు చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. – కరీంనగర్‌క్రైం

క్షణాల్లోనే..



ప్రమాదస్థలం వద్ద రజిత మృతదేహం

కరీంనగర్‌లోని అలకాపురిలో నివాసం ఉంటున్న బైరెడ్డి రజిత (41) ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. 2014లో మోడల్‌స్కూల్‌లో మ్యాథ్స్ పీజీటీగా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఇల్లంతకుంట (రహీంఖాన్ పేట్) మోడల్ స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు స్కూల్‌కు సహోద్యోగులు, ఆ ప్రాంతంలో పనిచేసే మరికొందరు టీచర్లతో కలిసి ఆటోలో కరీంనగర్ నుంచి ఇల్లంతకుంటకు వెళ్తుండేవారు. అలకాపురి నుంచి స్కూటీపై వచ్చి పద్మనగర్ చౌరస్తాలోని ఓ పాఠశాల వద్ద పార్కింగ్ చేసి ఆటోలో సహోద్యోగులతో వెళ్తుంటారు. గురువారం ఉదయం 6.45 తరువాత ఇంట్లో పిల్లలను పాఠశాలకు సిద్ధం చేసి తన స్కూటీపై బయల్దేరారు. పద్మనగర్ బైపాస్ చౌరస్తా వద్దకు చేరుకొని, పక్కనే ఉన్న ప్రయివేటు పాఠశాలలో వాహనాన్ని పార్క్ చేసేందుకు యూటర్న్ తీసుకునే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో సిరిసిల్ల వైపు నుంచి మానేరుడ్యాం వైపు రోడ్డు క్రాస్ చేస్తున్న రెడీమిక్స్ లారీ (టీఎస్02 యూబీ 7183) అతివేగంగా స్కూటీని ఢీకొట్టింది. దీంతో రజిత కిందపడగా ఆమె శరీరం పైనుంచి లారీ వెళ్లింది. శరీరం నుజ్జునుజ్జయి.. అక్కడికక్కడే చనిపోయారు.

నాడు తండ్రి.. నేడు తల్లి..

రజితకు శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన బైరెడ్డి తిరుపతిరెడ్డితో వివాహం కాగా ఇద్దరు కొడుకులు ప్రజ్ఞాత్‌రెడ్డి(14), రిశిఖ్‌రెడ్డి(10) ఉన్నారు. తిరుపతిరెడ్డి కరీంనగర్ కోర్టులో న్యాయవాదిగా పనిచేసేవారు. ఆరేళ్ల క్రితం గుండెపోటుతో మరణించారు. అప్పటి నుంచి రజిత కరీంనగర్‌లోని అలకాపురిలో తన తల్లిగారింట్లో పిల్లలతో ఉంటున్నారు. పిల్లలను ప్రయివేటు పాఠశాలలో చదివిస్తున్నారు. పెద్ద కొడుకు పదో తరగతి, చిన్న కొడుకు ఆరో తరగతి చదువుతున్నారు. తండ్రి లేకపోయినా తన కొడుకులను ప్రేమగా చూసుకుంటున్న తల్లిని రోడ్డు ప్రమాదంలో రూపంలో విధి బలితీసుకోవడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

మమ్మి బాయ్ చెప్పి వెళ్లింది.. మనం ఎటు పోతున్నం

'మమ్మి.. మాకు బాయ్ చెప్పి వెళ్లింది. మళ్లీ ఎటు వెళ్తున్నామని' మనవళ్లు అడిగిన ప్రశ్నకు రజిత తల్లిదండ్రులు సమాధానం చెప్పలేకపోయారు. సరిగ్గా ఏడు గంటలకు ప్రమాదం జరగడంతో పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటివరకు పాఠశాలకు వెళ్లిందనుకున్న తమ కూతురు మరణించిందన్న వార్త తెలియడంతో గుండెలవిసేలా రోదించారు. రజిత మరణవార్త వినగానే బంధువులు, టీచర్లు వందలసంఖ్యలో జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. చివరిచూపునకు కూడా నోచుకోని మృతదేహం వద్ద గుండెలవిసేలా విలపించారు. రజిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అలకాపురిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు తండ్రి బండ నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కరీంనగర్ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యారంగానికి ప్రాధాన్యం



మొగ్దుంపూర్‌లో కళాశాల ప్రహరీ పనులను ప్రారంభిస్తున్న మంత్రి కమలాకర్

- మొగ్దుంపూర్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి మంత్రి భూమిపూజ

కరీంనగర్‌రూరల్: తెలంగాణలో విద్యారంగానికి మొదటి ప్రాధాన్యమిచ్చిన సీఎం కేసీఆర్ పెద్దసంఖ్యలో గురుకుల పాఠశాలలు, డిగ్రీ, వైద్య కళాశాలలను ప్రారంభించారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో మహాత్మా జ్యోతి బాపూలే బీసీ మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో వనపర్తి, కరీంనగర్‌లో రెండు వ్యవసాయ కళాశాలలను ప్రారంభించినట్లు చెప్పారు. వ్యవసాయ కళాశాలకు మొత్తం 70 ఎకరాలు కావాల్సి ఉండగా.. ప్రస్తుతం 43 ఎకరాలుందని, మిగితా 30 ఎకరాలను కేటాయిస్తామన్నారు. ప్రస్తుతం రూ.1.30 కోట్లతో ప్రహరీ నిర్మాణం, భూమి చదును చేసే పనులను చేపడుతామని తెలిపారు. కళాశాల నిర్మాణానికి సీఎం కేసీఆర్‌ను అడిగి రూ.30 కోట్లను మంజూరు చేయిస్తానన్నారు. ప్రస్తుతం ఎల్ఎండీలో 120 మందితో తరగతులు నడుస్తున్నాయని.. వచ్చే ఏడాది నుంచి ఇక్కడే తరగతులు నిర్వహిస్తామన్నారు. కరీంనగర్ నుంచి మొగ్దుంపూర్, నగునూరు, కొత్తపల్లి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ కె.నారాయణ, ఎంపీపీ టి.లక్ష్మయ్య, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తీగల వంతెన పనులు వేగవంతం చేయాలి

కరీంనగర్: కేబుల్ బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. శుక్రవారం తీగల వంతెన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణం, డైనమిక్ లైటింగ్ ఏర్పాటు పనులు చివరి దశకు చేరుకున్నాయని.. త్వరలోనే ట్రయల్ రన్ నిర్వహిస్తామని అధికారులు మంత్రికి వివరించారు. అధికారులు చెప్పిన దానిపై సంతృప్తిని వ్యక్తం చేసిన మంత్రి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

నగర అభివృద్ధే ధ్యేయం

- మేయర్ యాదగిరి సునీల్‌రావు
- ప్రశాంతంగా ముగిసిన సర్వసభ్య సమావేశం
- 14 ఎజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు



సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ కచ్చు రవి

కరీంనగర్‌సిటీ: నగర అభివృద్ధే ధ్యేయంగా పాలకవర్గం పని చేస్తుందని మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నగరపాలక సాధారణ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. మేయర్ సభాధ్యక్షతన కమిషనర్ సేవా ఇస్లావత్ సమక్షంలో 14 అభివృద్ధి ఎజెండా అంశాలకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ప్రశ్నోత్తర సమయంలో పాలకవర్గ సభ్యులు డివిజన్‌ల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభా దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సహకారంతో కరీంనగర్ నగరం దినదినం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ, నగరపాలక సంస్థ వివిధ గ్రాంట్లకు చెందిన వెయ్యి కోట్ల నిధులతో అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రధానంగా తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి రెండున్నరేళ్లుగా రోజు నీటి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల చివరిలోగా పైపులైన్ పనులు పూర్తి చేసి విలీన గ్రామాలైన తీగలగుట్టపల్లి, సదాశివపల్లి, అలుగునూరు, వల్లంపహాడుకు నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు. నగరంలో కుక్కలు, పందులు, కోతులు స్వైర విహారం చేస్తున్న వాటిని తరలించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

38వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కచ్చు రవి సర్వసభ్య సమావేశంలో మేయర్, మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. పీటీసీ నుంచి మురికినీరు శ్రీహరినగర్ ప్రాంతం మీదుగా పోవడంతో వర్షాకాలంలో శ్రీహరినగర్‌లోని ఇళ్లు నీట మునిగిపోతున్నాయని, సమస్యను పరిష్కరించాలన్నారు. బీరప్ప పట్నాల వేడుకలకు మున్సిపల్ నుంచి తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

లంచాలు తీసుకుంటున్నారు

మున్సిపల్ కార్యాలయంలో ప్రతి పనికి ఇంత వసూలు చేస్తున్నారని 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జీత్‌కౌర్ ఆరోపించారు. ముఖ్యంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. పలువురి నుంచి ఇంత వసూలు చేశారరంటూ వారి పేర్లతో వివరాలను సభలో వివరించారు.

పనులు పూర్తి చేయాలి

55వ డివిజన్ దస్గర్‌వాడీ పాఠశాల వద్ద 5 ఫీట్ల డ్రైనేజీకి పైనుంచి వస్తున్న 13 ఫీట్ల డ్రైనేజీని లింక్ చేశారని దీంతో భవిష్యత్‌లో నీటి ప్రవాహం పెరిగి పలు కాలనీలు మునిగే అవకాశం ఉంటుందని 55 డివిజన్ కార్పొరేటర్ జితేందర్ సభ దృష్టికి తీసుకెళ్లారు. డివిజన్‌లో పెండింగ్ స్మార్ట్‌సిటీ పనులు పూర్తి చేయాలని కోరారు.

2న అండర్ -17 జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాస్థాయి అండర్ 17 బాలబాలికల చదరంగ ఎంపిక పోటీలను ఈనెల 2న కరీంనగర్ భగవతి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ చెస్ సంఘం సభ్యులు బి.రమణారావు, చెరుకు ప్రద్యుమ్నకుమార్, అంతగిరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే వారు 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. క్రీడాకారులు మున్సిపాలిటీ, పంచాయతీ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రాలతో పాటు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన నలుగురు క్రీడాకారులను హైదరాబాద్‌లో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమవెంట చెస్‌సెట్, చెస్ క్లాక్‌లు వెంట తెచ్చుకోవాలని వివరాలకు 9390177607, 9849657755 నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

సంపులో పడి యువకుడు మృతి



శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలో శుక్రవారం నీటి సంపులో పడి ఇజ్జిగిరి సతీశ్(33) యువకుడు మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సతీష్ పోలియో బాధితుడు కావడంతో శుక్రవారం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఇంట్లో సతీశ్ కనిపించకపోవడంతో సంపులో చూడగా శవమై కనిపించాడు. ఇంటి ముందున్న నీటిసంపులో పడి మృతిచెందినట్లు మృతుడి తండ్రి ఐలయ్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

నదిలో దూకేందుకు యత్నించిన మహిళ

- కాపాడిన రివర్ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు యత్నించిన ఓ మహిళను(29) శుక్రవారం రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్ రివర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన ఓ వివాహిత కొంతకాలంగా కుటుంబ కలహాలతో బాధపడుతోంది. మనస్థాపనికి గురై శుక్రవారం మధ్యాహ్నం గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లి నదిలో దూకుతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ కానిస్టేబుల్ సదానందం గమనించి సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి వన్ టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. సమస్యల్లోంచి బయటపడడానికి ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ఆత్మహత్య చేసుకోవడం నేరమని టూటౌన్ సీఐ వేణుగోపాల్ మందలించారు.

మృతదేహం లభ్యం

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరినదిలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి నదిలో జాలర్లు చేపలుపడుతున్న క్రమంలో చేపలవలకు మృతదేహం చిక్కడంతో బయటకు తీశారు. మృతుడి జేబులోని ఆధార్‌కార్డు ప్రకారం శ్రీరాంపూర్‌కు చెందిన శ్రావణపూడి చిట్టి బాబుగా (50) టూటౌన్ పోలీసులు గుర్తించారు. మృతుడి పూర్తి వివరాలకు శ్రీరాంపూర్ పోలీసులకు సమాచారం అందించినట్లు టూటౌన్ ఎస్సై శ్యామ్‌పటేల్ తెలిపారు. మృతదేహన్ని గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోను ఢీకొన్న వ్యాన్..

- ఆటో డ్రైవర్ మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- రాజన్న దర్శనానికి వెళ్లొస్తుండగా ఘటన



రాజయ్య (ఫైల్)

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లి గ్రామం సాయిబాబా ఆలయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన ఒర్సు రాజయ్య (43) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య భార్య రాజేశ్వరి, తల్లి రాజవ్వ, కూతురు అక్షరతో కలిసి గురువారం వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లారు. శుక్రవారం తిరుగు ప్రయాణంలో బోయినపల్లి మండలం స్తంభంపల్లి సాయిబాబా ఆలయ సమీపం వద్దకు చేరుకోగానే వెనుకనుంచి అతివేగంగా వచ్చిన వ్యాన్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజయ్య మృతిచెందగా, తల్లి రాజవ్వ, కూతురుకు గాయాలయ్యాయి. అతివేగంగా, అజాగ్రత్తగా వ్యాన్ నడిపిన జగిత్యాలకు చెందిన డ్రైవర్ మహేశ్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మురళి తెలిపారు.



మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు తీసుకుంటున్న తిమ్మాపూర్ సర్పంచ్ దుండ్ర నీలమ్మ



పర్లపల్లి సర్పంచ్ మాడాడి భారతి, పంచాయతీ కార్యదర్శి



వెలిచాల సర్పంచ్ వీర్ల సరోజన, పంచాయతీ కార్యదర్శి

మూడు జీపీలకు ఉత్తమ అవార్డులు

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని తిమ్మాపూర్, పర్లపెల్లి, రామడుగు మండలం వెలిచాల గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులను శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా తిమ్మాపూర్ సర్పంచ్ దుండ్ర నీలమ్మ, పంచాయతీ కార్యదర్శి కోరుకంటి మహేందర్ రావు, పర్లపెల్లి సర్పంచ్ మాదాడి భారతి, కార్యదర్శి పద్మావతి, వెలిచాల సర్పంచ్ వీర్ల సరోజన, కార్యదర్శి బందారి అరుణ్ కుమార్‌కు ప్రదానం చేశారు. వీరితో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జడ్పీ సీఈవో ప్రియాంక, డీపీవో వీరబుచ్చయ్య, డీఆర్‌డీవో శ్రీలత ఉన్నారు. – కరీంనగర్

మాయమాటలతో చోరీలు..

- వృద్ధమహిళలే టార్గెట్
- ఇద్దరు దొంగలు అరెస్ట్.. ఒకరు పరారీ.. బంగారం స్వాధీనం
- జమ్మికుంటలో వివరాలు వెల్లడించిన ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి



దొంగల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

జమ్మికుంట: మాయమాటలతో వృద్ధమహిళలను ఎంచుకొని, సీనిఫక్కీలో చోరీలకు పాల్పడిన ఇద్దరు యువకులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించగా, మరొకరు పరారీలో ఉన్నట్లు హుజూరాబాద్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో సీఐ రామచందర్‌రావు ఆధ్వర్యంలో వివరాలు వెల్లడించారు. జయశంకర్ భూపాలపెల్లి జిల్లా, మండలం గుడాటిపల్లికి చెందిన చిలువేరు రాజు, రేగొండ మండలం పోచంపల్లికి చెందిన రేణుకుంట్ల ప్రభాకర్, గోపాల్‌పూర్‌కు చెందిన శాంతకుమార్ ముగ్గురు బంధువులు కాగా పేయింటర్లుగా పనిచేస్తూ జీవిస్తున్నారు. కూలీ పనిలో వచ్చే డబ్బులు ఖర్చులకు సరిపోక చోరీలకు పాల్పడాలని నిర్ణయించుకున్నారు. మాయమాటలతో వృద్ధమహిళలను టార్గెట్ చేసుకుని చోరీ చేయాలనుకున్నారు. దీంతో జమ్మికుంట పట్టణంలో మంగళవారం అంగడి (వారసంత) జరిగే సమయంలో ఇల్లందకుంట మండలం రాచపల్లికి చెందిన రాజమ్మ కూతురు ఇంటికివెళ్లి తిరిగి వస్తుండగా జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ దగ్గర రాచపల్లికి వెళ్లే ఆటో స్టాండ్ వద్ద నిలబడగా వృద్ధురాలిని పరిచయం చేసుకున్నారు. మీ మనువడు మాకు తెలుసని మాయమాటలు చెప్పారు. నేను నాభార్య ఫోటో దిగాలని, మెడలోని గోలుసు ఇస్తే మళ్లీ ఇస్తానని చెప్పి బంగారం దోచుకెళ్లారు. కొంత సమయం తర్వాత వారు తిరిగి రాకపోయే సరికి బంగారు గోలుసు దొంగిలించారని తెలుసుకుని బంధువుల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే క్రమంలో జమ్మికుంట మండలంలోని మడిపల్లికి చెందిన లోకిని రామక్క అనే వృద్ధురాలు మెడలోని గోలుసు సైతం ఇదేవిధంగా దొంగిలించారు. రెండుచోరీలు మంగళవారం (వారసంత)నాడు జరగడంతో సీసీపుటేజీలను పరిశీలించారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో శుక్రవారం ఎస్సై యూనిస్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో తనిఖీ చేస్తున్నక్రమంలో ముగ్గురు అనుమానస్పదంగా కనిపించి పోలీసులను చూసి పారిపోతుండగా రాజు, ప్రభాకర్‌లను పట్టుకున్నరు. శాంత కుమార్ అనేవ్యక్తి పారిపోయాడు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారింగచగా జమ్మికుంటలో రెండు చోరీలతో పాటు భూపాలపెల్లి జిల్లా పర్కాలలో మరో మూడుచోరీలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఐదు చోరీల్లో నాలుగు చోరీలకు సంబంధించిన బంగారం (గొట్టాల గోలుసు)లను రికవరి చేయాగా, ఒకటి ×మణప్పురం గోల్డ్‌₹లో కుదవపెట్టి రుణం తీసుకున్నట్లు తెలిపారు. రికవరి బంగారం విలువ రూ.2.43 లక్షలు ఉంటుందని వివరాలు వెల్లడించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని మరో వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు. చోరీ కేసులను చేధించిన పట్టణ సీఐ రామచందర్‌రావు, ఎస్సై యూనిస్ అహ్మద్ అలీ, హెడ్‌కానిస్టేబుళ్లు రాజేశ్వర్‌రావు, మోహన్, రమేశ్, కానిస్టేబుల్ సురేందర్, హోమ్‌గార్డులు మహేశ్, అశోక్, సురేశ్, రాజయ్యను ఏసీపీ అభినందించారు.



హాజరైన భక్తులు



స్వామివారికి పట్టాభిషేకం చేస్తున్న అర్చకులు



స్వర్ణపుష్పాన్ని చూపిస్తున్న అర్చకుడు

వైభవంగా రామయ్యకు పట్టాభిషేకం

ఇల్లందకుంట: అపరభద్రాద్రి ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామయ్య పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు పుష్పాలంకరణ చేసి సామూహిక పారాయణం, హోమం నిర్వహించారు. దాతలు బహూకరించిన సువర్ణ పుష్పాలచే స్వామివారికి స్వర్ణపుష్పార్చన చేశారు. అంతకుముందు పట్టాభిషేక మహోత్సవం గురించి అర్చకులు చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో వెంకన్న, భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్



ర్యాలీలో పాల్గొన్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్, కార్యకర్తలు

గోదావరిఖని: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ మోసపూరిత హామీలు, వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. శుక్రవారం స్థానిక శారదానగర్‌లో పాదయాత్ర నిర్వహించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతు రుణమాఫీ, నిరోద్యోగ భృతి, ఇలా ఎన్నోహామీలు ఇచ్చి మోసం చేశారన్నారు.

బ్రిటీష్ పాలనను మరిపిస్తోన్న బీజేపీ...

బ్రిటీష్ పాలనను మరిపించే తీరులో మోడీ పాలన కొనసాగుతోందని, ప్రశ్నించే గొంతును అణిచివేయాలని బీజేపీ చూస్తోందని రాజ్‌ఠాగూర్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాహుల్‌గాంధీని రాజకీయంగా అణగదొక్కేందుకే పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారన్నారు. బీజేపీ చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ప్రశ్నించే అవకాశం లేకుండా దొడ్డిదారిన ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను అందరూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఇఫ్తార్ విందు...

రామగుండం: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ మజీద్‌లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఉపవాస దీక్షలు మతాల మధ్య బంధుత్వాన్ని పెంచుతాయని, స్నేహానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముస్లిం మతపెద్దలు మక్కాన్‌సింగ్‌ను రాబోయే రోజుల్లో రాజకీయంగా ఎదగాలని ఆశీర్వదించారు.

ఇద్దరిపై హత్యాయత్నం కేసు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేందర్

సిరిసిల్ల క్రైం : హత్యాయత్నంపై ఇద్దరిపై ఇల్లంతకుంట పోలీసులు కేసు నమోదు చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 27న ఇల్లంతకుంట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో విర్ల సాయి రామ్ అనే అతనిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. దీనిపై సాయి రామ్ ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమానితులుగా ఫిర్యాదులో పేర్కొన్న కుంటల శేఖర్, కొదాడ రఘుపై కేసు నమోదు చేసి ఎస్సై రాజేశ్ దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఇల్లంతకుంట శివారులో శేఖర్, కోదాడ రఘును అదుపులోకి తీసుకొని విచారించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తిగా పరిచయం చేసుకొని అసభ్యకర పదజాలంతో దూషించగా సాయిరామ్‌పై దాడి చేసినట్లు తెలిపారు. వారి నుంచి కత్తి, బైక్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని సీఐ ఉపేందర్ ప్రజలను కోరారు.

టీఎన్‌జీవో భవన నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్


- తొలివిడతగా రూ.10లక్షల నిధులు విడుదల



మంత్రికి వినతిపత్రమిస్తున్న టీఎన్జీవో నేతలు

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల ఏళ్లనాటి కల త్వరలోనే సాకారం కానుంది. తెలంగాణ ట్రెజరీ నాన్‌గెజిటెడ్ అసోసియేషన్ భవన నిర్మాణానికి గత కొన్నేళ్లుగా వినతిపత్రాలు సమర్పిస్తున్నప్పటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు వినతిపత్రం ఇవ్వడమే తడవుగా నిధులు మంజూరు చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, దారం శ్రీనివాస్‌రెడ్డి, డీడీ ఉప్పు నాగరాజు, ట్రెజరీ నేతలతో కలిసి వినతిపత్రం అందించారు. నగరంలోని ముకరంపురలో 2 గుంటల స్థలంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈక్రమంలో అప్పటికప్పుడే రూ.10లక్షలు తొలివిడతగా నిధులు మంజూరు చేయడంతో ఉద్యోగ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలకు చేయూతలో మంత్రి బాసటగా నిలుస్తున్నారని కొనియాడారు. నాలుగోతరగతి ఉద్యోగుల సంఘానికి రూ.25 లక్షలు, టీఎన్జీవో సంఘానికి రూ.10 లక్షలు, డ్రైవర్స్ అసోసియేషన్ రూ.10 లక్షలు, ట్రెజరీ సంఘానికి రూ.10 లక్షలు నిధులు మంజూరుచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు రసూల్, ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, మెరుగు కొండయ్య, ఐరెడ్డి సందీప్‌రెడ్డి, శ్రీధర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోట రామస్వామి నర్సింహారెడ్డి, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, పట్టణ నేతలు సర్దార్ హర్మీందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు.

2న 'గవాయి'కి సినారె సాహితీ పురస్కారం



గవాయి పుస్తకం



దేవేందర్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రఖ్యాత కవి రచయిత, ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ 'గవాయి' కవితా సంపుటికి సినారె సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు సాహితీ గౌతమి ప్రధానకార్యదర్శి నంది శ్రీనివాస్ తెలిపారు. ఏప్రిల్ 2 ఆదివారం సాయంత్రం కరీంనగర్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో పురస్కారోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'గవాయి' కవితా సంకలనం 2021 సంవత్సరానికి 32వ పురస్కారం అన్నారు. కరీంనగర్ జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య 'సాహితీ గౌతమి' నిర్వహిస్తున్న ఈ సభకు పురస్కార కమిటీ అధ్యక్షుడు ప్రముఖ పిల్లల వైద్యుడు డాక్టర్ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నారని ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. దేవేందర్ ఇప్పటివరకు 12 కవితా సంపుటాలు, రెండు వ్యాస సంకలనాలు మరో రెండు ఇంగ్లిష్ అనువాద కవిత్వ సంకనాలు వెలువరించారు. వీరికి గతంలో తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారంతో పాటు మరెన్నో పురస్కారాలు అందుకున్నారు.

కరీంనగర్ బార్ అసోసియేషన్ కార్యవర్గం

- అధ్యక్షుడిగా బి.రఘునందన్‌రావు, ప్రధానకార్యదర్శిగా ఎల్.నాగరాజు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ 2023–24కు ఎన్నికలు శుక్రవారం నిర్వహించగా సాయంత్రం ఫలితాలను ఎన్నికల అధికారి ఎం.రామకృష్ణ చారి ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.రఘునందన్ రావు, ఉపాధ్యక్షుడిగా వాల మహేందర్‌రావు, ప్రధానకార్యదర్శిగా లింగంపల్లి నాగరాజు ఎన్నికయ్యారు. కోశాధికారిగా కొట్టె తిరుపతి, లైబ్రేరీ కార్యదర్శిగా ఎం.సంపత్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శిగా ఓంకార్ ఎన్నికయ్యారు. సీనియర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా పెంచల శ్రీనివాసరావు, జగదీశ్వర చారి, మధు, జూనియర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా అంజనేయులు, హరికృష్ణ , బొజ్జ స్వామి ఎన్నికయ్యారు. కార్యదర్శి పదవికి సిరికొండ శ్రీధర్‌రావు, మహిళా ప్రతినిధిగా హేమలతలు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఎన్నికల్లో 929 మంది ఓటు హక్కు కలిగి ఉండగా 834 ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాష్ట్ర సివిల్‌సప్లై చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, సుడా చైర్మన్ జీవీ.రామ కృష్ణారావు, గ్రంథాలయ చైర్మన్ అనిల్‌గౌడ్ సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

120 శాతం బొగ్గు ఉత్పత్తి

- నంబర్‌వన్‌గా నిలిచిన ఆర్జీ–1 ఏరియా
- జీఎం కె.నారాయణ వెల్లడి



మాట్లాడుతున్న జీఎం

గోదావరిఖని: 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ–1 ఏరియా 120శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కె.నారాయణ వెల్లడించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యసాధనలో జీడీకే–5 ఓసీపీ అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 39.05లక్షల టన్నుల లక్ష్యానికిగాను 47 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి సింగరేణిలోనే నెంబర్‌వన్‌గా ఆర్జీ–1 ఏరియా నిలిచిందన్నారు. ఏరియాలోని జీడీకే–11గని కంటిన్యూస్ మైనర్ యంత్రాలతో భారీగా ఉత్పత్తి సాధించామన్నారు. ఒక్క మార్చి నెలలో 175 శాతం ఉత్పత్తి సాధించి రికార్డు నెలకొల్పామన్నారు. ఇందుకు సహకరించిన ప్రతీఒక్కరికి అభినందనలు తెలిపారు. తాను జీఎంగా పనిచేసిన మూడేళ్లలో సహకరించిన ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి సంస్థ పురోగాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీ–1 జీఎంగా చింతల శ్రీనివాస్



శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కె.నారాయణ

గోదావరిఖని: ఆర్జీ–1 జీఎంగా చింతల శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నూతన జీఎంకు ప్రస్తుతం పనిచేస్తున్న జీఎం కె.నారాయణ పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం శ్రీనివాస్ జీఎంగా బాధ్యతలు చేపట్టారు. మందమర్రి జీఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను ఆర్జీ–1కు బదిలీచేశారు. ప్రస్తుతం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న మోహన్‌రెడ్డి మందమర్రి జీఎంగా పదోన్నతిపై బదిలీచేశారు.

బీఎంఎస్‌లో చేరిన కాంట్రాక్టు కార్మికులు



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం బీఎంఎస్‌లో చేరారు. వీరికి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సంరక్షణకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిణ్, తాట్ల లక్ష్మయ్య, రాపోలు వజ్రవేణు, జనగామ రాయలింగు, గుండెబోయిన భూమయ్య, బానోతు రంజిత్‌కుమార్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిల్లెట్స్ ఫుడ్‌పై అవగాహన



విద్యార్థినితో మాట్లాడుతున్న మేయర్

కరీంనగర్: పట్టణంలోని కోతిరాంపూర్‌లో గల మణిదీప్ పాఠశాలలో పోషణ పక్షంలో భాగంగా మిల్లెట్స్ ఫుడ్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలు ప్రదర్శించారు. పిల్లలకు మిల్లెట్స్ ఫుడ్‌పై వ్యాసరచన పోటీలు జరిపారు. మేయర్ వై. సునీల్‌రావు హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పిల్లలకు వైద్యసిబ్బంది రక్తహీనత పరీక్షలు చేసి, ఆరోగ్యం మెరుగ్గా ఉన్న వారికి బహుమతులు అందించారు. కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, డీడబ్ల్యూవో సబిత, సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ విజయ, స్కూల్ చైర్మన్ సత్తయ్య, ప్రిన్సిపాల్ సతీశ్, 20 మంది అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టీ ఇఫ్తార్ విందు

కరీంనగర్ కల్చరల్: జమాత్ ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో పీకాక్ హోటల్లో శుక్రవారం నిర్వహించిన టీ ఇఫ్తార్ విందుకు మేయర్ సునీల్ రావు హాజరయ్యారు. ఇస్లామిక్ హింద్ బాధ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థుల పూజలు



సామగ్రి అందించిన తహసీల్దార్ రజిత

సప్తగిరికాలనీ: స్థానిక జాన్సన్ గ్లోబల్ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు శుక్రవారం చైతన్యపురిలోని శ్రీ మహాశక్తి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు బాగా రాయాలని, మంచి జీపీఏ గ్రేడ్ సాధించాలని పూజారులు ఆశీర్వదించారు. అనంతరం చొప్పదండి తహసీల్దార్ అంబటి రజిత విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేసి, పరీక్షలు బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో వుట్కూరి మహిపాల్ రెడ్డి, వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని వావిలాపల్లి శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కల్యాణ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీపుష్ప యాగం జరిపారు. ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల రథోత్సవం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీలక్ష్మీనారాయణ, శ్రీసూక్త సంపుటికరణ హవనం, సీతారాముల రథోత్సవం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు కె.గౌతంరావు, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులున్నారు.

బిషప్ రూబెన్ మార్క్‌కు సన్మానం



రూబెన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రోహిత్‌రావు

కరీంనగర్: పట్టణంలోని సీఎస్ఐ బిషప్ రెవె. రూబెన్ మార్క్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బొబ్బిలి విక్టర్, పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు మేనేని రోహిత్ రావులు శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, నాయకులు బొందల సత్యం, దినకర్, కోటి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా



కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తల్లులు, గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ సీడీపీవో బి.ఉమారాణి సూచించారు. అనంతరం చిన్నారులు, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలు రూ.28 కోట్లు

- 2022–23కు సంబంధించి లక్ష్యం రూ.38.61 కోట్లు
- మార్చి 31తో ముగిసిన గడువు
- ఓటీఎస్‌పై అధికారులు ప్రచారం చేయలేదని ఆరోపణలు



కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం

కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లలో అధికారులు ఎట్టకేలకు లక్ష్యానికి చేరువగా వచ్చారు. వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్) అవకాశం కల్పించినప్పటికీ ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. నిన్నటితో ఆస్తి పన్ను గడువు ముగిసిపోయింది. కానీ పన్నులు చెల్లించడానికి అందరూ ఆసక్తి చూపకపోవడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదని తెలుస్తోంది. గతంలో ఓటీఎస్‌లో భాగంగా జరిమానాలో 90 శాతం మాఫీ చేసి, కేవలం 10 శాతంతో చెల్లించుకునే అవకాశం గతేడాది జూలై 17 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు కల్పించారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు పెద్దగా ప్రచారం చేయకపోవడంతో ప్రజల నుంచి స్పందన కరువైందన్న ఆరోపణలున్నాయి. ముందస్తు చెల్లింపులు చేసేవారికి 5 శాతం మాఫీని కూడా కార్పొరేషన్ అమలు చేసింది.

ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో నిర్లక్ష్యం..

ఇప్పటివరకు 90 శాతం రాయితీని వినియోగించుకున్న వినియోగదారులు రూ.58.08 లక్షలని అధికారులు తెలిపారు. 5 శాతం మినహాయింపుతో 19,418 ఇళ్ల నుంచి రూ.9.43 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయడంలో నిర్లక్ష్యం కారణంగా కార్పొరేషన్ భారీగా ఆదాయం కోల్పోతోంది. విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం నగరంలో 26 వేలకు పైగా కనెక్షన్లు ఉండగా ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్న దుకాణాలు మాత్రం కార్పొరేషన్ లెక్కల ప్రకారం కేవలం 7,800 ఉన్నాయి. కొందరు అధికారులు నిర్లక్ష్యం వల్లే ఆదాయం రావడం లేదని ప్రజలు అంటున్నారు. 2020–21లో రూ.34 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కోటి రూపాయలు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 2022 నవంబర్ నాటికి రూ.18.37 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. నల్లా బిల్లులు వసూలు చేయడంలోనూ నిర్లక్ష్యమే కనిపిస్తోంది. 2021–22లో రూ.6.20 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.2.16 కోట్లు వసూలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆస్తులు 532 ఉండగా రూ.21.64 కోట్లకు గాను రూ.35.21 లక్షలే చెల్లించారు. కేంద్ర ప్రభుత్వ ఆస్తులు 9 ఉండగా రూ.2.19 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.6 లక్షలే చెల్లించారు.

సుమారు రూ.4 కోట్లు అదనం

రెవెన్యూ విభాగం నిర్లక్ష్యంగా ఉండటంతో ఆస్తి పన్నులు సకాలంలో వసూలు కాలేదని పలువురు అంటున్నారు. పనులు చెల్లించడానికి ఇంటి యాజమానులు వచ్చిన సమయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో తిరిగి వెళ్లిపోయారన్న విమర్శలున్నాయి. గత వారం రోజులుగా రెవెన్యూ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ బిల్లులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఇళ్ల యాజమానులతో వాగ్వాదానికి దిగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారని చెబుతున్నారు. 2022–23 ఏడాదికి గాను 79,326 ఇళ్లకు సంబంధించి రూ.38.61 కోట్ల పన్నుల వసూలు లక్ష్యంగా కాగా నిన్నటి వరకు రూ.28.50 కోట్లు(85 శాతం) వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే సుమారు రూ.4 కోట్లు అదనంగా వసూలు చేశామని అదనపు కమిషనర్ స్వరూపారాణి పేర్కొన్నారు.

పన్నులు చెల్లించాలి

నగరవాసులు సకాలంలో పన్నులు చెల్లించాలి. నగర వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నాం. గతంలో ఓటీఎస్ అవకాశం కల్పించాం. మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించి, పన్నులు వసూలు చేస్తాం. – సునీల్‌రావు, మేయర్

ఆడపిల్లలను కాపాడుకోవడం బాధ్యత

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- లబ్ధిదారులకు రూ.5 వేల డిపాజిట్ పత్రాలు అందజేత

కరీంనగర్‌రూరల్: ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో సర్పంచు జక్కం నర్సయ్య ఆడపిల్ల పుడితే సర్పంచు కానుకగా అందిస్తున్న రూ.5 వేల పోస్టాఫీసు డిపాజిట్ పత్రాలను ఆరుగురు లబ్ధిదారులకు మంత్రి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆడపిల్లల సంక్షేమానికి ప్రభుత్వం కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మితోపాటు కొత్తగా న్యూట్రిషన్ కిట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ టి.లక్ష్మయ్య, ఉపసర్పంచు కె.తిరుపతి, ఎంపీటీసీ సభ్యురాలు డి.పుష్ప, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

మంత్రి గంగులను కలిసిన ప్రజాప్రతినిధులు

కొత్తపల్లి: పద్మనగర్–ఒడ్యారం నాలుగు లైన్ల రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చొరవ చూపిన రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌కు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, చింతకుంట ఎంపీటీసీ సభ్యుడు భూక్య తిరుపతినాయక్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. మంత్రి మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలతో సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్న రహదారులపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులదేనని అన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టంతో రహదారి రూపురేఖలు మారి, ప్రయాణం సులభతరం కానుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ, వార్డు సభ్యుడు సాగర్ పాల్గొన్నారు.

ఇద్దరు పోలీసుల సస్పెన్షన్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లో విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతోపాటు దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసినట్లు సీపీ ఎల్.సుబ్బారాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఓ ప్రైవేట్ వ్యవహారంలో జోక్యం చేసుకొని, విధులను నిర్లక్ష్యం చేసిన రామడుగు హెడ్‌కానిస్టేబుల్ ఎం.శంకరయ్య, ఎస్సై ఎం.స్వామిని దుర్భాషలాడిన సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్(సీఏఆర్) విభాగం కానిస్టేబుల్ షబ్బీర్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు క్రమశిక్షణతో మెదలాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్: కొండపల్కల గ్రామానికి చెందిన గట్టు అనిల్‌గౌడ్ (32) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామస్తుల వివరాలు ప్రకారం.. అనిల్‌గౌడ్ గత సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స చేయించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతోనే అనిల్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఎనిమిది నెలల పాప ఉన్నారు.

‘పారమిత లిటిల్ జీనియస్’ వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రసాద్‌రావు



నృత్యం చేస్తున్న చిన్నారులు

కరీంనగర్: మంకమ్మతోట పారమిత లిటిల్ జీనియస్ ప్రీప్రైమరీ పాఠశాల వార్షికోత్సవాన్ని(ముదిత) పారమిత విద్యాసంస్థల అధినేత ఇనుగంటి ప్రసాదరావు శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. వేడుకలు శనివారం కూడా కొనసాగుతాయని చెప్పారు. విద్యార్థి జీవితంలో ప్రీప్రైమరీ పాఠశాల అత్యంత కీలకమైందని, ఈ సమయంలో చిన్నారులు ఆడుతూపాడుతూ విద్యనభ్యసిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు కవితప్రసాద్, ఆనంద్ కమలాకర్, ప్రశాంత్, బాలాజీ, ఎస్‌వోడీ తిరుపతిరావు, టీచర్లు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు తరలిస్తున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భగత్‌నగర్, ఎన్‌జీవోస్‌కాలనీ, బృందావన్‌కాలనీ, కట్టరాంపూర్, అరవింద స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అలాగే విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ బ్యాంక్‌కాలనీ, సంతోష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని అల్ఫోర్స్ కళాశాల, గుండు హనుమాన్ దేవాలయం, వావిలాలపల్లి, తేజ స్కూల్, రెడ్డి ఫంక్షన్‌హాల్, జ్యోతినగర్, కొత్త లేబర్‌అడ్డ, భాగ్యనగర్, శివ థియేటర్ వెనక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని టౌన్–1, 2 ఏడీఈలు ఎస్.నరేందర్, సుధీర్‌కుమార్‌లు పేర్కొన్నారు.

రేకుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో..

విద్యుత్ అభివృద్ధి పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 కేవీ రేకుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని రేకుర్తి చౌరస్తా, షేకాబికాలనీ, సింహాద్రికాలనీ, హనుమాన్‌నగర్, ద్వారకానగర్, విజయపురికాలనీ, అంబేడ్కర్‌కాలనీ, బుడిగజంగాల కాలనీ, ఇందిరమ్మకాలనీ, స్వామికాలనీ, హరిహరనగర్, సాలెహ్‌నగర్, లయోల కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపు రాజు తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



లాస్యశ్రీని అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ డా. కె.వి. రావ్ సైంటిఫిక్ సొసైటీ ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ పదోతరగతి విద్యార్థిని జి.లాస్యశ్రీ రూపొందించిన ‘ఫ్రాక్టల్స్’ నమూనా మొదటి రన్నరప్‌గా నిలిచి, రూ.5 వేల నగదు బహుమతి గెలుచుకున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

చొప్పదండి: రూ.1,200 కోట్లతో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి చేశామని, సీఎం కేసీఆర్ కార్యదీక్షుడని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పట్టణంలోని జీఆర్ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీజేపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

చొప్పదండి: గూడ్స్ డ్రైవర్ల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్నకొండలో మేకలు, గొర్రెల వ్యాపారుల వద్ద పనిచేసే డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. పది రోజులుగా చేస్తున్న నిరసనకు యజమానులు తలొగ్గడం లేదని అన్నారు. రూ.26 వేల వేతనం చెల్లించాలన్నారు. డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

హుజూరాబాద్‌రూరల్: ఏప్రిల్ 3 నుంచి జరగబోయే పది పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ ఒక ప్రకటనలో కోరారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్షలకు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.

సబ్సిడీపై ట్రాక్టర్లు పంపిణీ చేయాలి

సైదాపూర్: రైతులకు ఏటా ఇవ్వాల్సిన సబ్సిడీ పనిముట్లు, యంత్రపరికరాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఎగనామం పెట్టిందని, ఐదెకరాల భూమి ఉన్న రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు పంపిణీ చేయాలని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. రైతుబంధు ఇస్తున్నామని, యంత్ర, పనిముట్లు ఇవ్వకపోవడంతో రైతులపై పనిముట్ల భారం పడుతోందన్నారు.

రేపు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం

శంకరపట్నం: రేకుర్తిలో ఏప్రిల్ 2న నిర్వహించే బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి కోరారు. కేశవపట్నంలో శుక్రవారం మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ సామాజిక వర్గానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు.

80 వేల మందికి కంటి పరీక్షలు చేశాం

- మేయర్ సునీల్‌రావు



కంటివెలుగు శిబిరంలో మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ సిటీ: ప్రతీ మనిషికి కళ్లు ప్రధానమని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి 3, 9వ డివిజన్లలో శుక్రవారం పర్యటించారు. 3వ డివిజన్ కిసాన్‌నగర్‌లో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, 9వ డివిజన్ కోతిరాంపూర్‌లో కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్‌లతో కలిసి కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రెండో విడత కంటి వెలుగును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. నగర వ్యాప్తంగా ఇప్పటివరకు 80 వేల మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైనవారికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దాదాపు 40 వేల మందికి రీడింగ్ గ్లాసెస్ అందించినట్లు తెలిపారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి శిబిరాల అనంతరం ఉచితంగా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి పట్టాభిషేకం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని హెలీప్యాడ్ గ్రౌండ్‌లో గల ప్రసన్నాంజనేయ దేవాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీసీతారామచంద్ర స్వామి పట్టాభిషేకం, పుష్పయాగం, చక్రతీర్థం, ధ్వజారోహణం, అమ్మవారికి ఒడి బియ్యం, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మేయర్ సునీల్ రావు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్‌కు ఎంఐఎం నగర అధ్యక్షుడి అండ



బాడీ బిల్డర్ ఆమెర్‌తో గులాం అహ్మద్ హుస్సేన్

విద్యానగర్: కరీంనగర్‌లోని ఇస్లాంపుర గోష్ కట్టకు చెందిన అండర్–19 బాడీ బిల్డర్ ఆమెర్ ఖురేషి జాతీయస్థాయి చాంపియన్‌షిప్ పొందేవరకు అయ్యే ఖర్చులన్నీ తానే భరిస్తానని ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ హామీ ఇచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆమెర్ ఖురేషి ఆయనను కలిశారు. అండర్–19 తెలంగాణ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఖురేషిని గులాం అహ్మద్ హుస్సేన్ అభినందించారు.

ఉర్సు ఉత్సవాలకు హాజరు..

కరీంనగర్ పాత బజార్‌లో గల కరీముల్లా షా సాహెబ్ దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలకు ఎంఐఎం నగర అధ్యక్షుడు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ హాజరయ్యారు. చాదర్ సమర్పించి, ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లి సులేమాన్ మన్సూర్ తవక్కలి గులాం అహ్మద్, ఎంఐఎం జాయింట్ సెక్రటరీ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు సాజిద్, నాయకులు ఫర్హాజ్ అలీ, కరీంఖాన్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లది కీలక పాత్ర



జ్ఞాపిక అందుకుంటున్న వలంటీర్లు

కరీంనగర్‌రూరల్: గ్రామీణులను చైతన్యం చేయడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కీలక పాత్ర పోషించారని జూబ్లీనగర్, మొగ్దుంపూర్ గ్రామాల సర్పంచులు రుద్ర భారతి, జక్కం నర్సయ్య అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలంలోని జూబ్లీనగర్‌లో నగునూరు సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం, మొగ్దుంపూర్‌లో వాణినికేతన్ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. వారం రోజులపాటు గ్రామాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసినట్లు చెప్పారు. అనంతరం శిబిరం నిర్వహణకు సహకరించిన సర్పంచులను కళాశాల ఆధ్వర్యంలో సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఉపసర్పంచులు కూకట్ల తిరుపతి, జటంగి కుమార్, ప్రిన్సిపాల్స్ శ్రీహరి, వేణుగోపాల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవోలు లావణ్య, రమేశ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత కొండ రవి, భారత నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వాటర్ కూలర్ల ఏర్పాటు



కూలర్లను ప్రారంభిస్తున్న సీఐ నటేశ్

కరీంనగర్: వేసవి దృష్ట్యా ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో టీఎస్ఆర్టీసీ కరీంనగర్ బస్టాండ్‌లో వాటర్ కూలర్లు ఏర్పాటు చేసింది. వీటిని కరీంనగర్–1 టౌన్ సీఐ నటేశ్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కరీంనగర్–1 డిపో మేనేజర్ ప్రణీత్, 2 డిపో మేనేజర్ మల్లయ్య, స్టేషన్ మేనేజర్ అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోనూ కుక్కల బెడద



కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్‌లోనూ కుక్కల బెడద తప్పడం లేదు. ఉన్నతాధికారులు విధులు నిర్వహించే సముదాయంలో ప్రధాన ద్వారం, ఆడిటోరియం, ఆర్డీవో కార్యాలయాల వద్ద స్వైరవిహారం చేస్తున్నాయి. అక్కడే సేదతీరుతున్నాయి. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

జమ్మికుంట(హుజూరాబాద్): మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు శుక్రవారం పర్యటించారు. వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎంతమేరకు మురుగుకాలువ నిర్మించాలి, వరదనీరు వెళ్లే మార్గంపై తదితర అంశాలపై చర్చించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు శ్రీపతి నరేష్, పాతకాల రమేష్, దయ్యాల శ్రీనివాస్, పొనగంటి మల్లయ్య, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ముగిసిన జీ20 సదస్సు

విశాఖలో 4 రోజులు కొనసాగిన సమావేశాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ వేదికగా మార్చి 28 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన జీ 20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఇండియా ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో 'రేపటి ఆర్థిక నగరాలు – అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన అవకాశాలు'పై ప్రధానంగా సదస్సు జరిగింది. 14 సభ్య దేశాలు, ఎనిమిది అతిథి దేశాలు, పది అంతర్జాతీయ సంస్థలకు చెందిన 57 మంది ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. యూఎన్‌డీపీ, ఓఈసీడీ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, ఈబీఆర్‌డీ లాంటి అంతర్జాతీయ సంస్థల నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ సదస్సుకు అధ్యక్షత వహించారు.

త్వరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

అమిత్ షా హామీ ఇచ్చారు: ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: త్వరలోనే బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, బడ్జెట్ కూడా పెంచుతామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పినట్లు వైఎస్సార్ సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరడి భూపేష్ సాగర్ తదితరులతో కూడిన బృందం శుక్రవారం అమిత్‌షాతో భేటీ అయింది. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కుల గణన చేపట్టాలని, పట్టికలో దీనిని అదనంగా చేర్చాలని, బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు, పదోన్నతుల్లో, న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్లు, క్రీమిలేయర్ తొలగింపు, రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ తదితర 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అమిత్ షాకు అందజేసింది. అనంతరం ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే, ఎల్ఐసీ, బ్యాంకింగ్ తదితర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం అన్యాయమని అమిత్‌షాకు తెలిపినట్లు చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు మినహాయిస్తే అన్ని ప్రభుత్వాలూ కులగణనకు మద్దతిచ్చాయని, బీజేపీకి బీసీల పట్ల వివక్ష ఎందుకని ప్రశ్నించామన్నారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవని, వాటి పరిష్కారానికి చొరవ చూపుతానని అమిత్‌షా హామీ ఇచ్చారన్నారు.

'మార్గదర్శి' డాక్యుమెంట్లే సీజ్

- ఇతర ఏ సంస్థ వివరాలూ మావద్ద లేవు
- నాంపల్లి మేజిస్ట్రేట్ కూడా దీన్ని ధ్రువీకరించారు
- తనిఖీలు ముగిసినందున పిటిషన్‌ను కొట్టివేయాలి
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఏపీ ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్, అనుబంధ సంస్థల డేటా మినహా మరే ఇతర సంస్థలకు చెందిన డేటా తాము సీజ్ చేసిన డాక్యుమెంట్లలో లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. సీజ్ చేసిన డాక్యుమెంట్ల జాబితాపై నాంపల్లి 14వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సంతకం చేశారని, ఆ కాపీని కోర్టుకు కూడా సమర్పించామని తెలిపింది. ఎలాంటి ఆధారాలు లేకుండా, విచారణను జాప్యం చేసేందుకే పిటిషనర్ ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేసింది. తమ సంస్థలో తనిఖీలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ బ్రహ్మయ్య అండ్ కో, పెద్ది చంద్రమౌళి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ కౌన్సిల్ పి.గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు.

తనిఖీలు ఆపాలని మాత్రమే కోరారు..

'మార్గదర్శిపై పలు ఆరోపణలున్నాయి. చిట్స్ ద్వారా వచ్చిన నగదును షేర్‌మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌కు మళ్లిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. ప్రధాన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఇది బడా వైట్ కాలర్ నేరం. సంస్థకు చెందిన పలు కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. బ్రహ్మయ్య అండ్ కో కార్యాలయ తనిఖీల్లో మాత్రం పోలీసులు పాల్గొన్నారు. ప్రధాన కేసు విచారణ సందర్భంగా పలు డాక్యుమెంట్లను అధికారులు అడిగారు. మార్గదర్శి చార్టర్డ్ అకౌంటెంట్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మం అండ్ కో వాటిని ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. తనిఖీలు ఆపాలని మాత్రమే పిటిషనర్ కోరారు. అవి ఎప్పుడో ముగిశాయి కనుక పిటిషన్‌ను కొట్టివేయాలి' అని గోవిందరెడ్డి కోర్టుకు నివేదించారు.

ప్రత్యేకంగా విచారణ ఎందుకు?

'మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి కోర్టు విధుల సమయం ముగిసిన తర్వాత కూడా ప్రత్యేకంగా విచారణ జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? సామాన్యుడికి ఏదైనా ప్రాణం మీదకు వస్తే కోర్టు ఇలాగే వ్యవహరిస్తుందా..? ఇది ఎంత వరకు సమంజసమో ఆలోచించాల్సిన అవసరం ఉంది. లంచ్‌మోషన్ పిటిషన్లు వేయడం, కోర్టు విధులు ముగిసిన తర్వాత అత్యవసరంగా విచారణ జరిపి ఉత్తర్వులు పొందడం ద్వారా మార్గదర్శికో నీతి – సామాన్యుడికో నీతి అనే అభిప్రాయం నెలకొనే అవకాశం ఉంది' అని విచారణ సందర్భంగా స్పెషల్ కౌన్సిల్ పి.గోవింద్‌రెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను న్యాయమూర్తి ఏప్రిల్ 13వతేదీకి వాయిదా వేశారు.

తనిఖీలు ముగిశాక విచారణా?

తనిఖీలు ముగిసిన తర్వాత వాటిని ఆపాలన్న విజ్ఞప్తిపై ఇక విచారణ ఎలా కొనసాగిస్తామని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది నళిన్‌కుమార్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. ఆ పిటిషన్‌లో ఇంటర్ లొక్యుటరీ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశామని నళిన్‌కుమార్ నివేదించారు.

ఒంటిమిట్టలో వేడుకగా ధ్వజారోహణ



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. తొలుత శాస్త్రోక్తంగా హోమం, పూజలు నిర్వహించిన వేదపండితులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ధ్వజస్తంభంపై గరుడ పతాకాన్ని ఎగురవేశారు.

– ఒంటిమిట్ట

మూడు రాజధానుల దీక్షా శిబిరంపై దాడి

- సీఎం జగన్‌పై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు
- వాటిని నిరసిస్తూ బహుజన పరిరక్షణ సమితి నేతల నిరసన
- శిబిరంపై విరుచుకుపడ్డ మాజీ మంత్రి అనుచరులు
- మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగేసిన వైనం
- ఈ గొడవను వైఎస్సార్‌సీపీ, బీజేపీ మధ్య ఘర్షణగా చిత్రీకరించేందుకు బాబు, పవన్‌ల యత్నం



దీక్షాశిబిరం వద్ద రెచ్చగొడుతున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు



బహుజన నేతలపై దాడులు చేస్తున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు, టీడీపీ నేతలు

తాడికొండ/సాక్షి, అమరావతి : అమరావతి దీక్ష శిబిరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మూడు రాజధానుల శిబిరం వద్ద నిరసన తెలిపిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలపై బీజేపీ ముసుగులోని టీడీపీ మాజీ మంత్రి అనుచరులు విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ఈ దాడులను బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య చోటుచేసుకున్న ఘర్షణగా చిత్రీకరిస్తూ టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రాజకీయ డ్రామాకు తెరతీశారు. అమరావతి దీక్షలు 1200వ రోజుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం మందడంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆదినారాయణరెడ్డి.. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌తో కలిసి వెళ్లారు. ఆ శిబిరంలో సీఎం జగన్‌పై ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయం తాళ్లాయపాలెం జంక్షన్‌లోని మూడు రాజధానుల శిబిరంలో 915వ రోజు దీక్షలు చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలకు తెలిసింది. కాసేపటి తర్వాత ఆదినారాయణరెడ్డి, సత్యకుమార్, వారి అనుచరులు విజయవాడకు బయలుదేరారు. వారి వాహన శ్రేణి మూడు రాజధానుల శిబిరం వద్దకు చేరుకోగానే.. బహుజన పరిరక్షణ సమితి నాయకులు రోడ్డు పక్కన నిల్చొని శాంతియుతంగా నిరసన తెలిపారు. ఆదినారాయణరెడ్డి డౌన్ డౌన్.. అమరావతి వద్దు.. మూడు రాజధానులే ముద్దు.. అంటూ నినదించడంతో ఆదినారాయణరెడ్డి అనుచరులు వారిపై విచక్షణా రహితంగా దాడులకు దిగారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలపై విరుచుకుపడ్డారు. మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగారు. వారు ప్రతిఘటించడానికి సిద్ధమవుతుండగా.. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనకు కారణమైన ప్రతిపక్ష నేత చంద్రబాబు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష శిబిరాన్ని సందర్శించిన బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, ఆయన అనుచరులు, టీడీపీ నాయకులు శిబిరం వద్ద ఉన్న మహిళలను జుట్టు పట్టుకొని తన్నారని చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరిగిందన్నారు.

ఆదినారాయణరెడ్డి కోసమే..

మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి తీరుపై బహుజనులు నిరసన తెలపడంలో భాగంగానే ఈ సంఘటన జరిగిందని బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. ఆ ఘటన సమయంలో 'నా పేరు ఎవరూ ఎత్తలేదు.. ఆదినారాయణరెడ్డి కోసమే ఆరా తీశారు. ఆయన నా కారు ఎక్కలేదు. ఉదయం నేను, ఆయన కలిసి వెళ్లాం. సభ నుంచి ఆయన కాస్త ముందుగా వచ్చారు. ఆ విషయం వారికి తెలియదు. ఎవరో నా కారుపై దాడి చేశారు' అని వివరించారు. కాగా, సత్యకుమార్ కారుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటన గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ దాదాగిరీ పరాకాష్టకు చేరిందన్నారు.

రహదారులకు మహర్దశ ₹

- ఎన్‌హెచ్‌ల నిర్మాణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థత
- రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్న కేంద్రం
- నాలుగేళ్లలో సాధించిన నిధులు రూ.23,471.92 కోట్లు
- నాడు ఐదేళ్లలో టీడీపీ తెచ్చింది రూ.10,660 కోట్లే

సాక్షి, అమరావతి: ఏపీలో జాతీయ రహదారుల అభివృద్ధికి వరుసగా నాలుగో ఏడాదీ కేంద్రం నుంచి రికార్డు స్థాయిలో నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించింది. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఈ వార్షిక ప్రణాళికలో రూ.12,130 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వార్షిక ప్రణాళిక కింద ఆమోదించిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రహదారుల ప్రాజెక్టులను పరిశీలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తి చెందితేనే ఆమేరకు ఆర్థిక సంవత్సరం ఆఖరులో నిధులు మంజూరు చేస్తుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం పట్ల రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతో పూర్తి సంతృప్తి చెందినందున రికార్డు స్థాయిలో వార్షిక ప్రణాళిక నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్ తరువాత అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కే నిధులు మంజూరు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నాడు కేంద్రంలో అధికారాన్ని పంచుకుని కూడా

నాడు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా చంద్రబాబు జాతీయ రహదారుల అభివృద్ధికి తగిన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. ఐదేళ్లలో టీడీపీ సర్కారు కేవలం రూ.10,660 కోట్లు మాత్రమే తేగలిగింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఈ ఒక్క ఏడాదిలోనే రూ.12,123 కోట్లు సాధించడం విశేషం. మొత్తం నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ.23,471.92 కోట్లు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో రాష్ట్రంలో పారిశ్రామిక, తీర ప్రాంతాలు, ఎకనామిక్ జోన్లు, పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ రహదారుల అభివృద్ధి జోరందుకుంది.

సీఎం జగన్ ప్రణాళికకు కేంద్రం ఆమోదం

2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీతో చర్చిస్తూ పట్టుబట్టి నిధులను సాధిస్తున్నారు. 2019–20 వార్షిక ప్రణాళికలో తొలుత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.600 కోట్లే కేటాయించింది. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి జగన్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ దృష్టికి తేవడంతో 2019–20లో రాష్ట్రానికి నిధుల కేటాయింపును రూ.1,304.42 కోట్లకు పెంచారు. ఇక 2020–21 వార్షిక ప్రణాళికలో కేంద్రం రూ.2,476.50 కోట్లు మంజూరు చేయగా, 2021–22లో ఏకంగా రూ.7,561 కోట్లు మంజూరు చేసింది. ఆ ఆర్థిక సంవత్సరంలో దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు కేటాయించడం గమనార్హం.

541.45 కి.మీ. మేర 24 ప్రాజెక్టులు

2022–23కి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళిక నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 24 ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. రూ.11699.55 కోట్లతో ఇప్పటికే 513.72 కి.మీ. మేర 21 ప్రాజెక్టులను పూర్తి చేసింది. రూ.431.27 కోట్లతో 27.73 కి.మీ.మేర మూడు ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. అవి కూడా త్వరలో పూర్తి చేయనున్నారు.

అటవీ గ్రామాలకు విద్యుత్ సరఫరా

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనుల పురోగతిపై అధికారుల సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ఎం.డోబ్రియాల్

నిర్మల్‌టౌన్ : మారుమూల అటవీ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ఎం.డోబ్రియాల్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న అటవీ గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పన పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నిర్మల్ జిల్లాకు సంబంధించి 35, ఆదిలాబాద్ 34, ఆసిఫాబాద్ 84, మంచిర్యాల 9, మొత్తం 162 ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నాయని ఆరా తీశారు. ఆన్‌లైన్ అప్లికేషన్ల విధానం, సత్వర అనుమతుల ప్రక్రియ కోసం పాటించాల్సిన నియమాలు, శాఖల మధ్య సమన్వయంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణ ప్రధాన అధికారి మాట్లాడుతూ.. అటవీ గ్రామాలకు విద్యుత్ సరఫరాను అత్యంత ప్రాధాన్యత అంశంగా తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందన్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఆవాసాలన్నీ రక్షిత కవాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఉండటంతో కేంద్ర వన్యప్రాణి సంరక్షణ చట్టంతోపాటు, నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా సవరించిన అటవీ అనుమతుల విధానానికి లోబడి ప్రతిపాదనలు ఉండాలని తెలిపారు. అలాగే ప్రతీ ప్రతిపాదన కోసం మళ్లించే అటవీ భూమికి సమానమైన నాన్ ఫారెస్ట్ లాండ్ (అటవీ భూమి కానటువంటి) కేటాయింపులు ఉండాలన్నారు. లోపాలు లేకుండా ప్రతిపాదనలు ఉంటే కేంద్రం నుంచి త్వరగా అనుమతులు సాధించవచ్చని స్పష్టం చేశారు. సమావేశంలో పీసీసీఎఫ్ (ఎఫ్‌సీఏ) ఎంసీ.పర్గెయిన్, నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, నాలుగు జిల్లాల చీఫ్ కన్జర్వేటర్లు, అటవీ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అదానీని కాపాడడమే మోడీ లక్ష్యం

- వ్యాపార సంబంధాలు బయటపెట్టినందుకే రాహుల్‌పై వేటు
- ఏఐసీసీ సెక్రటరీ ఎ.సంపత్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

కరీంనగర్‌టౌన్: నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి బహిష్కరించడాన్ని ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి ఎ.సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో అటు న్యాయ, ఇటు పార్లమెంటు వ్యవస్థ ఈ రెండు వ్యవస్థలను వాళ్ల స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని అన్నారు. నరేంద్ర మోడీకి అదానీకి మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని ఆర్థిక, వ్యాపార వాణిజ్య సంబంధాలను ఆధారాలతో సహా బయటపెట్టిన రాహుల్ గాంధీ ప్రసంగాన్ని పార్లమెంటు రికార్డుల్లో లేకుండా చేశారని ఆరోపించారు. అనంతరం సూరత్ కోర్టులో స్టే విధించి ఉన్న కేసును 24 గంటల్లో రీ ఓపెన్ చేసి రాహుల్ గాంధీకి శిక్షపడేలా చేశారని అన్నారు. 48 గంటలు దాటకముందే అధికారిక నివాసం ఖాళీ చేయాలని పార్లమెంటు కార్యాలయం నుంచి ఉత్తర్వులు ఇవ్వడం వెనక ఏ విధంగా న్యాయవ్యవస్థను తప్పుదారి పట్టించినారో స్పష్టమవుతోందన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి నియోజకవర్గం ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బాసరలో మహిళా సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళా సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ ఆకుల లలిత

భైంసా: రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ ఆకుల లలిత బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందించారు. నిర్మల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి కూడా బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు.

బాసర ఆలయానికి నిధులు మంజూరు చేయండి

భైంసా: బాసర ఆలయ అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీం ద్వారా నిధులు మంజూరు చేయాలని ఆలయ అధికారులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రిని కలిసి ఈమేరకు విన్నవించారు. దీనికి కిషన్‌రెడ్డి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసినవారిలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ శరత్‌పాఠక్, ఏఈఓ, ప్రధాన అర్చకులు ఉన్నారు.

ప్రాచీన కళలు దాగి ఉన్న నెన్నెల

- రిటైర్డ్ ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్ రావు
- పురాతన పనిముట్లు సేకరించిన బృందం



సేకరించిన పనిముట్లను చూపుతున్న ప్రొఫెసర్ తిరుమల్‌రావు బృందం

నెన్నెల: మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో ఎన్నో ప్రాచీన కళలకు సంబంధించిన పురాతన వస్తువులు దాగి ఉన్నాయని, నాడు ప్రకృతి నుంచే గ్రామీణులు పనిముట్లు తీసుకున్నారని తెలుగు యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన నెన్నెల మండలంలోని మారుమూల గ్రామాలైన ఖర్జీ, జంగాల్‌పేట గ్రామాలను తన బృందంతో సందర్శించారు. కలపతో తయారుచేసిన పనిముట్లు, పురాతన వస్తువులు సేకరించారు. ఈ పనిముట్లు పర్యావరణ అనుకూలమైనవని, ప్రకృతిని పాడుచేసేవి కాదని అన్నారు. నాడు గ్రామీణులు ప్రకృతి నుంచి అన్నీ తీసుకుని వారి తెలివితో వ్యవసాయం చేస్తూ వచ్చారని తెలిపారు. ఎడ్లబండి, కర్రు, చర్మంతో తయారు చేసిన డొత్తెలు(పశువుల మెడలో కట్టేవి), జొన్నలు పోయడానికి ఉపయోగించే పనిముట్టు గిరిగం, పశువులు, మేకల మెడలో కట్టే లొటారం వంటి పురాతన వస్తువులు సేకరించారు. నేడు వీటిని చూసి వస్తువులు తయారు చేస్తున్నారని, కానీ రకరకాల రసాయనాలు, ప్లాస్టిక్ వాడుతుండడంతో ప్రకృతి అంతా వికృతిగా మారిందని తెలిపారు. గ్రామాలు డంపింగ్ యార్డులా తయారవుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చపుతున్నాయని, ఇంటి ఆవరణ చెత్తకూపంగా మారుతోందని పేర్కొన్నారు. గోదావరిఖనిలో అతి సూక్ష్మ రాతిపరికరాలు సేకరించామని, భావితరాలు చూపించడానికే పర్యావరణ అనుకూల పనిముట్లను సేకరిస్తున్నామని వివరించారు. సాంస్కృతిక, నాగరికత, పర్యావరణ పరిస్థితులను భావితరాలను తెలియజేయడానికి ఐదు మ్యూజియంలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సంగీత వాయిద్యాలు, తాళపత్రాలు, లిపి భాష, లోహ కళలు, విగ్రహాలు, చిత్రకళలు, బొమ్మలు, మనిషి జీవితం, పరికరాలు వీటన్నింటిని హైదరాబాద్‌లోని మ్యూజియంలో భద్రపర్చనున్నట్లు చెప్పారు. ప్రజలు, ప్రభుత్వం సహకరించాలని కోరారు. అనంతరం జంగాల్‌పేట పాఠశాలలో 65 మంది నిరుపేద విద్యార్థులకు ఎస్సైతో కలిసి దుస్తువులు పంపిణీ చేశారు. ఈ పురాతన వస్తువుల సేకరణలో ప్రొఫెసర్ గూడురి మనోజ, రచయిత ముత్తె రజిత పాల్గొన్నారు.

దేశంలో అతిపెద్ద పవర్ హబ్ ఎన్టీపీసీ



మాట్లాడుతున్న ఈడీ సునీల్‌కుమార్

- ఎన్టీపీసీ రామగుండం- తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): దేశంలో ఎన్టీపీసీ రామగుండం అతి పెద్ద పవర్ హబ్‌గా నిలవనుందని ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్టీపీసీలో థర్మల్ విద్యుత్ 2,600, ఫ్లోటింగ్ సోలార్ 100, సోలార్ ప్లాంటు 10 మొత్తం 2,710 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు తెలంగాణ స్టేజీ–1లో 800 మెగావాట్ల రెండు యూనిట్లకుగాను(1600 మెగావాట్లు) మొదటి యూనిట్ త్వరలో కమీషనింగ్ కానుండడంతో దక్షిణాదిలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థగా ఎన్టీపీసీ నిలిచిందన్నారు.

మరో 45 రోజుల్లో..

తెలంగాణ స్టేజీ–1లో నిర్మితమవుతున్న 800 మెగావాట్ల రెండు యూనిట్లలో మొదటి యూనిట్ ఈనెల 24న సింక్రనైజేషన్ పూర్తిచేసుకుందని, మరో 45 రోజుల్లో విద్యుత్ కమీషనింగ్ కానుందని తెలిపారు. మరో 800 మెగావాట్ల యూనిట్ జూన్‌లో విద్యుత్ ఉత్పత్తి దశలోకి రానుందని వెల్లడించారు. ప్రాజెక్టులో 50 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వ ఉందని, సింగరేణితో ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. తెలంగాణ ప్రాజెక్టు యూనిట్లలోని విద్యుత్ ఉత్పత్తిలో 85 శాతం తెలంగాణకు అందించేందుకు ఒప్పందం కుదిరిందన్నారు.

ఎన్టీపీసీలో మరిన్ని ప్రాజెక్టులు

ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో మరిన్ని విద్యుత్ ప్రాజెక్టులు రానున్నాయని ఈడీ పేర్కొన్నారు. సోలార్ ద్వారా మరో 185 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నట్లు ప్రకటించారు. రామగుండం ప్రాంతంలో చెత్త సమస్యను పరిష్కరించేందుకు సంస్థ పైలట్ ప్రాజెక్టుగా వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా రోజుకు 3 టన్నుల చెత్తను వినియోగించి చార్‌కోల్ తయారు చేయనున్నట్లు వివరించారు. స్థానిక బ్రిక్స్ యూనిట్స్‌కు తక్కువ ధరకు బూడిద అందించడానికి పరిశీలిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో చీఫ్ జీఎం ప్రసేంజిత్‌పాల్, జీఎంలు పుష్పేంద్రకుమార్ లాఢ్, ఏకే దేశాయ్, హరెరాంసింగ్, మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్, తపస్ సాహా, ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, డీజీఎం ప్రశాంత్ సామ్యూల్, కార్పొరేట్ కమ్యూనికేషన్ అధికారి స్వయం పూర్ణానంద, విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది కుట్రపూరిత పాలన



మాట్లాడుతున్న చెరుకు సుధాకర్

సిరిసిల్లటౌన్: ప్రతిపక్షాల గొంతు నొక్కేలా కేంద్రంలోని బీజేపీ సర్కారు కుట్రపూరిత పాలన సాగిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ప్రతినిధి చెరుకు సుధాకర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. రాహుల్‌గాంధీకి పార్లమెంటులో సభ్యత్వం రద్దు చేయడం అప్రజాస్వామిక చర్యగా పేర్కొన్నారు. భారత్ జోడోయాత్రతో దేశ ప్రజలకు కాంగ్రెస్‌పై వస్తున్న ఆదరణ చూసి బీజేపీ నొచ్చుకుంటోందన్నారు. దేశానికి ప్రజాస్వామ్యం నిర్మించడానికి గాంధీ కుటుంబం తన రక్తాన్ని చిందించిన విషయం విస్మరించి ప్రవర్తించడం బీజేపి అవివేకానికి నిదర్శనంగా పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తిని కాపాడటానికి ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రిత్వ వ్యవస్థ చేస్తున్న ప్రయత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ మేరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నట్లు వెల్లడించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కామునివనిత, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మడుపు శ్రీదేవి, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు ఉన్నారు.

సాక్షి
ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 1-4-2023



డాక్టర్ విజయలక్ష్మి

సరిగమలే ఔషధాలు

ఆమె సంగీత విద్వాంసురాలు.
అంతేకాదు... వైద్యరంగంలో ప్రొఫెసర్.
వృత్తిని ప్రవృత్తిని మేళవించారామె.
సరిగమలు వైద్యానికి ఔషధాలయ్యాయి.
రాగాలు ఆరోగ్యాన్నిచ్చే టానిక్‌లవుతున్నాయి.
తీయని కృతులు షుగర్ లెవెల్స్ తగ్గిస్తున్నాయి.
సంగీత లయ బీపీకి గిలిగింత పెడుతోంది.

ప్రొఫెసర్ విజయలక్ష్మి సుబ్రహ్మణ్యమ్... కర్ణాటక సంగీతంలో రాగాల మీద పరిశోధన చేశారు. ఆ రాగాలు డిప్రెషన్‌ను దూరం చేయడానికి ఏ విధంగా దోహదం చేస్తాయనే విషయాలను శాస్త్ర బద్ధం చేశారు. సంగీతం అనారోగ్యాన్ని మాయం చేస్తుందనడానికి ప్రత్యక్ష నిదర్శనం తానేనని కూడా చెబుతారామె. ఇరవై ఒక్క ఏళ్ల వయసులో ప్రమాదానికి గురై చక్రాల కుర్చీలో గడిపిన సమయంలో సంగీత సాధన ద్వారా వేగంగా సాంత్వన పొందిన వైనాన్ని గుర్తు చేసుకున్నారు. డాక్టర్‌గా తన వృత్తిని సంగీతం పట్ల మక్కువతో మేళవించి రాగాలతో చేస్తున్న వైద్యం గురించిన వివరాలను సాక్షితో పంచుకున్నారు.

■ తంజావూరు సరస్వతి మహల్

"నేను పుట్టింది బెంగళూరు, కర్ణాటకలో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాలో సంగీతాభిలాష ఎలా మొదలైందని చెప్పడం కష్టమే. ఎందుకంటే మా ఇల్లే ఒక సంగీత నిలయం. నానమ్మ గాత్రసాధనతోపాటు వయొలిన్ సాధన కూడా చేసేవారు. అమ్మ ఉద్యోగ పరంగా సైన్స్ టీచర్, కానీ ఆమె కూడా సంగీతంలో నిష్ణాతురాలు. మా నాన్న శిక్షణ పొందలేదనే కానీ సంగీతపరిజ్ఞానం బాగా ఉండేది. అలా నాకు మా ఇంటి గోడలే సరిగమలు నేర్పించాయి. నాన్న ఉద్యోగరీత్యా దేశంలో అనేకచోట్ల పెరిగాను. గుజరాత్, బరోడాలో ఉన్నప్పుడు సంగీతంతోపాటు భరతనాట్యం కూడా నేర్చుకున్నాను. సంగీతం నాకు ధారణ శక్తికి బాగా ఉపకరించింది. దాంతో చదువులోనూ ముందుండేదాన్ని. ఎంబీబీఎస్‌లో సీటు వచ్చిన తర్వాత నా చదువు, అభిరుచి రెండు వేర్వేరు ప్రపంచాలయ్యాయి. రెండింటినీ వేరుగా చూడడం నాకు సాధ్యపడలేదు. నాకు తెలియకుండానే కలగలిపి చూడడం మొదలైంది. సంగీతాన్ని ఒక కళగా సాధన చేయడంతో సరిపెట్టకుండా ఒక శాస్త్రంగా అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. నాద యోగ, రాగచికిత్సల గురించి అప్పుడు తెలిసింది. తంజావూరు సరస్వతి మహల్ లైబ్రరీలో సంగీతంతో వైద్యవిధానాల గురించి గ్రంథాలున్నాయి. మెడిసిన్‌తోపాటు మ్యూజిక్‌ని కూడా విపరీతంగా చదివాను. రాష్ట్రంలో మూడవ ర్యాంకుతో కర్ణాటక సంగీతంలో కోర్సు పూర్తి చేశాను. మన దగ్గరున్న పురాతన రాతిశాసనాలతోపాటు విదేశాల్లో ఉన్న మ్యూజిక్ థెరపీలను తెలుసుకున్నాను. వైద్యానికీ– సంగీతానికీ మధ్య ఉన్న, మనం మరిచిపోయిన బంధాన్ని పునఃప్రతిష్ఠ చేయాలనే ఆకాంక్ష కలిగింది.

■ మతిమరపు దూరం

మ్యూజిక్ థెరపీ అనగానే అందరూ ఇక మందులు మానేయవచ్చని అపోహపడుతుంటారు. అలాగే మందులు కొనసాగించాల్సినప్పుడు ఇక మ్యూజిక్‌తో సాధించే ప్రయోజనం ఏముంది అని తేలిగ్గా తీసేస్తుంటారు. ఇక్కడ మనం తెలుసుకోవాల్సింది ఏమిటంటే... మా దగ్గరకు వచ్చిన ఒక పోలీస్ ఆఫీసర్ మూడు వందలకు పైగా డయాబెటిస్‌తో ఇన్సులిన్ తీసుకునేవాడు. మ్యూజిక్ థెరపీతో ఇన్సులిన్ అవసరం లేకుండా మందులు సరిపోయే దశకు తీసుకురాగలిగాం. నత్తితో ఇబ్బంది పడే పిల్లలు అనర్గళంగా మాట్లాడేటట్లు చేసింది సంగీతం. రెండు రోజులకోసారి డయాలసిస్ చేసుకుంటూ కిడ్నీ దాత కోసం ఎదురు చూస్తున్న పేషెంట్‌కి ఉపశమనం దొరికింది. ఇక నరాలు, నాడీ సంబంధ సమస్యలను నయం చేసి చూపిస్తున్నాం. ప్రతి పేషెంట్‌నీ వాళ్ల ఆహారవిహారాలు, ఇతర ఆరోగ్య సమస్యల ఆధారంగా విశ్లేషించి ప్రతి ఒక్కరికీ వారికి మాత్రమే ఉపకరించే సంగీత విధానాన్ని సూచిస్తాం. కొంతమంది కోసం ప్రత్యేకంగా పాటలు రాసి కంపోజ్ చేసి ఇస్తాం. పేషెంట్ ఇష్టాలు, మత విశ్వాసాల ఆధారంగా మ్యూజిక్ థెరపీని డిజైన్ చేస్తున్నాం. అయితే దీనికి ప్రత్యామ్నాయ వైద్యవిధానం అర్హత ఉన్నప్పటికీ ఇంకా ధృవీకరణ రాలేదు. కాంప్లిమెంటరీ మెడిసిన్‌గానే ఆచరణలో పెడుతున్నాం. వార్ధక్యం కారణంగా అల్జైమర్స్, డిమెన్షియాతో బాధపడుతున్న వాళ్లకు మ్యూజిక్ థెరపీతో అద్భుతాలు సాధించామనే చెప్పాలి. ఓ పెద్దాయన అయితే... భార్య పేరు కూడా మర్చిపోయాడు. నేను స్వయంగా పాట పాడుతూ ఆయన ప్రతిస్పందించే తీరును గమనిస్తున్నాను. ఆశ్చర్యంగా పాటలో తన భార్య పేరు రాగానే చిన్న పిల్లవాడిలాగ 'యశోదా' అంటూ పెద్దగా అరిచాడు. మా పరిశోధనాంశాల ఆధారంగా మ్యూజిక్ థెరపీని శాస్త్రబద్ధం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాను'' అని చెప్పారు ప్రొఫెసర్ విజయలక్ష్మి. ఇదీ ఆమె మొదలు పెట్టిన 'ఇల్‌నెస్ టూ వెల్‌నెస్ ' జర్నీ. సరిగమలతో రాగాల వైద్యం త్వరలోనే అందరికీ అందుబాటులోకి రావాలని ఆకాంక్షిద్దాం.

– వాకా మంజులారెడ్డి

రాగాల చికిత్స

సంగీతం ఆరోగ్యప్రదాయినిగా అందరికీ అందుబాటులోకి తేవాలనే ఆకాంక్షలున్న వాళ్లందరం ఇండియన్ మ్యూజిక్ థెరపీ అసోసియేషన్ (ఐఎమ్‌టీఏ)గా సంఘటితమయ్యాం. ఇలాంటి సమూహాలు ఇంకా ఉన్నాయి. కానీ మనదేశంలో మ్యూజిక్ థెరపీ శాస్త్రబద్ధంగా, ఒక వ్యవస్థీకృతమైన అధీకృత సంస్థ ఏదీ లేదు. ఆ లోపాన్ని భర్తీ చేయడానికి ఇటీవల మంగళూరులో మా ఎనెపోయా మెడికల్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ కోర్సు ప్రారంభించాం. ఇది డాక్టర్ల కోసం మాత్రమే కాదు, వైద్యరంగంలో పని చేసే అందరూ ఈ కోర్సు చేయవచ్చు. ఇక నా ప్రయత్నంలో స్పెషల్ చిల్డ్రన్‌కి మ్యూజిక్ థెరపీ కోర్సు, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, కిడ్నీ ఫెయిలయ్యి డయాలసిస్‌తో రోజులు గడుపుతున్న పేషెంట్‌లకు మెరుగైన ఫలితాన్ని చూశాను.

– ప్రొ॥ విజయలక్ష్మి సుబ్రమణ్యమ్,
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓటోరైనోలారింగాలజీ, ఎనెపోయా మెడికల్ కాలేజ్,
మంగళూరు, కర్ణాటక
– జనరల్ సెక్రటరీ, ఐఎమ్‌టీఏ



పిల్లలకు మ్యూజిక్ థెరపీ ఇస్తున్న ప్రొ॥ విజయలక్ష్మి సుబ్రమణ్యామ్

బర్డ్‌వాచింగ్

మనసు రెక్క విప్పాలంటే



విద్యా సుందర్



తను వేసిన పక్షి ముగ్గులతో విద్యా సుందర్

బెంగళూరులో నివసించే విద్యా సుందర్ ఉదయాన్నే లేచి బాల్కనీలో నిలబడి కాసేపు పక్షుల్ని చూస్తుంది. వీలున్నప్పుడు టెర్రస్ మీదకు వెళ్లి ఎగిరే విహంగాలను చూస్తుంది. ఇంటి పనులు కట్టి పెట్టి ఒక్కోసారి వనాలకు వెళ్లి రంగులీనే పిట్టల్ని చూస్తుంది. ఇంటి ముందు వాటి ముగ్గుల్ని వేసి ముచ్చట పడుతుంది. రొటీన్ జీవితంలో మనసు రెక్క విప్పుకోవాలంటే బర్డ్ వాచింగ్ ఒక అలవాటుగా మార్చుకోమని ప్రచారం చేస్తోంది.

'బర్డ్‌వాచింగ్ చేయాలంటే ఇల్లు విడిచి దూరంగా వెళ్లడం తప్పనిసరి కాదు. మీ బాల్కనీలో కాసేపు కూచుని అక్కడున్న కుండీల దగ్గరకు వచ్చే పిట్టలను చూడండి. వాటి కూతలు వినండి. వాటి కళ్లు, రెక్కలు, తోకలు, గెంతే పద్ధతి, జంటతో వ్యవహరించే తీరు... ఇవన్నీ అబ్జర్వ్ చేయండి. మీ స్ట్రెస్ అంతా ఇట్టే పోతుంది. ఇంతకంటే మంచి హాబీ ఉంటుందా?' అంటుంది విద్యా సుందర్.

తమిళనాడు తిరునల్వేలికి చెందిన విద్యా సుందర్ బెంగళూరులో స్థిరపడింది. గృహిణిగా అందరికీ ఉండే పనులే ఉన్నా ముగ్గులు వేయడం హాబీగా మార్చుకుంది. ముగ్గుల్లో విద్యా సుందర్ చాలా అందంగా బొమ్మలు దించుతుంది. '2012లో నా కొడుకు నన్ను బెంగళూరులోని బర్డ్‌వాచింగ్ గ్రూప్‌కు పరిచయం చేశాడు. అలాంటి ఒక గ్రూప్ ఉంటుందా అని ఆశ్చర్యపోయాను. ఇంటి ముందుకు పిచుకలు, చిలుకలు వంటివి రావడం చిన్నప్పటి నుంచి అందరం చూస్తాం. మళ్లీ ప్రత్యేకంగా చూడటం ఏమిటి? అనుకుంటూ వెళ్లాను. కాని పక్షుల గురించి మనకేమీ తెలియదని... మనతో జీవించే ఒక పెద్ద జాతి గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత, వాటి మనుగడ కోసం చేయాల్సిన సాయం గురించి తెలిశాక ఈ హాబీని నేను వదలదల్చుకోలేదు. అంతే కాదు నాకు వచ్చిన ముగ్గుల కళను ఈ పిట్టల ప్రచారానికి ఉపయోగించడం ప్రారంభించాను. నా ఇంటి ముందు రోజూ ఒక పిట్టబొమ్మ ముగ్గుగా వేయాల్సిందే' అందామె.

ఎందుకు బర్డ్‌వాచింగ్?

ఇది మనసుకు ఆహ్లాదాన్ని ఇచ్చే హాబీ మాత్రమే కాదు. మానవ ఆవాసాల్లో, అడవుల్లో, వనాల్లో వాటి మనుగడకు చేయదగ్గ సాయం గురించి అవసరమైన డేటాను సేకరించే అర్థవంతమైన పని కూడా. 'బెంగళూరు నగరంలో ఏ రుతువులో ఎటువంటి పక్షులు ఉంటాయి. ఏ కాలంలో ఏవి వలస వెళతాయి. ఏవి వస్తాయి. ఏవి ఏ కాలంలో ప్రత్యుత్పత్తికి సిద్ధం అవుతాయి. ఇవన్నీ తెలిస్తే వాటి గూళ్ల నిర్మాణం గురించి, వాటికి అవసరమైన నీటి తావులు, వాటికి అపాయంగా మారే కాలుష్యం గురించి ప్రచారం చేసి వాటిని కాపాడుకోవచ్చు' అంటుంది విద్యా సుందర్. జనావాసాల్లో తిరుగాడే పిట్టలు, మనిషికి దూరంగా ఉండే పక్షులు ఇవన్నీ తెలుసుకుంటూ వెళ్లడం, వాటిని ఫొటోలు తీయడం, వాటి జీవన చక్రాలు తెలుసుకోవడం బర్డ్‌వాచర్స్ ముఖ్యంగా భావిస్తారు. అంత పని చేయలేని వారు వాటిని చూడటం ద్వారా ఆనందం పొందాలనుకుంటారు. వాటిని చూస్తే ఏదో ఒక అటాచ్‌మెంట్ వస్తుంది. వాటికి అపకారం జరిగే పనులు నివారించాలనే ఆలోచన వస్తుంది.

నగరాలు, పట్టణాలు, పల్లెలు... ఆవాసం ఏదైనా అక్కడ ప్రతిచోట బర్డ్‌వాచర్స్ ఉండాల్సిన అవసరాన్ని బర్డ్‌వాచింగ్ గ్రూపులు ప్రచారం చేస్తాయి. ఇటీవల ప్రభుత్వాలు కూడా వివిధ రాష్ట్రాలు 'బర్డ్ వాక్స్'ను ప్రమోట్ చేస్తున్నాయి. (ఇటీవల తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హైదరాబాద్‌లోని బర్డ్‌వాచర్స్‌తో కలిసి నార్సింగిలోని ట్రెక్ పార్క్‌లో బర్డ్‌వాక్ నిర్వహించింది).

■ ఎన్నో పక్షులు

'గ్రామాల్లో ఉన్నవారు ప్రతి పక్షికి ఒక లోకల్ పేరు పెట్టుకుంటారు. ఆ పేర్లు కూడా ఎంతో అందంగా ఉంటాయి. మన పిల్లలకు మాతృభాషలో పిట్టల పేర్లు తెలియడం కూడా ముఖ్యమే. అందుకు బర్డ్‌వాక్స్‌కు వాళ్లను తీసుకెళ్లాలి. సృష్టిలో అసలు ఇన్ని రకాల పిట్టలు ఉన్నాయా అని ఎంత ఆశ్చర్యం వేస్తుందో. కేవలం తేనెటీగలను తినే పిట్టలు, గూళ్లను కట్టడంలో గొప్ప ఇంజనీరింగ్ చూపే పిట్టలు, పాడటంలో ఎంతో మాధుర్యం చూపే పిట్టలు, రంగుల పిట్టలు... వాటిని చూస్తే కలిగే ఆనందం వేరు. టీవీ సీరియల్స్ వల్ల, ఫోన్ వల్ల ఆ ఆనందం రాదు' అంటుంది విద్యా సుందర్.

■ ఈబర్డ్

ఇది గ్లోబల్ ఇంటర్‌నెట్ ప్లాట్‌ఫామ్. ఈబర్డ్‌లో వేలాది మంది బర్డ్‌వాచర్స్ ప్రతి దేశం నుంచి సభ్యులుగా ఉన్నారు. వీరంతా తాము చూసిన పక్షులను, వాటి వివరాలను, వాటి జీవన విధానాలను, అవి ఇష్టపడే ఆవాసాలను తెలుసుకుని ఇక్కడ నమోదు చేస్తుంటారు. ఒక విధంగా డేటాను పోగు చేస్తుంటారు. 'నేను కూడా ఈబర్డ్ ప్లాట్‌ఫామ్ సభ్యురాలినే. ప్రతి నెలా క్రమం తప్పకుండా నేను సేకరించిన డేటాను ఇక్కడ నమోదు చేస్తాను' అంటుంది విద్యా సుందర్.

పక్షిలోకానికి ఇలాంటి స్నేహితులు ఎప్పుడూ అవసరమే.

గెలుపు దారి

హెల్తీ సక్సెస్



కార్పొరేట్ ప్రపంచంలో పది సంవత్సరాలు పనిచేసిన అనుభవంతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తొలి వెంచర్‌కు శ్రీకారం చుట్టింది సౌమ్య మిట్టల్. అయితే తన తొలి వెంచర్ ఫెయిల్ అయింది. అయినా సరే, నిరాశతో నీరుగారిపోకుండా కొద్ది విరామం తరువాత రెండో వెంచర్ స్టార్ట్ చేసి సూపర్ సక్సెస్ అయింది సౌమ్య మిట్టల్...

స్కూల్ రోజుల్లో సౌమ్యను పేరుతో పిలిచేవాళ్లు తక్కువ. 'కొత్త అమ్మాయి' అని పిలిచేవారే ఎక్కువ. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో పుట్టిన సౌమ్య తండ్రి ఉద్యోగ బదిలీల వల్ల దేశవ్యాప్తంగా ఎన్నో పట్టణాల్లో చదువుకుంది.

తొలి ప్రయత్నంలోనే ఇంజినీరింగ్ ఎంట్రెన్స్‌లో ర్యాంకు సాధించిన సౌమ్య ఐఐటీ–దిల్లీలో కెమికల్ ఇంజినీరింగ్ చేసింది.

'ఐఐటీ–దిల్లీ నా జీవితాన్ని మార్చేసింది' అంటుంది సౌమ్య. అక్కడ తాను ఎన్నో విషయాలు నేర్చుకుంది. విశాల ప్రపంచాన్ని చూసింది. చదువు పూర్తయిన తరువాత ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది.

పది సంవత్సరాల ఉద్యోగ జీవితంలో రకరకాల విధులు నిర్వహించింది. ఎనిమిది నెలల మెటర్నిటీ లీవ్ తరువాత తిరిగి ఉద్యోగంలో చేరిన సౌమ్యకు ఉద్యోగం చేయడం కంటే ఏదైనా వెంచర్ మొదలు పెట్టాలనిపించింది. ఇంట్లో వాళ్లు కూడా ప్రోత్సాహకరంగా మాట్లాడారు.

'ఒక ప్రాడక్ట్ ఎప్పుడు సక్సెస్ అవుతుంది?'

ప్రాడక్ట్‌లో సత్తా అనేది ఒక విషయం అయితే... అంతకంటే ముఖ్యం అవసరం లేదా అత్యవసరం!

తొలి వెంచర్ 'పిక్సెల్జ్' ఫెయిల్ కావడానికి 'మస్ట్ ప్రాడక్ట్' అనిపించకపోవడమే కారణం అనే విషయం సౌమ్యకు బోధపడింది. తొలి వెంచర్‌లో ఫెయిలైనప్పటికీ మళ్లీ ఉద్యోగంలో చేరవద్దని గట్టిగా నిర్ణయించుకుంది.

అమెరికాలో ఉండే ఒక ఫిట్‌నెస్ ట్రైనర్‌ని సౌమ్య ఫ్రెండ్ పరిచయం చేసింది. సౌమ్యకు గుండెకు సంబంధించిన చిన్నపాటి సమస్య ఉండడంతో వర్కవుట్‌ల విషయంలో జాగ్రత్తపడడానికి ఫిట్‌నెస్ ట్రైనర్ సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయి. తన ఫిట్‌నెస్ జర్నీలో ట్రైనర్ ప్రాధాన్యత ఏమిటో సౌమ్యకు తెలిసొచ్చింది.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని 'ఫిట్ బడ్' పేరుతో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ కోచ్‌లతో కూడిన గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టింది.

దేశదేశాల క్లయింట్స్, ఫిట్‌నెస్ కోచ్‌లకు మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తోంది ఫిట్ బడ్.


అవసరమైన సమయంలో వచ్చిన ఈ కస్టమర్ రిలేషన్ ప్లాట్‌ఫామ్ సూపర్ హిట్ అయింది. సమగ్రమైన ఫిట్‌నెస్ అండ్ న్యూట్రిషన్ మాడ్యూల్స్, అడ్వాన్స్‌డ్ ట్రాకింగ్ అండ్ ఎనాలటిక్స్, ఇంటరాక్టివ్ చాట్, వీడియో కాలింగ్ సదుపాయాలు 'ఫిట్ బడ్' విజయానికి కారణం అయ్యాయి.

'ఇతరుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడంలో సిగ్గుపడకూడదు. ఏమీ అడగనప్పుడు ఏమీ తెలియదు. దీంతో వ్యాపారంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వ్యాపార ప్రస్థానంలో అతి చిన్న విజయానికైనా సరే పెద్దగా సంతోష పడాలి. ఆ సంతోషమే కొత్తబలాన్ని ఇచ్చి మరిన్ని విజయాలు సాధించేలా చేస్తుంది' అంటుంది సౌమ్య మిట్టల్.

రేపు ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ బుక్ డే

ఆ పుస్తకాలు ఆకుపచ్చ చందమామలు

పిల్లల కథల ప్రపంచంలో అందమైన అడవులు ఉంటాయి. అలరించే జీవజాలం ఉంటుంది. అయితే కాల్పనిక ప్రపంచం దాటి బయటికి వస్తే... పచ్చదనం కరువై అడవులు బోసిపోతున్నాయి. జీవజాలం ప్రమాదం అంచున ఉంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పిల్లల్లో పర్యావరణ స్పృహ కలిగేలా పుస్తకాలు రాస్తోంది బెంగళూరుకు చెందిన రచయిత్రి, క్లైమెట్ వారియర్ బిజల్ వచ్ఛరజని...



రజని రాసిన 'ఏ క్లౌడ్ కాల్డ్ బూరా' 'కిటెన్ ట్రబుల్' 'ఏ బెండ్ ఇన్ టైమ్' 'హెల్ప్ మై ఆయి వాంట్స్ టు ఈట్ మీ' 'ది గ్రేట్ ఇండియన్ నేచర్ ట్రయల్ విత్ అంకుల్ బిల్కీ' 'సో యూ వాంట్ టూ నో ఎబౌట్ ది ఎన్విరాన్‌మెంట్' 'సావి అండ్ ది మెమోరీ కీపర్' పుస్తకాలు పిల్లల్ని ఎంతో ఆకట్టుకున్నాయి.

పిల్లల పుస్తకాలు రాయడంతోపాటు, వారి మనసులో ఏముందో తెలుసుకోవడం అంటే కూడా రజనికి ఇష్టం.

పుస్తకాల్లో చదివిన కథను తమ మాటల్లో అందంగా చెప్పడమే కాదు, ఆ కథల ద్వారా తాము తెలుసుకున్నదేమిటో పిల్లలు చెబుతున్నప్పుడు రజని ఆనందానికి అవధులు ఉండవు.

ప్రకృతిని అమితంగా అభిమానించే గుణం రజనికి తల్లి నుంచి వచ్చింది. ఆమె జంతువుల పట్ల దయతో ఉండేది. వీధుల్లో గాయపడిన శునకాలను ఇంటికి తీసుకువచ్చి సపర్యలు చేసేది.

రజని టీనేజ్‌లో ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు. ఆ విషాద ఒంటరితనంలో ఇంటికి దగ్గరలోని గుల్‌మోహర్ చెట్టే తనకు నేస్తం అయింది. ఆ చెట్టుతో మాట్లాడుతూ ఉండేది. తన ఈ వ్యక్తిగత అనుభవాన్ని 'సావి అండ్ ది మెమోరీ కీపర్' పుస్తకంలోకి తీసుకువచ్చింది రజని. ఈ పుస్తకంలో సావి అనే అమ్మాయికి తండ్రి చనిపోతాడు. ఆ సమయంలో చెట్లే తనకు అండగా ఉంటాయి. చెట్లు తమ వేర్ల ద్వారా ఎలా కమ్యూనికేట్ అవుతాయి...అనే దాని గురించి ఈ పుస్తకంలో చెప్పిన విషయాలు బాల పాఠకులకు బాగా నచ్చాయి.

'సావి అండ్ ది మెమోరీ కీపర్' పుస్తకం బాలసాహిత్య విభాగంలో అట్‌హర్ అవార్డ్–2023కు ఎంపికైంది. రజని ఈ అవార్డ్ తీసుకోవడం ఇది రెండోసారి. 2019లో 'ఏ క్లౌడ్ కాల్డ్ బూరా' పుస్తకానికి ఈ పురస్కారం దక్కింది.



కోస్టారికాలో 'యూనివర్శిటీ ఆఫ్ పీస్'లో ఎన్విరాన్‌మెంట్ సెక్యూరిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసింది రజని. ఈ చదువు ద్వారా తాను తెలుసుకున్న పర్యావరణ సంబంధిత విషయాలను తన దగ్గరే దాచుకోలేదు. 'మ్యాజిక్ రియలిజం' ఫార్మట్‌లో వాటిని పుస్తకాల రూపంలో పిల్లల దగ్గరకి తీసుకువెళ్లింది.

'నేను పగలు పుస్తకాల ప్రచురణకు సంబంధించిన ఎడిటర్‌ని. రాత్రి పుస్తక రచయిత్రిని' అని తన గురించి తాను చెప్పుకుంటుంది రజని.

మరో విషయం ఏమిటంటే రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆమె క్లైమెట్ వారియర్. కాలేజీరోజుల నుంచే పర్యావరణ సంబంధిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. ఆమె రచన విధానం గురించి చెప్పాలంటే... ఒక ఐడియా అనుకొని కాగితంపై క్యారెక్టర్ల బొమ్మలు గీస్తుంది. వాటిని చూస్తూ కథ అల్లుకుంటుంది. పుస్తకంలో అచ్చులోకి వెళ్లేముందు పిల్లల చేత చదివించి వారి అభిప్రాయం తీసుకుంటుంది. 'పరమ బోరుగా ఉంది' అని పిల్లల్లో ఎవరైనా అంటే పుస్తకం తిరగరాయాల్సిందే!

రంజిత్‌లాల్, జాకీ మోరీస్, బుల్‌బుల్ శర్మ, షబ్నమ్ మిన్‌వాలా, పారో ఆనంద్... మొదలైన పిల్లల పుస్తక రచయితల రచనలు అంటే తనకు ఇష్టం. రంజిత్‌లాల్ 'ది టైగర్స్ ఆఫ్ టాబూ వ్యాలీ' పిల్లలు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం అని చెబుతుంది రజని.



'పిల్లల పుస్తకాలలో సందేశాలు తప్పనిసరిగా ఉండాలా?' అనే ప్రశ్నకు ఇలా సమాధానం చెబుతుంది రజని...

'సందేశాల కోసం పుస్తకాలు చదివే పెద్దలు ఉంటారేమోగానీ పిల్లలైతే ఉండరు. వారి మొదటి ప్రాధాన్యత కథ మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకొని సందేశాన్ని అంతర్లీనంగా ఇవ్వాలి తప్ప, సందేశం కోసమే పుస్తకం రాసినట్లుగా ఉండకూడదు'

బాల పాఠకుల నాడి తెలిసిన రజని ప్రసిద్ధ ప్రచురణ సంస్థ హార్పర్‌కొలిన్స్ కోసం 'క్లైమెట్ ఛేంజ్'పై మరో పుస్తకం రాసే పని మొదలు పెట్టింది.

కిచెన్ టిప్

కన్నీళ్లు లేకుండా ఉల్లి కోయాలంటే..

ఉల్లిపాయను సరైన పద్ధతిలో కోస్తే ఎప్పుడూ కన్నీళ్లు రావు. దీని కోసం చేయాల్సిందల్లా ఉల్లి కోసేటప్పుడు పై భాగాన్ని పక్కన పెట్టి ముందు దాన్ని కోసేసి ఆ తర్వాత మిగిలిన భాగాన్ని కోయాలి. లేదంటే తొక్క తీసి కొంత సమయం పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఆ తర్వాత కోస్తే కన్నీళ్లు రావు.



● పేరెంటింగ్

సరైన తీరులోనే పెంచుతున్నారా?



తల్లిదండ్రుల్లో రెండు రకాలవారుంటారు. బాల్యంలో వారు ఏమి కోల్పోయారో, ఇతర పిల్లల్ని చూసి, 'అయ్యో నాకిది లేదే' అనుకున్నారో' అటువంటివన్నీ కూడా తమ బిడ్డకు అందివ్వాలని కోరుకుంటారు. తమకు చదువు లేకపోతే, తమ కొడుకును గొప్పగా చదివించుకోవాలని తాపత్రయపడటమో, సరైన తిండి తను తినలేకపోతే, తమ బిడ్డలకు మంచి మంచి పదార్థాలు తినిపించాలని చూడటమో చేస్తుంటారు. తమకు చదువు అబ్బకపోయినా, తాము కూలి పని చేసుకుని బతుకుతూనో, నాలుగిళ్లలో పాచి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నప్పటికీ తమ పిల్లలను ప్రయోజకులను చేయాలని తపన పడతారు వీరు.

అటువంటి తల్లిదండ్రులకు హ్యాట్సాఫ్

మరొక రకం తల్లిదండ్రులుంటారు. వాళ్లు బాల్యంలో సుఖపడలేదు కాబట్టి తమలాగే బిడ్డలు కూడా సుఖపడకూడదనుకుంటారు. తాము కడుపునిండా తినలేదు కాబట్టి, తమ పిల్లలూ తమ లాగే ఏదో ఒక కూరతో తిని, అర్ధాకలితో ఉండాలని, తాము బస్సుల్లోనూ, కార్లలోనూ తిరగకుండా మైళ్లకొద్దీ నడిచి, బడికి వెళ్లి కష్టపడి చదువుకుని పైకి వచ్చాం... అని గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. తల్లిదండ్రుల ద్వారా ఇటువంటి పరిస్థితులెదుర్కొన్న బిడ్డలు పెరిగి పెద్దయిన తర్వాత, ఏదో ఒక సందర్భంలో వెనక్కి తిరిగి చూసుకుంటారు.

మొదటిరకం తల్లిదండ్రుల ద్వారా వాళ్లనుభవించిన సంతోషకరమైన జీవితం తల్లిదండ్రులు వారికి పంచిన ప్రేమ, త్యాగాలని గ్రహిస్తారు. అలాంటి బిడ్డలు తమ చిన్నతనంలో తమనెలా చూసుకున్నారో తమ తల్లిదండ్రులను వారి వృద్ధాప్యంలో అలాగే చూసుకుంటారు.

ఇక రెండోరకం తల్లిదండ్రులు– ఎక్కడో మారుమూల పల్లెటూళ్లలో పుట్టి, నానా అగచాట్లు పడి తినీ తినకా కష్టపడి పైసాపైసా కూడబెట్టిన తలిదండ్రులకు పుట్టిన మీరు... మీకు పుట్టిన బిడ్డలు ఇంకెంత ఎదుగుతారో ఊహించుకుని ఆ పద్ధతులకు, ఆ పరిస్థితులకు అనుగుణంగా మీ పిల్లలను ఎదగనివ్వండి. సంతోషపడండి. ఆనందించండి.

అంతేగానీ, ప్రతిదానికీ మీతో పోల్చుకుని, అనవసరమైన మాటలు చెప్పి వాళ్లను తికమక పెట్టవద్దు.. మా రోజుల్లో ఇలా తిరిగేవాళ్లం... ఇలా నడిచి వెళ్లే వాళ్లం... ఇలాంటి సాదా చెప్పులనే వేసుకునేవాళ్లం.... అని వాళ్ల సరదాపడేలా చెప్పడంలో తప్పులేదు. అయితే ఏది, ఎప్పుడు, ఎలా చెప్పాలన్నది ఆలోచించి మరీ చెప్పండి. మీరు పడ్డ ఇబ్బందులు, అనుభవించిన కష్టాలు మీ పిల్లలు అనుభవించకూడదనుకోవడంలో తప్పు లేదు అయితే వారిని మరీ ఎండ కన్నెరగని సుకుమారులుగా చూస్తూ కొండమీది కోతిని తెమ్మన్నా తెచ్చి ఇచ్చేందుకు సిద్ధపడ్డారనుకోండి.. అది మంచి పద్ధతి కాదు. అలాగని మీరు కష్టపడ్డారు కాబట్టి మీ పిల్లలూ కష్టపడాలనుకోవడమూ సరికాదు. ప్రస్తుత కాల మాన పరిస్థితులకు, పద్ధతులకు అనుగుణంగా మీ పిల్లల్ని తీర్చి దిద్దడం ఉత్తమం.

● మీకు తెలుసా?

ఇటీవలి కాలంలో రకరకాల పరిమళాలు, స్ప్రేల వినియోగం సర్వసాధారణమైంది. స్త్రీ పురుష భేదం లేకుండా వీటిని అందరూ విరివిగా ఉపయోగిస్తున్నారు.అయితే పెర్ఫ్యూమ్స్ ఎక్కువగా వాడితే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు సూచిస్తున్నారు.పెర్ఫ్యూమ్ ఎక్కువగా వాడే వాళ్లకు చర్మ సంబంధ సమస్యలు వస్తుంటాయి. దీనికితోడు పెర్ఫ్యూమ్ తయారీలో వాడుతున్న రసాయనాలతో మానసిక సమస్యలు కూడా వస్తున్నాయని ఓ సర్వేలో తేలింది. మంచి వాసన వస్తోందని అతిగా పెర్ఫ్యూమ్స్ వాడితే చర్మవ్యాధులతో పాటు ముక్కు, కళ్లు, గొంతు నొప్పి, మతిమరుపు, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల వాడండి కానీ.. అతిగా వద్దు.



లైఫ్@360




ప్లేట్‌లో రెయిన్‌బో

ఆకాశంలో విరిసే ఇంద్ర ధనుస్సును చూసి మురిసిపోని వారెవరు? అందుకే కవులు, రచయితలు కూడా ఇంద్రధనుస్సు గురించి ఎంతో అందంగా వర్ణిస్తుంటారు. రెయిన్‌బో పేరుతో రెస్టారెంట్లు, హోటళ్లు, కాన్వెంట్లు కూడా కనిపిస్తుంటాయి. రెయిన్‌బో డైట్ కూడా ఈ కోవలోకే వస్తుంది. అంటే... రెయిన్ బోలో ఎన్ని రంగులు ఉంటాయో మన ప్లేట్‌లో కూడా అన్ని రంగుల ఆహారపదార్థాలు ఉండేలా చూసుకోవడమే. అలా రెయిన్‌బో డైట్‌లో చేర్చిన రకరకాల రంగుల ఆహారాల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. అవేంటో తెలుసుకుందాం.

రంగులలో ముందు చెప్పుకోవలసినది తెలుపు గురించే. ఎందుకంటే తెలుపులో ఏ రంగయినా ఇట్టే కలిసిపోతుంది కాబట్టి. ముందుగా తెలుపు రంగు ఆహారం గురించి చూద్దాం.

తెలుపు రంగు ఆహారం

ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి, పుట్టగొడుగులు, క్యాలీఫ్లవర్, పాలు, పెరుగు, కొబ్బరి వంటి ఆహారాలు తెలుపు రంగు ఆహారం కిందికి వస్తాయి. ఆహారంలో వీటిని భాగంగా చేసుకోవడం వల్ల కొలెస్ట్రాల్, అధిక రక్త పోటు శరీరంపై దుష్ప్రభావం చూపకుండా అడ్డుకుంటాయి. ఎందుకంటే వాటిలో ఎక్కువ ఫైబర్ ..పొటాషియం ఉంటుంది.



పసుపు రంగు ఆహారం

బొప్పాయి, పైనాపిల్, నిమ్మ, మామిడి, మొక్కజొన్న వంటి పండ్లు ..కూరగాయలలో లభించే బ్రోమెలైన్ పాపైన్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. పసుపు ఆహారాలలో ఉండే లుటీన్ జియాక్సంతిన్ పిగ్మెంట్లు, వయస్సు సంబంధిత వ్యాధులకు వ్యతిరేకంగా ప్రభావం చూపుతాయి.

నారింజ రంగు ఆహారం

నారింజ రంగు పండ్లు ..కూరగాయలలో కెరోటిన్ ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నారింజ, మంచి గుమ్మడి, క్యారెట్లు... పీచ్ వంటివి కంటి చూపుతోపాటు కేశాలకు, చర్మ ఆరోగ్యానికీ కూడా ప్రయోజనకరంగా ఉంటాయి.

నీలం లేదా ఊదా రంగు ఆహారం

బెర్రీలు, ఎర్రటి కూరగాయలు, నల్ల ద్రాక్ష, వంకాయ వంటివి మెదడు సామర్థ్యానికి ప్రోత్సాహకంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే ఆంథోసైనిన్ ..రెస్వెట్రోల్ సమ్మేళనాలు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే, ఇవి జీర్ణవ్యవస్థ పనితీరును కూడా మెరుగుపరుస్తాయి.. శరీరంలో మంటలను, వాపులను తగ్గిస్తాయి.

ఆకుపచ్చ ఆహారం

ఆకుపచ్చ కూరగాయలు ..పండ్లు మనకు ఎంతో మేలు చేస్తాయని ఎప్పటినుంచే వైద్యులు చెబుతున్నమాటే. అవి చాలా యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి మధుమేహం ..గుండె జబ్బులతో పోరాడతాయి. ఇందులో ఫోలేట్..ఐరన్ పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, మీరు మీ ఆహారంలో బచ్చలికూర, మెంతికూర, క్యాబేజీ, బీన్స్, బఠాణీ, బూడిద గుమ్మడి, కీరా, ద్రాక్ష, పచ్చి టొమాటో, పుదీనా చేర్చుకోవాలి.

ఎరుపు రంగు ఆహారం

ఎరుపు రంగులో ఉండే చాలా కూరగాయలు ..పండ్లు మన హృదయానికి మేలు చేస్తాయట.. రెడ్ బెల్ పెప్పర్స్ (ఎరుపు రంగులో ఉండే క్యాప్సికం) దానిమ్మ పండ్లు, టొమాటో, పుచ్చకాయలు, యాపిల్ వంటి వాటిలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది క్యాన్సర్..తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచుతుంది. దీంతోపాటు వాటి ఎరుపు రంగుకు కారణమైన ఆంథోసైనిన్ సమ్మేళనం గుండె కండరాలను బలంగా ఉంచుతుంది.

ఒక రోజులో ఐదు రకాల పండ్లు ..కూరగాయలు.. ఒక వారంలో కనీసం 20 రకాల పండ్లు ..కూరగాయలు తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

హెల్త్ టిప్స్



పుదీనా ఆకులు ఎండబెట్టిన తర్వాత మెత్తగా నూరి ఆ చూర్ణానికి మంచి నీరు కలిపి వెంట్రుకలు రాలిన చోట రాస్తే జుట్టు తిరిగి మొలుస్తుంది. పుదీనా ఆకును కషాయంలా కాచి, దాన్ని గోరువెచ్చని నీటిలో కలుపుకొని స్నానం చేస్తే చర్మ రోగాలు అదుపులోకి వస్తాయి. పుదీనా పచ్చడి తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది.



అరటిపండ్లను పేస్టులా చేసి పాలలో కలిపి తీసుకుంటే నీరసం తగ్గుతుంది.



పొట్టలో వికారంగా ఉంటే మూడు పూటలా ఓ స్పూన్ తేనెను తీసుకోవాలి.



ఫుడ్ పాయిజన్ మూలాన వాంతులు, విరేచనాలు, నీరసం రావడం సహజం. అటువంటప్పుడు కాస్తంత జీలకర్రను నోట్లో వేసుకుని నమిలి ఆ రసాన్ని మింగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

సినిమా



● పూజా హెగ్డే

బతుకమ్మ పాటలో...

బతుకమ్మ పాటలో బుట్టబొమ్మ పూజా హెగ్డే సందడి చేశారు. హిందీ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'లో వచ్చే బతుకమ్మ పండగ నేపథ్యంలో చేసిన సందడి ఇది. సల్మాన్ ఖాన్, పూజా హెగ్డే జంటగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వం వహించిన చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'. ఇందులో వెంకటేశ్ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సినిమాలో తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ పండగ నేపథ్యంలో చిత్రీకరించిన పాటను రిలీజ్ చేశారు. ఈ పాటలో వెంకటేశ్, సల్మాన్ కూడా కనిపిస్తారు. ''తెలంగాణ మహిళలు సంబరంగా చేసుకునే బతుకమ్మ పండుగ పాటలో కనిపించడం హ్యాపీ. సల్మాన్ ఖాన్, వెంకటేశ్, భూమికగార్లతో ఈ పాటలో సందడి చేయడం హ్యాపీ'' అన్నారు పూజా హెగ్డే.



● రవితేజ

దసరా గురి...


పండగ సీజన్ అంటే సినీ ప్రేమికులకు సినిమా సందడి ఉండాల్సిందే. అందుకే పండగ టార్గెట్‌గా సినిమాలను రిలీజ్ చేస్తుంటారు. పండగకి ఐదారు నెలల ముందే రిలీజ్ డేట్ ప్రకటించి, పండగ బెర్త్‌ని కన్ఫార్మ్ చేసేస్తుంటారు. అలా ఈ దసరా పండక్కి బాక్సాఫీస్ పోటీ ఆల్రెడీ మొదలైపోయింది. ఇప్పటికి అధికారికంగా విడుదల తేదీ ప్రకటించి, బాక్సాఫీస్ బరిలో నిలవనున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

తెలంగాణ నేపథ్యంలో...

రాయలసీమ నేపథ్యంలో బాలకృష్ణ హీరోగా నటించిన సినిమాలు చాలానే వచ్చాయి. అయితే తాజాగా పూర్తి స్థాయి తెలంగాణ యాసతో బాలకృష్ణ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఇందులో కాజల్ అగర్వాల్ హీరోయిన్. శ్రీలీల ముఖ్య పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకుడు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరాకి రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.



● రామ్ బోయపాటి



● విజయ్

ఓ గజదొంగ కథ

రవితేజ నటించిన తొలి పాన్ ఇండియా మూవీ 'టైగర్ నాగేశ్వర రావు'. స్టువర్టుపురం దొంగగా చెప్పుకునే టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి వంశీ దర్శకత్వం వహించారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది.

మాస్ ఎనర్జీ

రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ హై ఓల్టేజ్ మాస్ ఫిల్మ్ రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 20న విడుదల కానుంది. కాగా రామ్ కెరీర్‌లో తొలి పాన్ ఇండియా ఫిల్మ్ ఇదే అన్న సంగతి తెలిసిందే.

మాఫియా డ్రామా

'మాస్టర్' (2021) చిత్రం తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'లియో'. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈ సినిమా అక్టోబరు 18న విడుదల కానుంది.

ప్రస్తుతానికైతే దసరా పండక్కి ఈ సినిమాలు కర్చీఫ్ వేశాయి. మరి.. పండగ రేస్‌లో ఫైనల్‌గా ఏ సినిమాలు ఉంటాయనే విషయం రానున్న రోజుల్లో తెలుస్తుంది.

అప్పుడు సంక్రాంతి.. ఇప్పుడు దసరా

హీరోలు రవితేజ, రామ్, విజయ్‌లు నటించిన చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ వద్ద పోటీ పడటం ఇది తొలిసారి కాదు. 2021 సంక్రాంతికి రవితేజ 'క్రాక్', రామ్ 'రెడ్', విజయ్ 'మాస్టర్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డాయి. ఇప్పుడు ఈ ముగ్గురి చిత్రాలు దసరా పోటీలో నిలిచాయి. ఈ మూడు సినిమాలతో పాటు ఇంకెన్ని సినిమాలు దసరా బరిలో నిలుస్తాయో చూడాలి.



మల్లికా.. మల్లికా..

● సమంత

సమంత టైటిల్ రోల్‌లో గుణశేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'మల్లికా మల్లికా మాలతీ మాలికా..' అంటూ సాగే వీడియో సాంగ్‌ని విడుదల చేశారు. ఈ పాటకు చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించగా రమ్య బెహ్రా పాడారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ– ''శాకుంతలం' ప్రివ్యూ చూశాను.. అత్యద్భుతంగా అనిపించింది. ఈ సినిమాలో నాకు ఎంతో ఇష్టమైన పాట 'మల్లికా మల్లికా..'' అన్నారు. గుణశేఖర్ మాట్లాడుతూ– ''మల్లికా మల్లికా..' పాటని రికార్డింగ్ సమయంలో ఎంతగా ఆస్వాదించామో, తెరమీద చూసుకున్నప్పుడు అంతే సంతోషం కలిగింది'' అన్నారు. ''యూత్‌కి బాగా నచ్చే పాట ఇది'' అని నీలిమ గుణ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, అడిషనల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: టబ్బీ.

బాబా వల్ల అవకాశాలు తగ్గాయి!



● మనీషా కొయిరాల

''బాబా' సినిమా పరాజయంతో సౌత్‌లో నాకు అవకాశాలు తగ్గాయి'' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు మనీషా కొయిరాల. రజనీకాంత్, మనీషా జంటగా సురేష్‌కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'బాబా' (2002). ఈ చిత్రం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మనీషా మాట్లాడుతూ – ''తమిళంలో నేను చేసిన చివరి పెద్ద సినిమా 'బాబా'నే. ఈ సినిమా విజయంపై భారీ అంచనాలు ఉండేవి. అయితే ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఈ సినిమా ఫ్లాప్‌తో సౌత్‌లో నా కెరీర్ అయిపోతుందనుకున్నాను. అదే జరిగింది. 'బాబా'కన్నా ముందు సౌత్‌లో చాలా సినిమాలు చేశాను. అయితే ఈ సినిమా పరాజయం వల్ల అవకాశాలు తగ్గాయి. అయితే 'బాబా'ని మళ్లీ విడుదల (రజనీ పుట్టినరోజు డిసెంబర్ 12 సందర్భంగా గత ఏడాది డిసెంబర్ 10న రీ రిలీజ్) చేస్తే, హిట్ కావడం ఆశ్చర్యం అనిపించింది. ఏది ఏమైనా రజనీ సార్‌తో సినిమా చేయడం హ్యాపీ'' అన్నారు.

నా కల నెరవేరింది

– హర్షవర్ధన్



''రావణాసుర' సినిమా ప్రత్యేకంగా ఉంటుంది. సుధీర్ వర్మగారు సౌండింగ్ కొత్తగా ఉండాలనుకుంటారు. సాంగ్స్, నేపథ్య సంగీతం కొత్తగా చేశాం. ఈ సినిమాకి పని చేయడం సవాలుగా అనిపించింది'' అని సంగీతదర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న రిలీజవుతోంది. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ మాట్లాడుతూ– ''రావణాసుర'కి థీమ్ సాంగ్ కావాలని అభిషేక్, సుధీర్ వర్మ గార్లు అడగటంతో ట్యూన్ ఇచ్చాను. అది విని 'రావణాసుర'కి నువ్వే మ్యూజిక్ చేస్తున్నావ్' అనడంతో సర్‌ప్రైజ్‌గా అనిపించింది. రవితేజగారికి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన సినిమాకి పని చేయడంతో నా కల నెరవేరింది. 'రావణాసుర'కి నేను నాలుగు పాటలు, నేపథ్య సంగీతం అందించాను. భీమ్స్‌గారు ఓ ప్రత్యేక పాట చేశారు. సందర్భానుసారమే ఇళయరాజాగారి 'వెయ్యిన్నొక్క జిల్లాల..' పాటని రీమిక్స్ చేశాం. 'అర్జున్ రెడ్డి, జార్జ్ రెడ్డి' తర్వాత 'రావణాసుర' నన్ను మరో మెట్టు ఎక్కిస్తుందని నమ్ముతున్నాను. ప్రస్తుతం 'డెవిల్', 'యానిమల్' (హిందీ) సినిమాలకి సంగీతం అందిస్తున్నాను'' అన్నారు.

అంతర్జాతీయ పురస్కార బలగం



● 'బలగం' పోస్టర్

హాస్య నటుడు వేణు ఎల్దండి దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించారు. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా మార్చి 3న విడుదలై, మంచి విజయం సాధించింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకుంది. లాస్ ఏంజిల్స్ సినిమాటోగ్రఫీ అవార్డ్స్‌లో ఈ చిత్రం బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీతోపాటు బెస్ట్ సినిమాటోగ్రఫీ అవార్డులకు ఎంపికైన విషయాన్ని చిత్రదర్శకుడు వేణు వెల్లడించారు. 'నా బలగం'కు ఇది మూడో అవార్డు. ప్రపంచ వేదికపై బలగం మెరుస్తోంది'' అన్నారు. ఈ అవార్డును ఛాయాగ్రాహకుడు ఆచార్య వేణు, దర్శకుడు వేణు అందుకోనున్నారు.

మీటర్ నవ్వులు పంచుతుంది

– రమేష్ కడూరి



''మీటర్' మంచి ఎంటర్‌టైనర్. తండ్రీ కొడుకుల మధ్య మంచి ఎమోషన్ ఉంటుంది. సినిమా అంతా ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది'' అని డైరెక్టర్ రమేష్ కడూరి అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రూపొందిన చిత్రం 'మీటర్'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా రమేష్ కడూరి మాట్లాడుతూ– ''నాది విజయనగరం జిల్లా గరివిడి మండలం. దర్శకులు బాబీ, గోపీచంద్ మలినేనిగార్ల వద్ద సహాయ దర్శకుడిగా చేశాను. 'మీటర్'తో దర్శకుడిగా పరిచయమవుతున్నాను. కరోనా లాక్ డౌన్ తర్వాత 'మీటర్' ఓకే అయ్యింది. ఈ మూవీలో కిరణ్ వైవిధ్యమైన పోలీసాఫీసర్ పాత్ర చేశారు. సెకండాఫ్‌లో ఓ పది నిమిషాలు ఆయన పాత్ర సీరియస్‌గా ఉంటుంది. ఆ పది నిముషాలు థియేటర్‌లో రఫ్ఫాడిస్తాడు. ఈ సినిమాకి సాయి కార్తీక్ నెక్స్ట్ లెవల్ మ్యూజిక్ ఇచ్చాడు. అనుకున్నదానికంటే బడ్జెట్ ఎక్కువైనా వెనకడుగు వేయని చెర్రీ, రవి శంకర్, నవీన్‌గార్లకు రుణపడి ఉంటాను'' అన్నారు.

నిజమే నే చెబుతున్నా...



● వర్ష, సందీప్ కిషన్

'టైగర్' (2015) చిత్రం తర్వాత హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'ఊరు పేరు భైరవకోన'. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లు. అనిల్‌సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'నిజమే నే చెబుతున్నా' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ రొమాంటిక్ సాంగ్‌ను సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మలపై చిత్రీకరించారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అదించగా, సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, కెమెరా: రాజ్ తోట.

సాక్షి బిజినెస్

శనివారం
1-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,031	58,992
నిఫ్టీ ▲	279	17,360

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	12,150	▲ 137
డోజోన్స్	33,108	▲ 249
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,362	▲ 11
డాక్స్	15,629	▲ 106
షాంఘై	3,273	▲ 12
నికాయ్	28,041	▲ 259

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,751
బంగారం (22 క్యారట్)	59,512
వెండి (కిలో)	71,582

దేశీయంగా ఎల్‌జీ డ్యుయల్ ఇన్వర్టర్ ఏసీ కంప్రెసర్‌ల తయారీ



గ్రేటర్ నోయిడా: మేకిన్ ఇండియా నినాదంలో భాగంగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తమ కొత్త డ్యుయల్ ఇన్వర్టర్ ఏసీ కంప్రెసర్ల తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. దీనిపై సుమారు రూ. 100 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఈ అధునాతన లైన్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10 లక్షల యూనిట్లకు పైగా ఉండనుంది. ఎయిర్ కండీషనర్ల మార్కెట్లో తమ స్థానాన్ని మరింత పటిష్టపర్చుకునేందుకు ఇది ఉపయోగపడగలదని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండీ (తయారీ) హ్యుజిన్ లీ తెలిపారు. స్థానికంగా తయారీ సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా ఇటీవలే తమ పుణే ప్లాంటులో సైడ్-బై-సైడ్ ఫ్రిజ్‌ల తయారీ ప్రారంభించామని లీ వివరించారు.

హెచ్‌ఐవీ ఔషధం తయారీలో అరబిందో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వీఐఐవీ హెల్త్‌కేర్ రూపొందించిన హెచ్‌ఐవీ నివారణ ఔషధం కాబొటిగ్రావిర్ ఎల్‌ఏ జనరిక్ ఔషధం తయారీని అరబిందో ఫార్మా, సిప్లా, వయాట్రిస్ చేపట్టనున్నాయి. యునైటెడ్ నేషన్స్‌కు చెందిన మెడిసిన్స్ పేటెంట్ పూల్ ఈ మేరకు మూడు కంపెనీలతో సబ్‌లైసెన్స్ ఒప్పందాలు చేసుకుంది. ఈ కంపెనీలు ఔషధం అభివృద్ధి, తయారీతోపాటు 90 దేశాలకు సరఫరా చేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నాయుడుపేట్, వైజాగ్ యూనిట్లలో ట్యాబ్లెట్లు, ఇంజెక్టబుల్ డోసుల రూపంలో కాబొటిగ్రావిర్ తయారు చేయనున్నట్టు అరబిందో తెలిపింది. ప్రపంచ డిమాండ్‌ను తీర్చే ఉత్పత్తి సామర్థ్యం కంపెనీకి ఉందని వివరించింది. హెచ్‌ఐవీ నివారణకు ఎక్కువ కాలం పనిచేసే ఇంజెక్టబుల్ ఉత్పాదన తక్కువ, మధ్యస్థాయి ఆదాయ దేశాల్లో అందుబాటులోకి రానుండడం ఇదే తొలిసారి అని అరబిందో వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం జనరిక్ హెచ్‌ఐవీ ఔషధ విభాగంలో కంపెనీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

ఎగుమతుల లక్ష్యం.. 2 ట్రిలియన్ డాలర్లు

- 2030 నాటికి చేరుకోవాలని నిర్దేశం
- ఈకామర్స్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు
- గ్లోబల్ కరెన్సీగా రూపాయి...
- కొత్త విదేశీ వాణిజ్య పాలసీని ప్రకటించిన కేంద్రం



ఎఫ్‌టీపీ 2023ని ఆవిష్కరిస్తున్న వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తదితరులు

న్యూఢిల్లీ: ఎగుమతులను పరుగులు పెట్టించడమే లక్ష్యంగా సమర్థవంతమైన విదేశీ వాణిజ్య పాలసీ (ఎఫ్‌టీపీ)ని భారత్ ఆవిష్కరించింది. 2030 నాటికి దేశ ఎగుమతులను ఏకంగా 2 ట్రిలియన్ డాలర్లకు చేర్చడంతో పాటు రూపాయిని గ్లోబల్ కరెన్సీగా చేయాలని పాలసీలో నిర్దేశించింది. అంతేకాకుండా ఈకామర్స్ ఎగుమతులకు ప్రోత్సాహకాలను అందించాలని కూడా ప్రతిపాదించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ప్రవేశపెట్టిన ఎఫ్‌టీపీ 2023 ప్రకారం రాయితీల జమానా నుండి ప్రోత్సాహకాల దిశగా మారేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఎగుమతిదారులు, రాష్ట్రాలు, జిల్లాలు, భారతీయ మిషన్‌ల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించనున్నారు. లావాదేవీల వ్యయాన్ని తగ్గించడం, మరిన్ని ఎగుమతి హబ్‌లను అభివృద్ధి చేయడం కూడా తాజా పాలసీలో భాగం.

డైనమిక్ పాలసీ...

గతంలో అయిదేళ్లకోసారి ప్రకటించే ఎఫ్‌టీపీల మాదిరిగా కాకుండా ఈసారి ప్రభుత్వం డైనమిక్ అలాగే పరిస్థితులకు అనుగుణంగా స్పందించే పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీకి గడువు ముగింపు అంటూ ఏదీ ఉండదు, ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా పాలసీని సవరిస్తారు. 'ఈ పాలసీకి గడువు తేదీ ఏదీ లేదు, కాలానుగుణంగా మార్పులు చేయడం జరుగుతుంది' అని పాలసీ ఆవిష్కరణ అనంతరం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీటీఎఫ్‌టీ) సంతోష్ సారంగి పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా మన ఎగుమతులు మరిన్ని ప్రాంతాలకు భారీగా విస్తరించే విధంగా వాణిజ్య శాఖ చర్యలు చేపడుతుందని మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. రంగాల వారీగా లేదంటే దేశాల వారీగా దృష్టి పెడతామన్నారు. వచ్చే 4-5 నెలల్లో విదేశాల్లోని భారతీయ మిషన్‌లతో కలిసి వాణిజ్య శాఖ ఈ దిశగా చర్యలు చేపడుతుందని ఆయన వివరించారు. '2030 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకోవాలనేది మా లక్ష్యం. దీన్ని సాధిస్తామన్న నమ్మకం ఉంది. అయితే వస్తు ఎగుమతులు, సేవల ఎగుమతులను అధిగమించాలని మేము భావించడం లేదు' అని మంత్రి వ్యాఖ్యానించారు. శుక్రవారంతో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుండి వస్తు, సేవల ఎగుమతులు 765 బిలియన్ డాలర్లను అధిగమించనున్నాయని డీజీఎఫ్‌టీ తెలిపారు. 2021-22లో ఈ మొత్తం ఎగుమతుల విలువ 676 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

రూపాయికి గ్లోబల్ హోదా...

అంతర్జాతీయ వాణిజ్యంలో మన రూపాయికి కూడా తగిన స్థాయిని కల్పించాలని ఎఫ్‌టీపీ లక్ష్యంగా పెట్టుకుంది. అంటే, విదేశీ వాణిజ్య లావాదేవీలకు రూపాయిల్లో చెల్లింపులు జరిపేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా దేశీ కరెన్సీలో సెటిల్‌మెంట్లకు ఎగుమతి ప్రయోజనాలను కల్పించనున్నారు. 'కరెన్సీపరమైన సంక్షోభాలు, లేదంటే డాలర్లకు కొరత ఉన్న దేశాలతో రూపాయిల్లో వాణిజ్య లావాదేవీలు నిర్వహించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ పేర్కొన్నారు. కాగా, యంత్రపరికరాల ఎగుమతి ప్రోత్సాహక (ఈపీసీజీ) స్కీమ్ అలాగే ముందస్తు అనుమతులకు ప్రతిగా ఎగుమతి బాధ్యతలను (ఈఓ) నెరవేర్చడంలో విఫలమైన ఎగుమతిదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం క్షమాభిక్ష స్కీమ్‌ను కూడా తాజా ఎఫ్‌టీపీలో పొందుపరిచారు. దీని ప్రకారం ఈఓల విషయంలో డిఫాల్ట్ అయిన పెండింగ్ కేసులన్నింటినీ క్రమబద్ధీకరిస్తారు. దీనికోసం మినహాయింపు పొందిన కస్టమ్స్ సుంకాలను, అలాగే 100% వడ్డీతో పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది.

పాలసీలో ఇతర చర్యలు...

- జిల్లాలను ఎగుమతి హబ్‌లుగా చేసేందుకు రాష్ట్రాలు, జిల్లా స్థాయిలో కలిసి పనిచేయడంపై కూడా ఎఫ్‌టీపీ 2023 దృష్టిపెట్టింది.
- యూఏవీ/డ్రోన్స్, క్రయోజనిక్ ట్యాంక్స్, ప్రత్యేక రసాయనాల వంటి ద్వంద్వ వినియోగ హై ఎండ్ ఉత్పత్తులు, టెక్నాలజీల ఎగుమతుల కోసం సరళమైన పాలసీలపై దృష్టిసారిస్తారు.
- ఈకామర్స్ ఎగుమతులకు ఎగుమతి ప్రయోజనాలను ప్రత్యేకంగా అందించాలని పాలసీ నిర్దేశించింది. కొరియర్ ద్వారా ఎగుమతుల విలువ పరిమితిని రెండింతలు చేస్తూ, ఒక్కో కన్‌సైన్‌మెంట్‌ను రూ.10 లక్షలకు చేర్చనున్నారు. కాగా, ఈకామర్స్ అగ్రిగేటర్లకు స్టాకింగ్, కస్టమ్స్ అనుమతులు, రిటర్న్‌ల ప్రక్రియను సులభతరం చేసేందుకు గిడ్డంగి సదుపాయంతో కూడిన ప్రత్యేక జోన్‌ను ఏర్పాటు చేయనున్నారు. 2030 నాటికి ఈకామర్స్ ఎగుమతులు 200-300 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతాయని అంచనా.
- అన్ని రకాల బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు (బీఈవీ), వర్టికల్ సాగు యంత్రాలు, మురుగు నీటి శుద్ధి, రీసైక్లింగ్, వర్షపు నీటి ఫిల్లర్లు, గ్రీన్ హైడ్రోజన్‌లను పర్యావరణహిత టెక్నాలజీ ఉత్పత్తుల్లోకి చేర్చారు. తద్వారా ఈపీసీజీ స్కీమ్ ప్రకారం వీటిపై ఎగుమతి పరమైన నియంత్రణలు తగ్గుతాయి.

ఆచరణాత్మక పాలసీ..

ఎఫ్‌టీపీ 2023ని కార్పొరేట్ వర్గాలు స్వాగతించాయి. ప్రపంచ వాణిజ్యంలో భారత వాటాను పెంచేలా ఆచరణాత్మక, సానుకూలమైన పాలసీగా పరిశ్రమ చాంబర్లు, ఎగుమతిదారులు దీన్ని అభివర్ణించారు. 2 ట్రిలియన్ డాలర్ల వస్తు, సేవల ఎగుమతి లక్ష్యాన్ని సాధించేలా అనేక వినూత్న చర్యలను పాలసీలో ప్రకటించారని భారతీయ పరిశ్రమల సమాఖ్య డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. ఈ కొత్త పాలసీ అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ వాటాను భారీగా పెంచేందుకు దోహదం చేస్తుందని అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్ సూద్ వ్యాఖ్యానించారు.

లాభాలతో వీడ్కోలు..!

సెన్సెక్స్ 1,031 పాయింట్లు, నిఫ్టీ 279 పాయింట్ల లాభం



ముంబై: 2022-23 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్లు లాభాలతో వీడ్కోలు పలికాయి. ఆఖరు రోజైన శుక్రవారం ... కీలక సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలు సుమారు 2 శాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 1,031 పాయింట్లు పెరిగి దాదాపు 58,992 వద్ద, నిఫ్టీ 279 పాయింట్లు పెరిగి సుమారు 17,360 వద్ద క్లోజయ్యాయి. 'దలాల్ స్ట్రీట్‌లో బుల్స్ కొనుగోళ్లకు ఎగబడటంతో ప్రధాన సూచీలు సైకలాజికల్‌గా కీలక స్థాయికి ఎగువన ముగిశాయి. తద్వారా 2023 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్లు లాభాలతో వీడ్కోలు పలికాయి. అమెరికా, యూరప్ బ్యాంకింగ్ రంగ సంక్షోభంపై ఆందోళనలు తగ్గుముఖం పడుతుండటం ఈ ర్యాలీకి దోహదపడింది. తక్కువ ధరల్లో దొరుకుతున్న షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ముందుకొచ్చారు' అని కోటక్ సెక్యూరిటీస్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ అమోల్ అథవాలే తెలిపారు.

రిలయన్స్ జోష్..

ప్రధాన సూచీల షేర్లలో రిలయన్స్ షేరు అత్యధికంగా 4 శాతం ఎగిసి రూ. 2,331 వద్ద క్లోజయ్యింది. నెస్లే, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, టీసీఎస్ మొదలైనవి లాభపడ్డాయి.

2022-23లో రూ. 5.86 లక్షల కోట్లు ఆవిరి..

గత ఆర్థిక సంవత్సరం దేశీ మార్కెట్లు.. అధిక ద్రవ్యోల్బణం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, అధిక వడ్డీ రేట్ల వంటి పలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాయి. దీంతో 2022-23లో ఇన్వెస్టర్ల సంపద రూ. 5.86 లక్షల కోట్ల మేర కరిగిపోయింది. బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 2,58,19,896 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ తీరుతెన్నులను పరిశీలిస్తే.. 2022 జూన్ 17న సెన్సెక్స్ ఏడాది కనిష్ట స్థాయి 50,921 పాయింట్లకు తగ్గింది. డిసెంబర్ 1న ఆల్ టైమ్ గరిష్టం 63,583 పాయింట్లకు ఎగిసింది. డిసెంబర్ 14న బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 291.25 లక్షల కోట్ల రికార్డు స్థాయికి పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏకంగా రూ. 15.77 లక్షల కోట్ల వేల్యుయేషన్‌తో అగ్రస్థానంలో నిల్చింది. టీసీఎస్ (రూ. 11.73 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ. 8.98 లక్షల కోట్లు) తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

చిన్న పొదుపులకు పెద్ద ఊరట

ఏప్రిల్ 1 నుంచి వడ్డీరేట్ల పెరుగుదల



న్యూఢిల్లీ: ఎకానమీలో వడ్డీ రేట్ల పెరుగుదల పరిణామాలు చిన్న పొదుపుదారులకు మేలు చేకూర్చుతున్నాయి. 2023 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి సంబంధించి పలు పోస్టాఫీసు పొదుపు పథకాలపై వడ్డీరేట్లను 0.1 శాతం నుంచి 0.7 శాతం వరకూ పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. మే నెల నుంచి ఆర్‌బీఐ రెపో రేటును వరుసగా ఆరుసార్లు 2.5 శాతం పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి ఎగసింది. ఇది బ్యాంకులు అటు రుణ రేట్లు-ఇటు డిపాజిట్ రేట్ల పెరుగుదలకు దారితీస్తోంది. రానున్న త్రైమాసికానికి సంబంధించి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), సేవింగ్స్ డిపాజిట్ల వడ్డీరేట్లు వరుసగా 7.1%, 4 శాతాలుగా కొనసాగించినప్పటికీ, ఇతర సేవింగ్స్ పథకాలపై రేట్లు 0.1% నుంచి 0.7% మధ్య పెరిగాయి. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై (ఎన్‌ఎస్‌సీ)పై అత్యధికంగా వడ్డీరేటు పెరిగింది.

పథకాల వారీగా రేట్ల పెరుగుదల (శాతాల్లో)

పథకం	కొత్త వడ్డీ	పాత వడ్డీ
ఎన్‌ఎస్‌సీ	7.7	7
సుకన్యా సమృద్ధి	8	7.6
సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్	8.2	8
కిసాన్ వికాస్ పత్ర	7.5	7.2
ఏడాది టర్మ్ డిపాజిట్	6.8	6.6
రెండేళ్ల టర్మ్ డిపాజిట్	6.9	6.8
మూడేళ్ల టర్మ్ డిపాజిట్	7	6.9
ఐదేళ్ల టర్మ్ డిపాజిట్	7.5	7
నెలవారీ ఆదాయ పథకం	7.4	7.1

సాక్షి స్పోర్ట్స్

రష్యా, బెలారస్ టెన్నిస్ ఆటగాళ్లపై నిషేధం ఎత్తివేసిన 'వింబుల్డన్' నిర్వాహకులు

ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం నేపథ్యంలో గత ఏడాది రష్యా, బెలారస్ టెన్నిస్ క్రీడాకారులపై ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ క్లబ్ నిషేధం విధించింది. దాంతో ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రష్యా, బెలారస్ క్రీడాకారులు పాల్గొనలేకపోయారు. అయితే ఈ ఏడాది రష్యా, బెలారస్ క్రీడాకారులపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేస్తున్నామని, వారు తటస్థ క్రీడాకారుల హోదాలో పాల్గొనవచ్చని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ తెలిపింది. దాంతో పురుషుల విభాగంలో స్టార్స్ మెద్వెదెవ్, రుబ్లెవ్, ఖచనోవ్ (రష్యా), మహిళల విభాగంలో విక్టోరియా అజరెంకా, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అరీనా సబలెంకా (బెలారస్) వింబుల్డన్‌లో ఆడేందుకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ జూలై 3 నుంచి 16 వరకు జరుగుతుంది.

సెమీస్‌లో సింధు



మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు 21-14, 21-17తో మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. నేడు జరిగే సెమీఫైనల్లో యో జియా మిన్ (సింగపూర్)తో సింధు ఆడుతుంది.మరోవైపు ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. టాప్ సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 18-21, 15-21తో ఓడిపోయాడు.

న్యూజిలాండ్‌దే సిరీస్

ప్రపంచకప్ బెర్త్ కోసం క్వాలిఫయింగ్ టోర్నీలో శ్రీలంక



హామిల్టన్: శ్రీలంకతో జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. తొలి వన్డేలో కివీస్ గెలవగా... రెండో వన్డే రద్దయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 41.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (57; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హెన్రీ (3/14), షిప్లే (3/32), మిచెల్ (3/32) లంకను దెబ్బ తీశారు. అనంతరం న్యూజిలాండ్ 32.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసి గెలిచింది. విల్ యంగ్ (86 నాటౌట్; 11 ఫోర్లు), నికోల్స్ (44 నాటౌట్; 5 ఫోర్లు) ఐదో వికెట్‌కు వంద పరుగులు జోడించారు. ఈ సిరీస్ ఓటమితో శ్రీలంక ఈ ఏడాది భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించే అవకాశం కోల్పోయింది. ప్రపంచకప్ బెర్త్ కోసం జూన్-జూలైలో క్వాలిఫయింగ్ టోర్నీలో శ్రీలంక ఆడుతుంది.

గుజరాత్ ఘనంగా...

- తొలి మ్యాచ్‌లో గెలిచిన టైటాన్స్
- 5 వికెట్లతో చెన్నై ఓటమి
- మెరిసిన శుబ్‌మన్ గిల్


గిల్


రుతురాజ్


రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్

అహ్మదాబాద్: ఐపీఎల్-2023ని డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఘనంగా ప్రారంభించింది. దాదాపు ఏకపక్షంగా సాగిన సీజన్ తొలి పోరులో ధోని సేనపై పాండ్యా బృందం విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై భారీ అభిమాన సందోహం మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 5 వికెట్ల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. సిక్సర్ల వర్షం కురిపించిన రుతురాజ్ గైక్వాడ్ (50 బంతుల్లో 92; 4 ఫోర్లు, 9 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రషీద్ ఖాన్ (2/26), షమీ (2/29), అల్జారి జోసెఫ్ (2/33) రాణించారు. అనంతరం గుజరాత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (36 బంతుల్లో 63; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

రుతురాజ్ మినహా...

చెన్నై మొత్తం ఇన్నింగ్స్‌లో రుతురాజ్ ప్రదర్శనే హైలైట్‌గా నిలిచింది. ఇతర బ్యాటర్లంతా విఫలం కాగా అతనొక్కడే ఈ స్కోరులో కీలకపాత్ర పోషించాడు. షమీ చక్కటి బంతితో కాన్వే (1)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో చెన్నై తొలి వికెట్ కోల్పోయింది. ఐపీఎల్‌లో షమీకి ఇది 100వ వికెట్. ఐర్లాండ్ నుంచి ఐపీఎల్‌లో ఆడిన తొలి క్రికెటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న జోష్ లిటిల్ తన తొలి ఓవర్లో 15 పరుగులు సమర్పించుకున్నాడు. షమీ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో దూకుడు ప్రదర్శించిన మొయిన్ అలీ (17 బంతుల్లో 23; 4 ఫోర్లు, 1 సిక్స్)ని రషీద్ అవుట్ చేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 51/2కు చేరింది. పాండ్యా ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన రుతురాజ్... జోసెఫ్ ఓవర్లో మరింత చెలరేగి 3 సిక్స్‌లు బాదడం విశేషం. ఈ క్రమంలో 23 బంతుల్లోనే అతని అర్ధసెంచరీ పూర్తయింది. ఒకవైపు రుతురాజ్ చెలరేగినా... మరోవైపు బెన్ స్టోక్స్ (7), అంబటి రాయుడు (12) తక్కువ వ్యవధిలో పెవిలియన్ చేరారు. ఈ దశలో గుజరాత్ చక్కటి బౌలింగ్‌తో పరుగులు ఇవ్వకుండా కట్టడి చేసింది. సెంచరీ దిశగా వెళుతున్న రుతురాజ్‌తో పాటు జడేజా (1)ను కూడా ఒకే ఓవర్లో జోసెఫ్ వెనక్కి పంపించాడు. శివమ్ దూబే (19) ప్రభావం చూపలేకపోగా, ఆఖరి ఓవర్లో ధోని (14 నాటౌట్) వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి జట్టుకు చెప్పుకోదగ్గ స్కోరు అందించాడు.

రాణించిన గిల్...

తుషార్ వేసిన రెండో ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టి ఛేదనను వృద్ధిమాన్ సాహా (16 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా మొదలు పెట్టినా... తొలిసారి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న రాజ్‌వర్ధన్ మొదటి ఓవర్లోనే అతను వెనుదిరిగాడు. అయితే మరో ఎండ్‌లో గిల్ కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ (17 బంతుల్లో 22; 3 ఫోర్లు) కూడా కొద్దిసేపు గిల్‌కు సహకరించాడు. జడేజా ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి గిల్ 30 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అయితే తక్కువ వ్యవధిలో సుదర్శన్, పాండ్యా (8), గిల్ వికెట్లు కోల్పోయి గుజరాత్ కష్టాల్లో పడింది. ఈ దశలో విజయ్ శంకర్ (21 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివరి 2 ఓవర్లలో 23 పరుగులు చేయాల్సి ఉండగా తెవాటియా (15 నాటౌట్), రషీద్ ఖాన్ (10 నాటౌట్) కలిసి 2 ఫోర్లు, 2 సిక్సర్లతో జట్టును గెలిపించారు.

ఇరు జట్లకూ 'ఇంపాక్ట్'

సీజన్ తొలి మ్యాచ్‌లోనే కొత్త నిబంధన 'ఇంపాక్ట్ ప్లేయర్'ను ఇరు జట్లు వాడుకున్నాయి. చెన్నై జట్టు బ్యాటింగ్ ముగించుకున్న అంబటి రాయుడును ఫీల్డింగ్ సమయంలో తప్పించి అతనికి బదులుగా పేస్ బౌలర్ తుషార్ పాండేను బరిలోకి దించింది. గుజరాత్ టీమ్ కూడా ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన కేన్ విలియమ్సన్ స్థానంలో టాపార్డర్ బ్యాటర్ సాయి సుదర్శన్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా టీమ్‌లోకి తీసుకుంది.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × కోల్‌కతా (మ. గం. 3:30 నుంచి)
లక్నో × ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

అరిజిత్ పాట... రష్మిక, తమన్నా ఆట!


రష్మిక

ఐపీఎల్‌లో తొలి మ్యాచ్‌కు ముందు ఆరంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ గాయకుడు అరిజిత్ సింగ్ మధురమైన గొంతుతో తన కొన్ని అత్యుత్తమ హిట్ సాంగ్స్‌ను పాడుతూ ప్రేక్షకులను ఉత్సాహపరిచాడు. కేసరియా, చన్నా మేరేయా, తూ మేరా కోయీనా, పఠాన్ తదితర పాటలతో పాటు '83' సినిమాలోని స్ఫూర్తిదాయక పాట 'లహరాదో' వచ్చినప్పుడు త్రివర్ణ పతాకాలతో అభిమానులు తమ ఆనందాన్ని ప్రదర్శించారు. ఇద్దరు హీరోయిన్లు రష్మిక మంధాన, తమన్నా భాటియా చేసిన డ్యాన్స్ ప్రదర్శనలతో 'హౌస్‌ఫుల్' స్టేడియం ఊగిపోయింది. తమిళ హిట్ 'తమ్ తమ్', పుష్ప సినిమాలోని 'ఊ అంటావా'తో పాటు లవ్ యాత్రి సినిమాలోని



గుజరాతీ డాండియా పాట 'రంగీలా తారా'కు డ్యాన్స్ చేసినప్పుడు హర్షధ్వానాలతో ప్రేక్షకులు హోరెత్తించారు. రష్మిక తన హిట్ సాంగ్స్ సామీ, శ్రీవల్లిలకు డ్యాన్స్ చేయడంతో పాటు ఆస్కార్ విజేత 'నాటు నాటు' పాటకూ నర్తించింది. ఆ స్టెప్పులకు ఫ్యాన్స్ అంతా తాము పదం కలిపి జత చేరారు! అనంతరం ప్రత్యేక వాహనాల్లో ధోని, పాండ్యా వేదిక వద్దకు వచ్చారు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో గుజరాత్ కెప్టెన్ పాండ్యా ఐపీఎల్ ట్రోఫీని తీసుకొచ్చి వేదికపై ఉంచాడు. ఈ ప్రారంభోత్సవానికి మందిరా బేడీ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ కార్యక్రమంలో జోష్ నింపింది.


తమన్నా

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: కాన్వే (బి) షమీ 1; రుతురాజ్ (సి) గిల్ (బి) జోసెఫ్ 92; మొయిన్ అలీ (సి) సాహా (బి) రషీద్ 23; స్టోక్స్ (సి) సాహా (బి) రషీద్ 7; రాయుడు (బి) లిటిల్ 12; దూబే (సి) రషీద్ (బి) షమీ 19; జడేజా (సి) శంకర్ (బి) జోసెఫ్ 1; ధోని (నాటౌట్) 14; సాన్‌ట్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-14, 2-50, 3-70, 4-121, 5-151, 6-153, 7-163. **బౌలింగ్:** షమీ 4-0-29-2, పాండ్యా 3-0-28-0, లిటిల్ 4-0-41-1, రషీద్ 4-0-26-2, జోసెఫ్ 4-0-33-2, యష్ 1-0-14-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) దూబే (బి) రాజ్‌వర్ధన్ 25; గిల్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 63; సుదర్శన్ (సి) ధోని (బి) రాజ్‌వర్ధన్ 22; పాండ్యా (బి) జడేజా 8; విజయ్‌శంకర్ (సి) సాన్‌ట్నర్ (బి) రాజ్‌వర్ధన్ 27; రాహుల్ తెవాటియా (నాటౌట్) 15; రషీద్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (19.2 ఓవర్లలో 5 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-37, 2-90, 3-111, 4-138, 5-156. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-29-0, తుషార్ దేశ్‌పాండే 3.2-0-51-1, రాజ్‌వర్ధన్ 4-0-36-3, సాన్‌ట్నర్ 4-0-32-0, జడేజా 4-0-28-1.

క్లుప్తంగా...

ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగాలు

- 100 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల ఉద్యోగాలు
- ఏప్రిల్ 10 నుంచి దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: ఉత్తర మండల డిస్కంలో 100 ఉద్యోగాల భర్తీకి ప్రకటన వెలువడింది. డిగ్రీ, తత్సమాన విద్యార్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండి ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సర్టిఫికెట్ పొందిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 18–44 ఏళ్లలోపు వయసున్న వారు ఏప్రిల్ 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 29 తుది గడువని, మే 22 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మే 28న రాతపరీక్ష ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలు, దరఖాస్తుల సమర్పణకు http://tsnpdcl.cgg.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

కలప స్మగ్లింగ్‌పై ఫ్రెంచ్ వెబ్‌సిరీస్

సాక్షి, హైదరాబాద్: తెలుగు పాత్రికేయుడు ఉడుముల సుధాకర్‌రెడ్డి రచించిన 'బ్లడ్ సాండర్స్ ది గ్రేట్ ఫారెస్ట్ హీస్ట్' అనే పుస్తకం ఆధారంగా ఫ్రెంచ్ వెబ్‌సిరీస్‌ను రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విలువైన కలప స్మగ్లింగ్ కేసులకు సంబంధించి ఇంటర్‌పోల్ వెతుకుతున్న కరడుగట్టిన ఎర్రచందనం స్మగ్లర్ షాహుల్ హమీద్ చేసిన పర్యావరణ నేరాలపై 'ప్లానెట్ కిల్లర్స్–ఎగ్జిక్యూషనర్ ఆఫ్ ఫారెస్ట్స్' అనే వెబ్‌సిరీస్ ఎపిసోడ్ ఫ్రెంచ్ టీవీలో ఏప్రిల్ 3న ప్రసారం కానుంది. ప్రీమియర్స్ లిగ్నెస్ అనే స్వతంత్ర నిర్మాణ సంస్థ రూపొందించిన ఈ సిరీస్‌కు హ్యూగోవాన్ ఆఫెల్ దర్శకత్వం వహించగా, మార్టిన్ బౌడోట్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సిరీస్ డైరెక్టర్ హ్యూగోవాన్ ఆఫెల్ మీడియాతో మాట్లాడుతూ విలువైన ఎర్రచందనం కలప ఏపీలోని శేషాచలం, వెలిగొండ, లంకమల, పాలకొండ అడవుల్లో లభిస్తుందని తెలిపారు. ఈ కలపకు చైనా, జపాన్‌లలో భారీ డిమాండ్ ఉందని వివరించారు.

బీడీఎల్‌కు ఆకాశ్ క్షిపణుల తయారీ కాంట్రాక్ట్

రక్షణశాఖ నుంచి రూ.8,161 కోట్ల ఆర్డర్

సాక్షి, హైదరాబాద్: భారత ఆర్మీ అమ్ములపొదిలో కీలక అస్త్రమైన ఆకాశ్ క్షిపణుల తయారీ కాంట్రాక్ట్ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)కు దక్కింది. రూ.8161 కోట్ల విలువైన క్షిపణుల తయారీ ఆర్డర్‌కు సంబంధించి రక్షణ శాఖ, బీడీఎల్ మధ్య గురువారం న్యూఢిల్లీలో ఒప్పందం కుదిరినట్లు బీడీఎల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఆర్మీకి చెందిన మూడు, నాలుగు రెజిమెంట్లకు ఈ క్షిపణులను బీడీఎల్ సమకూర్చనుంది. భారీ ఆర్డర్ రావడంపై బీడీఎల్ చైర్మన్, ఎండీ సిద్ధార్థమిశ్రా సంతోషం వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో ఆకాశ్ క్షిపణుల తయారీ అవకాశం రావడం భారత ఆర్మీతోపాటు బీడీఎల్‌కు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సాగర్ నుంచి నీటిని తరలించొద్దు

ఏపీ ప్రభుత్వానికి కేఆర్ఎంబీ లేఖ

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి నీటి విడుదలను నిలిపివేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఏపీ ఈఎన్‌సీకి కేఆర్ఎంబీ శుక్రవారం లేఖ రాసింది. నాగార్జునసాగర్ జలాశయంలో నీటిమట్టం 531.10 అడుగులకు చేరిన నేపథ్యంలో కుడి కాలువ నుంచి నీటిని నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని లేఖలో ప్రస్తావించింది. సాగర్‌లో నీటి నిల్వలు తగ్గితే సాగునీటితో పాటు జంటనగరాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొంది.

'క్రిటికల్ ఇన్‌ఫ్రా'గా విద్యుత్ విభాగాలు

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం కింద ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ప్రసార సంస్థ (ట్రాన్స్‌కో) పరిధిలోని లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎల్డీసీ)కి సంబంధించిన సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ (స్కాడా) సిస్టం, రెన్యువబుల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టం (ఆర్ఈఎంసీ), యూనిఫైడ్ రియల్ టైమ్ డైనమిక్ స్టేట్ మెజర్మెంట్ (యూఆర్టీడీఎస్ఎం) సిస్టం విభాగాలను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం–2000 కింద క్రిటికల్ ఇన్ఫర్మేషన్ సదుపాయాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విభాగాలకు చెందిన కంప్యూటర్ వనరులకు ఐటీ చట్టం కింద రక్షణ కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఈ విభాగాలకు చెందిన కంప్యూటర్లతో కేవలం అనుమతి కలిగిన అధికారులు, సిబ్బంది మాత్రమే యాక్సెస్ కలిగి ఉంటారు. ఈ మూడు విభాగాలకు చెందిన కంప్యూటర్లతో లోడ్ డిస్పాచ్ సెంటర్ అధినేత నుంచి అనుమతి పొందిన ఉద్యోగులు, లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు సంబంధించిన కాంట్రాక్టు మేనేజ్డ్ సర్వీస్ ప్రొవైడర్/థర్డ్ పార్టీ వెండర్స్ సభ్యులు, బయటి కన్సల్టెంట్స్, రెగ్యులేటర్, ప్రభుత్వ అధికారులు, ఆడిటర్లు, ఎల్డీసీ అనుమతి పొందిన ఇతర భాగస్వాములు మాత్రమే యాక్సిస్ సదుపాయం కలిగి ఉంటారు.

పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వ కార్యాలయాల్లోనే పెట్టాలని నిబంధనలు

కానీ ఇష్టారాజ్యంగా ప్రైవేటు ప్రాంతాల్లో నిర్వహణ

ఎక్కడ పడితే అక్కడ నమోదు కేంద్రాలు

ఇదిగో ఆధారం!

ఈ ఫొటోలో కనిపిస్తున్నది తాత్కాలిక ఆధార్ నమోదు కేంద్రం. జోగుళాంబ గద్వాల జిల్లా మానోపాడ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిరునామాలో ఈ కేంద్రాన్ని నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. కానీ ఈ కేంద్రం నిర్దేశించిన చోటు కాకుండా ఓ ప్రైవేటు దుకాణంలో నిర్వహిస్తున్నారు.



సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆధార్ నమోదు కేంద్రాల నిర్వహణ గాడితప్పింది. కేవలం బడి పిల్లల కోసం పాఠశాల ఆవరణలో మాత్రమే నిర్వహించాల్సిన ఈ కేంద్రాలు బహిరంగ మార్కెట్లో ప్రైవేటు ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడం... వాస్తవాలను గుర్తించినప్పటికీ పట్టనట్లు ఉండడంతో ఈ కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను గాలికొదిలేసిన నిర్వాహకులు... ఇష్టారీతిన నూతన ఆధార్ నమోదు, సవరణ ప్రక్రియను సాగిస్తున్నారు. దీంతో ప్రజా సమాచార గోప్యతకు భంగం వాటిల్లుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నూతన ఆధార్ కార్డుల జారీ, ఇప్పటికే జారీ చేసిన కార్డులకు సంబంధించి సవరణ తదితర సేవలను అందించాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ సరికొత్త కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఏకంగా పాఠశాల ఆవరణలోనే ఈ కేంద్రాలను ఏర్పాటు చేసి లక్ష్యసాధన పూర్తయ్యే వరకు అక్కడే కొనసాగించేలా కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా రెండు ప్రైవేటు ఏజెన్సీలను ఎంపిక చేసిన పాఠశాల విద్యాశాఖ... ఏజెన్సీల వారీగా జిల్లాలను నిర్దేశిస్తూ నమోదు, సవరణ, అప్‌డేషన్ కోసం ప్రత్యేకంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లను కేటాయించింది. ఈ నేపథ్యంలో ఒక ఏజెన్సీకి 20 జిల్లాల బాధ్యతలను అప్పగిస్తూ 526 ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లు ఇవ్వగా... మరో ఏజెన్సీకి 13 జిల్లాల బాధ్యతలు అప్పగిస్తూ 350 ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లను ఇచ్చింది. ఈ ఏజెన్సీలు క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారుల సమన్వయంతో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు గతేడాది డిసెంబర్‌లో వెలువడగా... ఈ ఏడాది జనవరి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.

33 జిల్లాల్లో 876 ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లు...

నిబంధనలు గాలికి...

ప్రతి విద్యార్థికి చేరువలో ఆధార్ సర్వీసులను అందించాలనే లక్ష్యంతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు నిబంధనలను ఏజెన్సీలు గాలికి వదిలేశాయి. క్షేత్రస్థాయిలో ఆపరేటర్లు, సూపర్‌వైజర్లను ఎంపిక చేసి వేతన చెల్లింపులతో నమోదు/సవరణ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. కానీ కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా క్షేత్రస్థాయిలో ఆసక్తి ఉన్న వారికి ఏజెన్సీలు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లను ఇచ్చేశాయి. దీంతో కిట్లు పొందిన వారు ఈ కేంద్రాలను ప్రైవేటు ప్రాంతాలకు తరలించారు. ప్రభుత్వ అధికారి సమక్షంలో కొనసాగాల్సిన ఈ కేంద్రాలు ఇప్పుడు అంగట్లో సరుకుగా ఎక్కడపడితే అక్కడ నిర్వహిస్తున్నారు.



➤ ఈ ఫొటోలో కనిపిస్తున్నది కూడా ఆధార్ నమోదు కేంద్రమే. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఓ ప్రైవేటు భవనంలో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల పరిధిలో నిర్వహించాల్సి ఉండగా ప్రైవేటు భవనంలో ఎలాంటి పర్యవేక్షణ లేకుండా కొనసాగిస్తున్నారు.

పర్యవేక్షణకు మంగళం పాడారు...



ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న కేంద్రాల్లో ప్రతి దరఖాస్తునూ సంబంధిత పర్యవేక్షణ అధికారి వెరిఫై చేసిన తర్వాతే ఆమోదిస్తాం. కానీ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన కిట్లతో నిర్వహిస్తున్న కేంద్రాలు ఇష్టానుసారంగా నడుస్తున్నాయి. పర్యవేక్షణ లేకపోవడం, దరఖాస్తుల పరిశీలన కొరవడడంతో ఆధార్‌లో పొరపాట్లకు అవకాశం ఉంటుంది.

– బైర శంకర్, రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ మీసేవ ఫెడరేషన్

పసుపు రంగులో బోర్డు.. 'పసుపు బోర్డు'!

- నిజామాబాద్, పరిసర ప్రాంతాల్లో ఫ్లెక్సీల కలకలం
- ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఉద్దేశిస్తూ ఏర్పాటు

సుభాష్‌నగర్ (నిజామాబాద్)/డిచ్‌పల్లి: పసుపు రంగులో పెద్ద ఫ్లెక్సీ.. దానిపై 'పసుపు బోర్డు' అని పెద్ద అక్షరాలు. కాస్త దిగువన 'ఇది మా ఎంపీగారు తెచ్చిన పసుపు బోర్డు' అంటూ వ్యాఖ్య.. శుక్రవారం ఉదయం నిజామాబాద్ నగరంలోని ప్రధాన కూడళ్లలో, డిచ్‌పల్లి మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్, 44వ నంబర్ జాతీయ రహదారి నాగ్‌పూర్ గేట్ సమీపంలో కలకలం రేపిన ఫ్లెక్సీలు ఇవి. గత లోక్‌సభ ఎన్నికల ముందు.. తనను గెలిపిస్తే నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డును తెస్తానని బీజేపీ నేత, ఎంపీ ధర్మపురి అరివ్డ్ రైతులకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటివరకు పసుపు బోర్డు ఏర్పాటు కాలేదు. బదులుగా రీజనల్ స్పైస్ బోర్డును కేంద్రం కేటాయించింది. అయితే ఎంపీగా గెలిచి నాలుగేళ్లు దాటినా ఇంకా పసుపుబోర్డు తేలేకపోయారని అరివ్డ్‌ను విమర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు ఇలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు బీజేపీ శ్రేణులు చెప్తున్నాయి.



డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన పసుపు బోర్డు

మేం కూడా ఫ్లెక్సీలు పెట్టగలం: ఎంపీ అర్వింద్

పసుపు బోర్డు అంటూ ఫ్లెక్సీలు పెట్టగానే సరిపోదని.. తాము కూడా బీఆర్ఎస్ హామీలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగలమని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. రైతుల మేలు కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటూ వెంటనే సీఎంతో ఎమ్మెల్యేలు లేఖ రాయించాలని సూచించారు. 'పసుపు బోర్డు' ఫ్లెక్సీల నేపథ్యంలో ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్‌లో తప్ప దేశంలో ఎక్కడా రూ.30 కోట్లతో ప్రత్యేకంగా ఒక పంట కోసం స్పైస్ బోర్డు ఏర్పాటు చేయలేదని చెప్పారు.

తెలంగాణకు ఐదు ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తొలిసారిగా ఐదు ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మంజూరు చేసింది. ఈ సీట్లను వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో భర్తీ చేసేందుకు అనుమతించారు. ఐదు నెఫ్రాలజీ సూపర్ స్పెషాలిటీ సీట్లను కూడా ఎన్ఎంసీ మంజూరు చేసింది. ఇప్పటివరకు ఎండీ ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు ఉస్మానియా, కాకతీయ మెడికల్ కాలేజీల్లోనూ అందుబాటులోకి రాలేదు. అలాంటిది కాకతీయకు రావడం గమనార్హం. గతంలో ఉస్మానియాకు ప్రయత్నించినా అనుమతి రాలేదు. కాగా, ఎమర్జెన్సీ మెడిసిన్ ఇప్పుడు అత్యంత కీలకమైన విభాగం. కేంద్రం నిబంధన మేరకు రాబోయే రోజుల్లో ప్రతీ మెడికల్ కాలేజీలోనూ 30 పడకల ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం అందుబాటులోకి రానుందని డీఎంఈ రమేశ్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఆ మేరకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి.

ఎంసెట్-23 పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు

- యూజీ నీట్, టీఎస్‌పీఎస్సీ పరీక్షల నేపథ్యంలో నిర్ణయం
- ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు మే 12 నుంచి 14 వరకు
- అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలు మే 10 నుంచి 11 వరకు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్–2023 పరీక్ష తేదీల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటికే ప్రకటించిన తేదీల్లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో యూజీ నీట్ పరీక్షలు జరగనుండగా.. మరోవైపు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు సైతం ఉన్నాయి. దీంతో టీఎస్ ఎంసెట్–2023 పరీక్ష తేదీల్లో స్వల్ప మార్పులు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం టీఎస్‌ఎంసెట్–2023 ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు మే నెల 7 నుంచి 9వరకు జరగాల్సి ఉంది. తాజా నిర్ణయంతో ఈ పరీక్షలు మే నెల 12 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇక అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలు నిర్దేశించిన తేదీల్లోనే జరుగుతాయన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలు మే 10వ తేదీ, 11వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఇదివరకే ప్రకటించింది.

నెల రోజుల్లో పరిశీలన.. ఆపై ఉపకారవేతనాలు

- ఆ తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు
- ఉపకార దరఖాస్తులకు ముగిసిన గడువు
- నమోదు చేసుకున్న పోస్టుమెట్రిక్ విద్యార్థులు 12.59 లక్షలు



సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. మార్చి 31తో దరఖాస్తుల స్వీకరణ ముగియగా... మొత్తం 12,59,812 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో రెన్యువల్స్ 7,36,799 కాగా, ఫ్రెషర్స్ దరఖాస్తులు 5,23,013 ఉన్నాయి. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో ప్రకటన విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తూ... డిసెంబర్ 31 వరకు గడువు విధించింది. కానీ వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికావడంలో తీవ్ర జాప్యం జరగడంతో జనవరి 31 వరకు గడువు పొడిగించారు. కానీ అప్పటి వరకూ అడ్మిషన్లు కొనసాగుతుండటంతో చివరి అవకాశం కింద మార్చి 31 వరకు గడువు పొడిగించారు. ఇప్పుడు దరఖాస్తుల గడువు ముగియడంతో అధికారులు వాటి అర్హత నిర్ధారణపై దృష్టి సారించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన వెంటనే సంక్షేమ శాఖలు అందుబాటులో ఉన్న నిధులను ముందుగా ఉపకారవేతనాలు విడుదల చేసి, ఆ తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు చేపట్టనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

నెలరోజుల్లో పరిశీలన పూర్తి...

ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల పరిశీలనకు సంక్షేమ శాఖలు నెలరోజుల గడువును నిర్దేశించుకున్నాయి. ఏప్రిల్ ఆఖరు కల్లా వీటిని పరిశీలించి అర్హులను నిర్ధారించాలని నిర్ణయించాయి. ఈమేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖల జిల్లా అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. ఆన్‌లైన్లో వచ్చిన దరఖాస్తులు ముందుగా సంబంధిత కాలేజీ యాజమాన్యం యూజర్ ఐడీకి చేరతాయి. కళాశాల ప్రిన్సిపల్ దరఖాస్తులను పరిశీలించి వాటిని సంక్షేమాధికారికి ఫార్వర్డ్ చేస్తారు. అక్కడ ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులను నిర్ధారిస్తారు. మరోవైపు కాలేజీ యాజమాన్యం ఆమోదం తెలిపిన తర్వాత ప్రతి విద్యార్థి మీసేవా కేంద్రాల్లో వేలిముద్రలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ తంతు పూర్తయ్యాక సంక్షేమ శాఖలు సదరు దరఖాస్తును ఆమోదిస్తాయి. ఈ ప్రక్రియ కోసం సంక్షేమ శాఖలు నెలరోజులు గడువు నిర్దేశించుకున్నప్పటికీ మరింత ఎక్కువ సమయం పడుతుందని క్షేత్రస్థాయి అధికారులు చెబుతున్నారు. పరీక్షలు, ప్రిపరేషన్ నేపథ్యంలో విద్యార్థులు వేలిముద్రలు సమర్పించడంలో జాప్యం జరుగుతుందని, ఏటా ఇదే జాప్యం వల్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు.

2022-23లో ఉపకార, ఫీజు దరఖాస్తులు ఇలా

కేటగిరీ	రెన్యువల్స్	ఫ్రెషర్స్
ఎస్సీ	1,30,725	95,517
ఎస్టీ	74,766	58,174
బీసీ	3,95,237	2,76,714
డిజేబుల్	55	40
ఈబీసీ	46,533	19,654
మైనారిటీ	89,483	72,914
మొత్తం	7,36,799	5,23,013



స్వామి వారి పట్టాభిషేకం వేడుకను తిలకిస్తున్న భక్తజనం

పట్టాభిషిక్తుడైన రామయ్య

భద్రాచలంలో వైభవంగా పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం

- స్వర్ణ సింహాసనంపై కొలువుదీరిన సీతారాములు
- పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ తమిళిసై

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సకలగుణాభిరాముడి పట్టాభిషేక మహోత్సవం భద్రాచలంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి తెల్లవారి రామచంద్ర మూర్తికి పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. రామాలయ ప్రాంగణంలోని యాగశాలలో ఉదయం చతుఃస్థానార్చన హోమం నిర్వహించారు. ఆ తర్వాత శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన రాజాధిరాజు రామయ్య, పట్టమహిషి సీతమ్మవారు, యువరాజు లక్ష్మణుడితోపాటు భక్తాగ్రేసరుడు ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలను భక్తుల జయజయ ధ్వానాల నడుమ అయోధ్యాపురం (మిథిలా స్టేడియం) తీసుకొచ్చి స్వర్ణ సింహాసనంలో వేంచేపు చేశారు.

తొలిసారిగా సీతమ్మకు..

పుష్కర పట్టాభిషేకంలో అపూర్వఘట్టం చోటుచేసుకుంది. సీతమ్మ జన్మించిన శోభకృత్ నామ సంవత్సరంలో పుష్కర పట్టాభిషేకం రావడంతో అమ్మవారికి తొలిసారిగా రాణీమకుటాన్ని ధరింపజేశారు. అనంతరం పంచశత నదులు, నాలుగు సముద్రాలు, పుణ్యతీర్థాలు, 12 నదుల నుంచి తెప్పించిన జలాలతో లక్ష్మణ సమేత సీతారాములకు ప్రోక్షణ చేశారు. చివరగా సీతారాములు ధరించిన ముత్యాల దండను రామభక్తుడైన ఆంజనేయుడి మెడలో వేశారు. అనంతరం హారతి సమర్పణతో పట్టాభిషేక ఘట్టం ముగిసింది. భద్రాచల ఆలయ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర గవర్నర్ తమిళిసై పట్టాభిషేకం సందర్భంగా సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు గవర్నర్ శుక్రవారం తెల్లవారుజామున రైలుమార్గంలో కొత్తగూడెం చేరుకున్నారు. కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీవో గౌతమ్ పాత్రు గవర్నర్‌కు స్వాగతం పలికారు.భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న తర్వాత నేరుగా పట్టాభిషేకం జరిగే అయోధ్యాపురానికి చేరుకున్నారు. పట్టాభిషేకం ముగిసే వరకు అక్కడే ఉన్నారు. ఆమెతోపాటు మంత్రి సత్యవతి రాథోడ్ ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. కాగా గవర్నర్ పర్ణశాల పర్యటన రద్దయింది.

2046లో మహాసామ్రాజ్య పట్టాభిషేకం..

రామరాజ్య స్థాపన లక్ష్యంగా శ్రీరామపట్టాభిషేకం ప్రతి ఏటా నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది జరిగిన పుష్కర పట్టాభిషేకం తిరిగి 2035లో, 60 ఏళ్లకు ఓసారి జరిగే మహాసామ్రాజ్య పట్టాభిషేక వేడుకలు 2046లో జరగనున్నాయి.

ఏ సీమదానవో ఎగిరెగిరి వచ్చావు..

ముద్దు మాటలతో అలరిస్తున్న రామచిలుక



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముద్దుముద్దుగా పసిపిల్లలు అమ్మా.. అని పిలిస్తే చిలక పలుకులంటూ.. మురిసిపోతాం. అలాంటిది, నిజంగానే రామచిలుకే అమ్మా.. అంటుంటే.. కుటుంబ సభ్యుల్ని వారి పేర్లతో పిలుస్తుంటే.. ఆ ఆనందమే వేరు. వివరాలివి. సిద్దిపేట హౌసింగ్ బోర్డుకాలనీలోని జర్నలిస్ట్ వీధిలో కూతురు రాజిరెడ్డి, వనజ రెడ్డిల ఇంటి పైకి రోజూ ఓ రామచిలుక వచ్చి సందడి చేస్తోంది. నెల రోజులుగా రోజూ ఉదయం 6గంటలకే వచ్చి కుటుంబ సభ్యులను నిద్ర లేపుతుంది. చిన్నారులతో ఆడుకుంటుంది. వనజరెడ్డిని అమ్మా.. అని, పిల్లలను టింకు.. అని పిలుస్తుంది. ఎత్తుకో, టాటా, బాయ్ అంటుంది. దీంతో రాజిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు, కాలనీవాసులు సంబరపడిపోతున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి 7.30 గంటల వరకు ఉండి పాలు, నీరు తాగుతుంది. జామ, మామిడి, ఆపిల్, తదితర పండ్లు, బిస్కెట్లు తిని వెళ్లిపోతుంది. సాయంత్రం 5గంటల సమయంలో వచ్చి మళ్లీ 6 గంటల వరకు తిరిగి వెళ్లిపోతుంది. ఈ చిలుక ఎక్కడి నుంచి వస్తుంది...ఎక్కడికి పోతుందనేది మాత్రం ఎవరికీ తెలియడం లేదు. నెల రోజులుగా ఈ రామచిలుక రాజిరెడ్డి, వనజరెడ్డిల కుటుంబ సభ్యుల్లో ఒకటిగా మారిపోయింది.

> **శ్రీరాముడే వచ్చినట్టుంది**
>
> రామచిలుక రోజూ మా ఇంటికి వచ్చి అమ్మా. అని పిలుస్తుంటే సంతోషంగా ఉంది. శ్రీ రామనవమి ముందు మా ఇంట్లోకి వచ్చింది కాబట్టి.. శ్రీ రాముడే వచ్చినట్టు అనిపిస్తోంది.
>
> – వనజరెడ్డి, సిద్దిపేట

పుట్టుక.. పెళ్లి.. ప్రసవం.. ఒకే రోజున..



నర్సంపేట: వారు కలిసి ఒకే రోజున పుట్టారు.. అలాగే ఒకే రోజున పెళ్లి కూడా చేసుకున్నారు.. అంతవరకూ ఓకే.. అయితే.. ఇప్పుడు ఒకే రోజున పిల్లలకు జన్మను కూడా ఇచ్చారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తిమ్మంపేటకు చెందిన బొంత సారయ్య కొమురమ్మ కుమార్తెలు లలిత, రమ కవలలు. కవలలు కావడంతో తగిన సంబంధం చూసి.. గతేడాది వీరికి ఒకే వేదిక మీద.. ఒకే రోజున పెళ్లిళ్లు జరిపించారు. అయితే.. ఆశ్చర్యకరంగా వీరు ఒకే రోజున అంటే.. గురువారం సాయంత్రం నర్సంపేట ప్రభుత్వాస్పత్రిలో మగ శిశువులకు జన్మనిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఇరువురికీ కేసీఆర్ కిట్‌ను అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహ పనులను పరిశీలించిన మంత్రులు



అంబేడ్కర్ విగ్రహ తయారీ పనులను పరిశీలిస్తున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు. చిత్రంలో మల్లారెడ్డి, ఎర్రబెల్లి, కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, ఎర్రోళ్ల శ్రీనివాస్, తలసాని, మేయర్ విజయలక్ష్మి

ఖైరతాబాద్ (హైదరాబాద్): హైదరాబాద్ నగరం నడిఒడ్డున అత్యంత ఎత్తులో నిర్మిస్తున్న 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహ పనులను శుక్రవారం మంత్రుల బృందం పరిశీలించింది. ఎస్సీ అభివృద్ధి సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి విగ్రహాన్ని పరిశీలించారు. ప్రధాన విగ్రహంతో పాటు అక్కడ నిర్మిస్తున్న రాక్ గార్డెన్, ల్యాండ్‌స్కేపింగ్, ప్లాంటేషన్, మెయిన్ ఎంట్రన్స్, వాటర్ ఫౌంటెన్, సాండ్ స్టోన్ వర్క్స్, జీఆర్సీ, గ్రానైట్ ఫ్లోరింగ్, లిఫ్ట్, విగ్రహం వద్దకు చేరుకునే మెట్లదారి, ర్యాంప్, బిల్డింగ్‌లోపల ఆడియో విజువల్ రూం, ఫాల్స్ సీలింగ్ తదితర పనులను పరిశీలించి మంత్రులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు, వర్క్ ఏజెన్సీతో మంత్రులు సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. విగ్రహ నిర్మాణ కోసం 791 టన్నుల స్టీల్, 96 మెట్రిక్ టన్నుల ఇత్తడి ఉపయోగించామని అధికారులు తెలిపారు. మరో వారం రోజుల్లో నిర్మాణ పనులన్నీ పూర్తి చేసే లక్ష్యంతో సిబ్బంది పని చేస్తున్నారని కొప్పుల వెల్లడించారు. దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేడ్కర్ విగ్రహంగా ఇది తెలంగాణకే మణిహారంగా నిలుస్తుందని చెప్పారు. అంబేడ్కర్ జయంతి రోజు అయిన ఏప్రిల్ 14న ఈ విగ్రహాన్ని ప్రారంభించాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.